శుక్రవారం
30-09-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 100
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

తిరగబడ్డ దళిత బిడ్డ
7లో
మొదటి పోరాటమే ఉత్సాహాన్నిచ్చింది
పడినప్పుడల్లా లేచిన కెరటం

ఫ్లోరిడాలో ఇయాన్ బీభత్సం

జలదిగ్బంధంలో రాష్ట్రం
చిమ్మచీకటిలో 25 లక్షల మంది

- గంటకు 665కిమీల వేగంతో ఈదురుగాలులు
- విరిగిపడ్డ చెట్లు - కొట్టుకుపోయిన వంతెన-ఇళ్ల పైకప్పులు-వాహనాలు
- కాలువలో పడి వృద్ధుడి మృతి
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- వీధుల్లో షార్కుల సంచారం - వెయ్యి ఏళ్లలో ఒకసారి వచ్చే భీకర తుపాను

2లో

జగన్ సర్కార్‌కు మరో ఎదురుదెబ్బ

స్త్రీ, శిశు సంక్షేమశాఖలో ఏవో నియామకాలపై హైకోర్టు స్టే

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. స్త్రీ శిశు సంక్షేమశాఖలో విస్తరణ అధికారుల నియామకాలపై ఏపీ హైకోర్టు స్టే ఇచ్చింది. మొత్తం 560 మంది విస్తరణ అధికారుల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే ఏవో పోస్టుల భర్తీలో భారీస్థాయిలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, తక్షణమే పరీక్షా ఫలితాలను నిలిపివేయాలని కోరుతూ బుధవారం హైకోర్టులో లంచ్‌మోషన్ పిటీషన్ దాఖలైంది. ఈనెల 18న పోస్టుల భర్తీకి రాత పరీక్షలు నిర్వహించగా, దాదాపు 38 వేల మంది అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. ఇంగ్లీష్ భాషలో కూడా పరీక్ష పెట్టాల్సి ఉండగా, అది పెట్టకుండానే అధికారులు పంపించివేశారు. ముందుగానే పోస్టుల భర్తీకి మాట్లాడుకొని డబ్బులు వసూలు చేశారు. ఒక్కో పోస్టుకు సుమారు రూ.10 లక్షలు వసూలు చేశారని ఆరోపించడంతో పాటు, ముందుగా ఎంపిక చేసుకున్న అభ్యర్థులకు ఇంగ్లీష్ లాంగ్వేజ్ టెస్ట్ పెట్టి సెలెక్ట్ చేసుకున్నారని పిటీషనర్ పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు. ఫలితాలు గురువారం వెలువడనుండటంతో వాటిని నిలిపివేయాలని పిటీషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ

కేసులో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులను, ప్రభుత్వ ఉన్నతాధికారులను పిటీషనర్ ప్రతివాదులుగా చేర్చారు. దీంతో ఉదయం ఈ పిటీషన్‌ను విచారించేందుకు ధర్మాసనం అనుమతించింది. ఆ మేరకు విచారణ చేపట్టిన హైకోర్టు ఇరుపక్షాల వాదనలు అనంతరం అన్ని జోన్‌లలో నియామక ప్రక్రియపై హైకోర్టు స్టే విధించింది. ఆరు వారాల్లో స్టే వెకేషన్ అనంతరమే నియామక ప్రక్రియ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

థరూర్ వర్సెస్ దిగ్విజయ్

- స్నేహపూర్వక పోటీ అంటున్న నేతలు
- పోటీ నుంచి తప్పకున్న గెహ్లాట్
- నామినేషన్లకు చివరి తేదీ నేడు

న్యూదిల్లీ:
కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికకు సంబంధించి కొన్ని రోజులుగా అనేక మలుపులు.. నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. తాజాగా కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికపై ఓ మేరకు స్పష్టత వచ్చినట్లు కనిపిస్తోంది. రాజస్థాన్ సంక్షోభ పరిస్థితులకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అధ్యక్ష పోటీ నుంచి వైదొలిగారు. ఇదే సమయంలో సీనియర్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ బరిలోకి దిగారు. అటు ఎంపీ శశిథరూర్ పోటీ ఇప్పటికే ఖాయమైంది. దీంతో ప్రస్తుతానికి కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వ పదవికి వీరిద్దరి మధ్యే పోటీ నెలకొంది. ఈ క్రమంలోనే థరూర్, దిగ్విజయ్ గురువారం సమావేశమయ్యారు. ఇందుకు సంబంధించిన ఫొటోను థరూర్ తన ట్విటర్ ఖాతాలో పోస్ట్ చేశారు. 'పార్టీ అధ్యక్ష ఎన్నికకు దిగ్విజయ్ పోటీని స్వాగతిస్తున్నా. మాది ప్రత్యర్థుల మధ్య జరిగే యుద్ధం కాదు. సహోద్యోగుల స్నేహపూర్వక పోటీ అని మేం పరస్పరం అంగీకరించాం. మాలో ఎవరు గెలుస్తారన్నది కాదు... అంతిమంగా కాంగ్రెస్ గెలవాలన్నదే మా లక్ష్యం' అని థరూర్ ట్వీట్ చేశారు. దీనికి దిగ్విజయ్ సింగ్ రీట్వీట్ చేస్తూ థరూర్ వ్యాఖ్యలతో ఏకీభవించారు. 'మా పోరాటం మతవాద శక్తులపైనే. గాంధీ-నెహ్రూ సిద్ధాంతాలపై మా ఇద్దరికీ విశ్వాసం ఉంది. థరూర్‌కు ఆల్ ది బెస్ట్' అని దిగ్విజయ్ తెలిపారు.

అధ్యక పదవికి నామినేషన్ సమర్పించేందుకు శుక్రవారమే (సెప్టెంబరు 30) ఆఖరి తేదీ. థరూర్, దిగ్విజయ్ ఇద్దరూ నామినేషన్ వేయనున్నారు. ఇప్పటివరకైతే రేసులో ఇంకెవరి పేర్లూ వినిపించట్లేదు. దీంతో వీరిద్దరి మధ్యే పోటీ ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో దిగ్విజయ్ గెలుపు ఖాయమే అనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, రాజ్యసభ ఎంపీ అయిన దిగ్విజయ్.. గాంధీ కుటుంబానికి విధేయుడు. పార్టీలోనూ ఆయనకు మద్దతు ఎక్కువగానే ఉంది. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం విధానాలను వ్యతిరేకిస్తూ లేఖ రాసిన జి-23 బృందంలో శశిథరూర్ ఒకరు. ఆయన పోటీపై అటు సొంత రాష్ట్రం కేరళ నుంచే గాక, చాలామంది పార్టీ సీనియర్ నేతలు బహిరంగంగానే అభ్యంతరాలు వ్యక్తం చేశారు. నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అక్టోబరు 8 వరకు గడువు ఉంది. అక్టోబరు 17న ఓటింగ్ నిర్వహించనున్నారు. అక్టోబరు 19న ఓట్లను లెక్కించిన తరువాత ఫలితం ప్రకటించనున్నారు.

అసంపూర్తి చర్చలు

పోలవరంపై ఆ మూడు గరం గరం

- కేంద్ర జలశక్తి సమావేశంలో వాడివేడీ చర్చ
- ముంపు సమస్యపై తెలంగాణ వాదనలు
- ప్రజాభిప్రాయ సేకరణే జరగలేదన్న ఒడిశా, చత్తీస్‌గఢ్
- కేంద్ర డిజైన్ల ప్రకారమే ప్రాజెక్టు నిర్మాణమన్న పీపీఏ చైర్మన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో తలెత్తే పర్యావరణ సమస్యలు, పొరుగు రాష్ట్రాలు లేవనెత్తుతున్న అభ్యంతరాలపై పరిష్కార మార్గాలు అన్వేషించేందుకు తెలంగాణ, ఒడిశా, చత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో కేంద్ర జలశక్తి శాఖ గురువారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశం గరం గరంగా సాగి అసంపూర్తిగా ముగిసింది. ఆయా రాష్ట్రాల వాదనలు వాడివేడిగా సాగాయి. ఏపీ లక్ష్యంగా మూడు రాష్ట్రాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. అయితే ఈ విషయంలో ఏపీకి కేంద్రం అండగా నిలిచింది. గోదావరి ట్రిబ్యునల్‌కు కట్టుబడి, కేంద్రం ఆమోదించిన డిజైన్ల ప్రకారమే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని, దానివల్ల ఎవరికీ నష్టం రాదని పీపీఏ చైర్మన్ ఆర్కే గుప్తా స్పష్టం చేశారు. ఏపీ సీఎస్ సమీర్ శర్మ...ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి పొరుగు రాష్ట్రాలతో ఉన్న సమస్యలను పీపీఏ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. పొరుగు రాష్ట్రాల వాదనలను ఏపీ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. పోలవరం బ్యాక్ వాటర్ వల్ల తెలంగాణ రాష్ట్రానికి ముప్పు పొంచి ఉందని, దానిపై థర్డ్ పార్టీతో విచారణ జరిపించాలని తెలంగాణ డిమాండ్ చేసింది. పోలవరం ప్రాజెక్టు ఎత్తు పెంచడం వల్ల అంచనాకు మించి తమ రాష్ట్రానికి ముప్పు వాటిల్లుతుందని గణాంకాలతో సహా కేంద్ర జలశక్తి శాఖ ముందు తెలంగాణ అధికారులు వినిపించారు. చారిత్రక ప్రదేశాలు, విద్యుత్ కేంద్రం ముంపునకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ముంపు నివారణ చర్యలు చేపట్టాలని కేంద్ర జలశక్తి శాఖను కోరింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, దీనివల్ల ముంపు సమస్య తీవ్రంగా ఉందని ఒడిశా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలు తెలిపాయి. కనీసం ముంపు సమస్యపై ప్రజాభిప్రాయ సేకరణ జరపలేదని ఆరోపించాయి. దీనిపై ఇప్పటికే రెండుసార్లు అధ్యయనం చేశామని, పోలవరం వల్ల భద్రాచలానికి ఎలాంటి ముంపు ఉండదని కేంద్రం తేల్చిచెప్పింది. అయితే మూడు రాష్ట్రాలు ఒకేమాటగా ఎట్టి పరిస్థితుల్లో పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించాల్సిందేనని పట్టుబట్టాయి. ప్రజాభిప్రాయ సేకరణకు ఒడిశా, చత్తీస్‌గఢ్ సహకరించట్లేదని ఏపీ తెలిపింది. మొత్తానికి కేంద్ర జలశక్తి సమావేశం అసంపూర్తిగా ముగియగా, అక్టోబర్ 7న మరోసారి సమావేశం కావాలని కేంద్ర జలశక్తి నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి ఒడిశాలో

- మిగతా 2 లో

మహిళలందరికీ 'గర్భస్రావ హక్కు'

- వైవాహిక అత్యాచారానికి గుర్తింపు
- సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు

న్యూదిల్లీ:
వివాహిత లేదా అవివాహిత ఎవరైనా సరే... మహిళలందరికీ సమాన గర్భస్రావం (అబార్షన్) హక్కులను కల్పిస్తూ సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. అదే సమయంలో వైవాహిక అత్యాచారానికి చట్టబద్ధ గుర్తింపునిచ్చింది. అత్యాచారం నిర్వచనంలో వైవాహిక అత్యాచారా (రేప్)న్ని కూడా జోడించాలని స్పష్టం చేసింది. వివాహిత మహిళ సమ్మతి లేకుండా జరిగే కలయిక తోనూ ఆమె బలవంతంగా గర్భం దాల్చే అవకాశముందని కోర్టు అభిప్రాయపడింది. బలవంతంగా గర్భం దాల్చితే అది అత్యాచారం కిందకే వస్తుందని పేర్కొంది. ఇలాంటి గర్భధారణల నుంచి మహిళలను కాపాడాల్సిన అవశ్యతక ఉందని జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేపీ పార్దీవాలా, జస్టిస్ బోపన్నలతో కూడిన సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. తద్వారా ప్రస్తుతం దేశంలో విస్తృతంగా చర్చ జరుగుతున్న వైవాహిక అత్యాచార కేసుల్లో తీర్పులకు ఈ వ్యాఖ్యలు ఓ మార్గం చూపించే

- మిగతా 2 లో

ఎస్పీ అధ్యక్షుడిగా మూడోసారి అఖిలేశ్

బీజేపీపై తీవ్ర విమర్శలు

సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడిగా అఖిలేశ్ యాదవ్ (49) గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లక్నోలో జరిగిన పార్టీ జాతీయ సదస్సులో ఈ సంగతి ప్రకటించారు.

2లో

మోటార్లకు మీటర్లు తప్పదు

- కొత్తగా 41 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు
- మార్చి నాటికి నూరుశాతం లక్ష్యం
- రైతు ఖాతాకే విద్యుత్ సబ్సిడీ
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తామని, రాయితీ మొత్తం రైతుల ఖాతాల్లో వేస్తామని ఇంధన, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడించారు. సచివాలయం మూడో బ్లాక్‌లో ఇంధన శాఖ అధికారులతో ఆయన గురువారం సమీక్ష చేశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఇప్పటివరకు 41 వేల కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేసిందని, మరో 77 వేల కొత్త కనెక్షన్లను రైతులకు ఇవ్వబోతుందన్నారు. రైతులకు సంబంధించిన ఉచిత విద్యుత్ భారాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోందని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తరువాత కూడా ఆ బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లాలో ప్రయోగాత్మకంగా వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి, రైతులు ఏ మేరకు విద్యుత్ వినియోగిస్తున్నారో అధికారులు అధ్యయనం చేశారని గుర్తుచేశారు. ఆ జిల్లాలో సాధారణంగా ఉచిత వ్యవసాయ విద్యుత్ వినియోగానికి ప్రభుత్వం చెల్లిస్తున్న మొత్తం కంటే, 30 శాతం తక్కువగానే రైతులు విద్యుత్ వినియోగిస్తున్నట్లు తేలిందన్నారు. దీంతో ఉచిత విద్యుత్ భారం ప్రభుత్వంపై 30శాతం తగ్గుతుందని గుర్తించామని, ఇదే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని, 2023 మార్చి నాటికి రాష్ట్రంలో 18 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో అధికారులు పనిచేయాలని సూచించారు. ఇప్పటికే 70శాతానికిపైగా రైతులు బ్యాంక్ ఖాతాలు

- మిగతా 2 లో

1 నుంచి ఎన్నికల బాండ్ల విక్రయం

న్యూదిల్లీ:
గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల తేదీలు సమీపిస్తున్న వేళ ఎన్నికల బాండ్లను కేంద్రం విక్రయానికి ఉంచింది. 22వ విడత ఎలక్ట్రోరల్ బాండ్ల విక్రయాలు అక్టోబర్ 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన 29 అధీకృత శాఖల్లో అక్టోబర్ 1 నుంచి 10వ తేదీ వరకు ఈ బాండ్లను కొనుగోలు చేయొచ్చని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. పార్టీలకు చెల్లించే నిధుల్లో పారదర్శకత కల్పించాలనే ఉద్దేశంతో 2018లో నరేంద్రమోదీ ప్రభుత్వం ఈ ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టింది. దీని కింద ఎన్నికల సంఘం ఆమోదించిన ఖాతా ద్వారా మాత్రమే ఆయా రాజకీయ పార్టీలకు నిధులు వెళతాయి. అర్హత కలిగిన రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చాలని భావించే వ్యక్తులు/సంస్థలు/కంపెనీలు ఈ బాండ్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. జారీ అయిన తేదీ నుంచి 15 రోజుల వరకే ఇవి చెల్లుబాటవుతాయి. ఎస్‌బీఐకి చెందిన లఖ్‌నవూ, సిమ్లా, డెహ్రాడూన్, కోల్‌కతా, గువాహటి, చెన్నై, పాట్నా, దిల్లీ, చండీగఢ్,

- మిగతా 2 లో

ఎస్‌డీజీ లక్ష్యాలే ప్రమాణం

- డిసెంబరుకల్లా 5లక్షల ఇళ్లు పూర్తి
- ఉపాధి హామీ కనీస వేతనం రూ.240
- 25న సచివాలయాల్లో ఈ-క్రాపింగ్ జాబితాలు
- 26న రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ
- నవంబరు 10న వసతి దీవెన
- కలెక్టర్లతో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
ఎస్‌డీజీ లక్ష్యాలపై కలెక్టర్లు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని, మీ పనితీరు, సమర్థత వాటి ఆధారంగానే నిర్ణయిస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. స్పందన కార్యక్రమంలో భాగంగా గురువారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పనుల మంజూరు, వ్యవసాయం, ఇ- క్రాపింగ్, ఉపాధి హామీ పనులు, వైయస్సార్ విలేజ్, అర్బన్ క్లినిక్కులు, గృహనిర్మాణం, ఇళ్ల పట్టాలు, జగనన్న భూ హక్కు - భూ రక్ష సర్వే, స్పందన అర్జీలు, జాతీయ రహదారులకు భూ సేకరణ అంశాలపై సమీక్షించారు. సీఎం జగన్ మాట్లాడుతూ ఎస్‌డీజీ లక్ష్యాల సాధనే కలెక్టర్ల లక్ష్యం కావాలన్నారు. అందుకోసం డేటాను సక్రమంగా అప్‌లోడ్ చేయాలన్నారు. అప్పుడే ఎస్‌డీజీల్లో మార్పులు కనిపిస్తాయని, ఈ లక్ష్యాలపై మన రాష్ట్రమే కాకుండా దేశం మొత్తం చూస్తుందని చెప్పారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలనుంచి వచ్చే అభ్యర్థనల మేరకు ప్రాధాన్యత పనుల కోసం ప్రతి గ్రామ, వార్డు సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించినందున ఈ పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి ఆలస్యానికీ, అలసత్వానికీ తావు ఉండకూడదని హెచ్చరించారు. రాష్ట్రంలో 15,004 గ్రామ, వార్డు సచివాలయాలను ఈ కార్యక్రమం ద్వారా కవర్ చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మండల స్థాయి సిబ్బంది నెలలో కనీసం 6 సచివాలయాలను సందర్శించాలని నిర్దేశించారు. ఎమ్మెల్యే గ్రామ,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

రష్యా గ్యాస్ పైప్‌లైన్‌లో కొత్త లీక్: స్వీడన్

రష్యన్ సహజ వాయువును బాల్టిక్ సముద్ర మార్గం ద్వారా జర్మనీకి తీసుకువెళ్లే ప్రధాన పైప్‌లైన్ నార్డ్‌స్ట్రీమ్1, 2 లో స్వీడన్ కొత్త లీక్‌లు కలవరపెడుతున్నాయి. ఇది ఈ వారంలో కనుగొన్న నాల్గవది. డెన్మార్క్, స్వీడన్ ఈ వారం ప్రారంభంలో నార్డ్ స్ట్రీమ్ 1,2 పైప్‌లైన్‌లలో గ్యాస్ లీక్‌లను గుర్తించింది. అయితే ఈ లీకేజీలు "ఉద్దేశపూర్వకంగా, నిర్లక్ష్యపూరితంగా, బాధ్యతారహితమైన విధ్వంసక చర్యల" ఫలితమేనని నాటో వాదన. వాతావరణముప్పుకు కారణమని అందోళన వ్యక్తంచేసింది. భారీ పేలుళ్లవల్లే ఈ లీకేజీలు సంభవించాయని శాస్త్రవేత్తల అంచనా. క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ, లీకేజీల గురించి తాను చాలా ఆందోళన చెందుతున్నానని, ఉద్దేశపూర్వకంగా దాడి చేసే అవకాశాన్ని తోసిపుచ్చలేమని అన్నారు. ఉక్రెయిన్‌కు మద్దతిచ్చినందుకు

ప్రతీకారంగా రష్యా గ్యాస్ సరఫరాను పశ్చిమ దేశాలకు వ్యతిరేకంగా ఆయుధంగా ఉపయోగిస్తోందని నాటో ఆరోపణ. నార్డ్ స్ట్రీమ్ 1,2 గ్యాస్‌ను రవాణా చేయడం లేదు, అయినప్పటికీ అవి రెండూ గ్యాస్‌ను కలిగి ఉన్నాయి. నార్డ్‌స్ట్రీమ్ 1 సెయింట్ పీటర్స్‌బర్గ్ సమీపంలోని రష్యన్ తీరం నుండి ఈశాన్య జర్మనీ వరకు బాల్టిక్ సముద్రం క్రింద 1,200 కిమీ (745 మైళ్ళు) విస్తరించి ఉంది. ఫిబ్రవరిలో రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసిన తర్వాత నార్డ్ స్ట్రీమ్ 2 నిలిపివేయడమైంది. బాల్టిక్ సముద్రం ఉపరితలం వద్ద 1కిమీ వ్యాసం కలిగిన బుడగలు కనిపించే లీక్‌ల ఫుటేజీని డెన్మార్క్ డిఫెన్స్ కమాండ్ విడుదల చేసింది. ఈ లీకేజీల ద్వారా విడుదలయ్యే వాయువు వాతావరణంపై ప్రభావం చూపడంతోపాటు సముద్రజీవులకు కూడా ముప్పుగా మారనుంది. పైప్‌లోని మీథేన్ వాతావరణ ప్రభావం దాదాపు 2.5 గంటల ప్రపంచ కర్బన ఉద్గారాలకు సమానం కావచ్చని ఒక అమెరికన్ శాస్త్రవేత్త అంచనా వేశారు.

రష్యాలో విలీనానికి ఉక్రెయిన్ ప్రాంతాల మొగ్గు

కీవ్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం అధికారికంగా 15 శాతం ఉక్రేనియన్ భూభాగాన్ని స్వాధీనం చేసుకోవడం ప్రారంభించారు. రష్యాకు నాలుగు ఉక్రేనియన్ ప్రాంతాలను కలుపుకునేందుకు క్రెమ్లిన్‌లో సంతకాల కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మాట్లాడుతూ, "రష్యన్ ఫెడరేషన్‌లో కొత్త భూభాగాల ప్రవేశానికి సంబంధించిన ఒప్పందాల ప్రక్రియ" శుక్రవారం ప్రారంభమైంది. రిఫరెండమ్‌లు నిర్వహించిన డొనాట్స్క్‌లో 99శాతం, లుహాన్స్క్‌లో 98శాతం,జపోరిజియాలో 93శాతం,ఖెర్సన్‌లో87శాతం రష్యాలో విలీనానికి ఓటువేశారు. రష్యాలో ప్రాంతాలను విలీనం చేయాలనే పుతిన్ నిర్ణయం అంటే మాస్కో తూర్పు, దక్షిణ ఉక్రెయిన్‌లోని విస్తారమైన ప్రాంతాలను కలుపుతుంది, ఇది ఉక్రెయిన్ మొత్తం భూభాగంలో 15 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. క్రెమ్లిన్‌లో సంతకాల వేడుకల అనంతరం పుతిన్ ప్రధాన ప్రసంగం చేస్తారని, ఉక్రెయిన్ ప్రాంతాల నిర్వాహకులతో సమావేశమవుతారని క్రెమ్లిన్ తెలిపింది.

ప్రజల భద్రత ఇరాన్ రెడ్‌లైన్

టెహ్రాన్ : ఇరాన్‌లో హిజాబ్ వ్యతిరేక నిరసనలు పెరగడంతో, ఇరాన్ అధ్యక్షుడు హెచ్చరికలు జారీ చేశారు. చట్టాన్ని ఉల్లంఘించి "గందరగోళం" కలిగించడానికి ఎవరికీ అనుమతి లేదని దేశవ్యాప్తంగా నిరసనల మధ్య ఇబ్రహీం రైసీ అన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తూ అల్లర్లకు పాల్పడేవారిని అనుమతించం. హింసాత్మక ఘటనల్లో పాల్గొనేవారికి కఠిన శిక్షలుంటాయి. ఇది ప్రజల నిర్ణయం అని రైసీ స్పష్టం చేశారు. "అల్లర్లలో పాల్గొన్న వారితో నిర్ణయాత్మకంగా వ్యవహరించాలి, ఇది ప్రజల డిమాండ్" అని పేర్కొన్నారు. "ప్రజల భద్రత అనేది ఇరాన్ రెడ్ లైన్. దీన్ని ఉల్లంఘించడానికి, గందరగోళం కలిగించడానికి ఎవరికీ అనుమతిలేదు" అని ఆయన అన్నారు. ఇరాన్‌కు శత్రువైన అమెరికానే ఈ గందరగోళానికి ఆజ్యంపోస్తోందని రైసీ ఆరోపించారు. జాతీయ ఐక్యతను లక్ష్యంగా ప్రజలను ఒకరికొకరు ఎదుర్కోవాలను కుంటున్నారు" అని పేర్కొన్నారు. "స్త్రీ, జీవితం, స్వేచ్ఛ!" అని ఇరాన్‌లో నిరసనకారులు నినాదాలు చేశారు. నిరసనలో భాగంగా మహిళలు వారి తలపై కండువాలు కాల్చారు.

వారి జుట్టును కత్తిరించుకున్నారు. ఇరాక్‌లోని కుర్దిస్తాన్ ప్రాంతంలో కుర్దిష్ సాయుధ బలగాలు అశాంతికి ఆజ్యం పోయడంతో ఇరాన్ సరిహద్దు క్షిపణి, డ్రోన్‌లతో దాడులను ప్రారంభించింది. అమిని మరణం తర్వాత దాదాపు 60 మంది మరణించినట్లు ఫార్స్ వార్తా సంస్థ మంగళవారం తెలిపింది. ఓస్లోకు చెందిన గ్రూప్ ఇరాన్ హ్యూమన్ రైట్స్ అణిచివేతలో కనీసం 76 మంది మరణించారని చెప్పారు. ఇరాన్‌లో నిరసనలపై ఐక్యరాజ్యసమితి ఆందోళనను వెలిబుచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఇరాన్ ప్రభుత్వ దమనకాండను ఖండించింది.

మహిళలందరికీ 'గర్భస్రావ హక్కు'

(మొదటిపేజీ తరువాయి)

అవకాశముందని పేర్కొంది. మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(ఎంటీపీ) చట్టానికి సంబంధించిన ఓ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మేరకు తీర్పు చెప్పింది. చట్టప్రకారం మహిళలందరికీ సురక్షితంగా గర్భస్రావం చేయించుకునే హక్కుందని తేల్చి చెప్పింది. ఎంటీపీ చట్టం నిబంధనల ప్రకారం వివాహం అయినా కాకపోయినా గర్భం దాల్చిన 24 వారాల వరకు అబార్షన్ చేయించుకునే హక్కుందని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఈ విషయంలో వివాహితులు, అవివాహితులు అని వివక్ష చూపించడం సరికాదని తెలిపింది. ఈ అంశం రాజ్యాంగం ఎదుట నిలబడదని స్పష్టం చేసింది. పెళ్లయిన వారిని 24 వారాల లోపు అబార్షన్‌కు అనుమతిస్తూ అవివాహితులను అనుమతించకపోవడం సరికాదన్న ధర్మాసనం... ఇప్పుడు కాలం మారిందని పేర్కొంది. చట్టం స్థిరంగా ఉండకూడదని సామాజిక వాస్తవాలకు అనుగుణంగా నిబంధనలు మారుతుంటాయని స్పష్టం చేసింది. ఎంటీపీ చట్టం ప్రకారం అత్యాచార బాధితులు, మైనర్లు, వివాహితులు, మానసిక సమస్యలతో ఉన్నవారు, పిండం సరిగ్గా అభివృద్ధి చెందని ఘటనల్లో మహిళలు 24 వారాల వరకు గర్భస్రావాలు చేయించుకునేందుకు అనుమతి ఉంది. అవివాహితులు తమ సమ్మతితో గర్భం దాలిస్తే అప్పుడు 20 వారాల వరకు మాత్రమే అబార్షన్ చేయించుకునే వీలుంది. తాజా తీర్పుతో ఇప్పుడు పెళ్లితో సంబంధం లేకుండా మహిళలందరూ గర్భం దాల్చిన 24 వారాలలోపు గర్భస్రావం చేయించుకోవచ్చు.

ఎస్‌డీజీ లక్ష్యాలే ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

మండల స్థాయి సిబ్బందితో కలిసి 2 రోజులు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయంలో ఉండాలని, ప్రతి ఇంటినీ కవర్ చేయాలని స్పష్టం చేశారు. ఒక రోజులో 6 గంటలపాటు గ్రామ, వార్డు సచివాలయంలో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించాలని, మండల అధికారులు, పాలనా సిబ్బంది, సచివాలయ సిబ్బంది అంతే సమయం గడపాల్సిందేనని తేల్చిచెప్పారు.

ఈ-క్రాప్ అన్నది అత్యంత ముఖ్యమైన కార్యక్రమమని, పొరపాట్లు లేకుండా కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నూటికి నూరుపాళ్లు పూర్తి చేయాలన్నారు. రైతులను పొలాల్లోకి తీసుకెళ్లి ఫొటో తీసుకుని, వివరాలు నమోదు అనేది సెప్టెంబరు 30లోగా పూర్తిచేయాలని సూచించారు. ఇక రెండోదశ కింద విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్వోలు బయోమెట్రిక్ ద్వారా వీటిని ఆధీకృతం చేయాలన్నారు. అక్టోబరు 3లోగా దీనిని పూర్తిచేయాలని చెప్పారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్వోలు-రైతుల కేవైసీలను అక్టోబరు 10లోగా పూర్తిచేయాలని జగన్ సూచించారు. అక్టోబరు 10 నుంచి రైతులకు ఇ- క్రాప్‌లో డిజిటల్ రశీదులు, ఫిజికల్ రశీదులు అక్టోబరు 15 లోగా ఇవ్వాలన్నారు. తర్వాత సోషల్ ఆడిట్ నిర్వహించి అక్టోబరు 25నుంచి వారం పాటు ఇ- క్రాప్ చేసిన తుది జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శించాలని తెలిపారు. నవంబరు 1 నుంచి ఈ తుది జాబితాను అన్ని పోర్టల్లలో అందుబాటులో ఉంచాలన్నారు. ఈ షెడ్యూల్ ప్రకారం ఇ-క్రాప్ పూర్తిచేసే బాధ్యత కలెక్టర్లదేనని సీఎం స్పష్టంచేశారు.

ఇక ఉపాధి హామీ పథకం కింద ఇప్పటివరకూ సగటు వేతనం రూ. 210.02గా ఉందని, దీనిని కనీసం రూ.240లకు పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గృహనిర్మాణం వల్ల ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని, డిసెంబర్ 21 నాటికి 5 లక్షల ఇళ్లు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జగనన్న కాలనీల్లో 3.5 లక్షలు, 1.5 లక్షల టిడ్కో ఇళ్లు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఈ ఇళ్లు పూర్తయ్యే నాటికి విద్యుత్, నీరు, డ్రైనేజ్... ఈ సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలన్నారు. జాతీయ రహదారులకు సంబంధించిన భూ సేకరణపై కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు. రైతు భరోసా రెండోవిడత అక్టోబరు 26న, అదేరోజు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని, వసతి దీవెన నవంబర్ 10న విడుదల చేస్తున్నామని సీఎం ప్రకటించారు. సమీక్షా వేశంలో ముఖ్యమంత్రి ప్రధానసలహాదారు అజేయ కల్లాం, సీఎస్ సమీర్ శర్మ, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి.సాయి ప్రసాద్, గృహనిర్మాణశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, రవాణా, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఏపీ టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మోటార్లకు మీటర్లు తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

తెరిచారని, అక్టోబర్ 15 నాటికి నూరుశాతం బ్యాంక్ ఖాతాలు తెరవడం, ఆధార్ లింకింగ్ ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. బ్యాంకులతోపాటు తపాలా కార్యాలయాల్లోనూ రైతులు ఖాతాలు తెరవవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను ఎలాంటి అంతరాయాలు లేకుండా అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై విపక్షాలు రైతుల్లో అపోహలు సృష్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్ రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. స్మార్ట్ మీటర్లు రైతుల్లో జవాబుదారీతనం, తమ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసే సబ్సిడీ మొత్తాన్ని వారే స్వయంగా డిస్కమ్‌లకు చెల్లించడం ద్వారా నాణ్యమైన విద్యుత్‌పై వారు ప్రశ్నించే హక్కును మరింతగా పొందుతారని అన్నారు. సమీక్షలో ఇంధనశాఖ కార్యదర్శి విజయానంద్, ట్రాన్స్‌కో సీఎండీ బి.శ్రీధర్, జేఎండీ పృథ్వీరాజ్, డిప్యూటీ సెక్రటరీ కుమార్‌రెడ్డి, డిస్కమ్ సీఎండీలు కె.సంతోశ్‌రావు, జె.పద్మా జనార్థన్‌రెడ్డిపాల్గొన్నారు.

1 నుంచి ఎన్నికల బాండ్ల విక్రయం

(మొదటిపేజీ తరువాయి)

శ్రీనగర్, గాంధీనగర్, భోపాల్, రాయ్‌పూర్, ముంబై శాఖల్లో ఎన్నికల బాండ్లు విక్రయించనున్నారు. వచ్చే ఏడాది జనవరి 8న హిమాచల్‌ప్రదేశ్, ఫిబ్రవరి 18న గుజరాత్ అసెంబ్లీ గడువు ముగియనుంది. దీంతో ఈ రెండు రాష్ట్రాలకు ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరగనున్నాయి. కొన్ని వారాల్లో దీనికి సంబంధించిన నోటిఫికేషన్ వెలువడనుంది. ఈ ఏడాది జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికలకు ముందు కూడా కేంద్రం ఎలక్ట్రోరల్ బాండ్లను విక్రయానికి ఉంచింది.

ఫ్లోరిడాలో 'ఇయాన్' బీభత్సం

సెయింట్ పీటర్స్‌బర్గ్ : అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో పెనుతుపాను 'ఇయాన్' బీభత్సం సృష్టించింది. మొత్తం రాష్ట్రం అతలాకుతలమైంది. విద్యుత్, టెలిఫోన్ సేవలు స్తంభించిపోయాయి. 25లక్షల మంది అంధకారంలో చిక్కుకున్నారు. వరద నీరు ఇళ్లలోకి చేరుకుంది. వృక్షాలు విరిగిపడ్డాయి. వీధులు నదులుగా మారగా అందులోకి షార్కులు సైతం వచ్చినట్లు సామాజిక మాధ్యమాల్లో వీడియోలు చక్కర్లు కొట్టాయి. వంతెన కొట్టుకుపోయింది. వరద నీటికి వాహనాలు కొట్టుకుపోయాయి. దీంతో భారీగా ఆస్తి-ప్రాణ నష్టం జరిగే అంచనాలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కాలువలో పడి ఓ వృద్ధుడు మరణించినట్లు ధ్రువీకరించారు. తొలుత క్యూబాలో బీభత్సం సృష్టించిన అనంతరం ఇయాన్ తుపాను ఫ్లోరిడాని తాకిందని అన్నారు. గంటలకు 665 కిమీల వరకు వేగంతోఈదురు గాలులు వీస్తుండగా ప్రజలు అష్టకష్టాలు పడుతున్నట్లు వెల్లడించారు. కుండపోత వర్షం, ఈదుగు గాలులు, టెలిఫోన్, విద్యుత్ సరఫరా నిలిచిపోయిన క్రమంలో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగిందని అన్నారు. అత్యంత తీవ్రమైన తుపాన్లలో ఇయాన్ ఒకటి అని అన్నారు. ఫ్లోరిడా తీరంలో 8 నుంచి 10 మీటర్ల ఎత్తులో అలలు ఎగిసిపడుతున్నాయి. ఇయాన్‌ను కేటగిరీ 4 తుపాను అని వెయ్యి ఏళ్లలో ఒకసారి ఇలాంటి విపత్తు సంభవిస్తుందని అధికారులు నిర్ధారించారు. ఫ్లోరిడా ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హామీ ఇచ్చారు.

వందల ఇళ్లు జలదిగ్బంధంలో ఉన్నాయి. బారియర్ ద్వీపకల్పాన్ని అనుసంధానం చేసే ఏకైక వంతెన దెబ్బతిన్నది. ఆసుపత్రి ఐసీయూ పైకప్పు ధ్వంసం అయింది. 2.5 మిలియన్ల మంది అంధకారంలో చిక్కుకుపోయారు. నడుము లోతు నీళ్లలో షార్కులు కొట్టుకొచ్చిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. గురువారం 72ఏళ్ల వ్యక్తి మృత్యువాత పడినట్లు అధికారులు ధ్రువీకరించారు. దయటోనా బీచ్ సమీపంలోని డాల్టోనాలోని ఇంటి వద్ద కాలువలో వృద్ధుడు కొట్టుకుపోయినట్లు వొలుసియా కౌంటీ షరీఫ్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. మృతుల సంఖ్య వందల్లో ఉండవచ్చు అంటూ ఫ్లోరిడా షరీఫ్ తెలిపారు. ఫోర్ట్ మైర్స్‌తో పాటు దేశంలో సహాయం కోసం వేలల్లో ఫోన్‌కాల్స్ 911కు వస్తున్నట్లు లీకౌంటీ షరీఫ్ కార్మీన్ మార్సెనో తెలిపారు. సహాయం కోసం వేలల్లో అభ్యర్థనలు వస్తుండగా ఇంకా ఎంత మంది సాయం కోసం వేచివున్నారో తెలియడం లేదన్నారు. అత్యవసర సేవా సిబ్బంది రంగంలోకి దిగి విరిగి పడ్డ చెట్లను తొలగిస్తూ వరదల్లో చిక్కుకున్న వారిని చేరుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. విద్యుత్ సరఫరా లేక ఫోన్ సేవలు నిలిచిపోయి అంధకారంలో లక్షల కుటుంబాలు ఉన్నట్లు వెల్లడించారు. ఫోన్ సేవలను తాత్కాలికంగా పునరుద్ధరించేందుకు పోర్టబుల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారి చెప్పారు. తెల్లవారేసరికి భయానక దృశ్యం ఆవిష్కృతం కావచ్చు అని అన్నారు.

మరోవైపు వలసదారుల పడవ మునిగిపోయిందని యూఎస్ బోర్డర్ పెట్రోలింగ్ అధికారులు వెల్లడించారు. అందులోని క్యూబాకు చెందిన 23 మంది వలసకూలీలు గల్లంతు కాగా వారిలో నలుగురు మాత్రం ఒడ్డుకు చేరుకున్నారని మియామీ చీఫ్ పెట్రోల్ ఏజెంట్ వాల్టర్ స్లోసర్ ట్విట్టర్‌లో వెల్లడించారు. గల్లంతైన వారి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫ్లోరిడాలో పది లక్షల కంటే ఎక్కువ మంది నిర్వాసితులయ్యారు. చాలామంది తమ ఇళ్లను కోల్పోయారు. అత్యంత ప్రమాదకరమైన ఇయాన్ తుపాను బుధవారం సాయంత్రం తీరాన్ని తాకిందని నేషనల్ హరికేన్ సెంటర్(ఎన్‌హెచ్‌సీ) వెల్లడించింది. వార్తాసేకరణలో ఉన్న ఓ విలేకరి ఈదురు గాలికి నిల్చులేక ఇబ్బంది పడిన వీడియో ఒకటి వైరల్ అయింది.

క్యూబాలోనూ... : క్యూబాలో ఇయాన్ తుపాను భారీ విధ్వంసాన్ని సృష్టించింది. రోడ్లకు అడ్డంగా చెట్లు విరిగి పడ్డాయి. రాజధాని హవానాతో పాటు అనేక ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఇళ్లు దెబ్బతిన్నాయి. పినార్ డెల్ రియోను వరద ముంచెత్తింది. పవర్ గ్రిడ్ దెబ్బతిని 1.20 కోట్ల మంది అంధకారంలో చిక్కుకున్నారు. విద్యుత్ సరఫరాను ఎప్పుడు పునరుద్ధరిస్తారో తెలియక ఇబ్బంది పడ్డారు. పొగాకు పంటకు భారీగా నష్టం వాటిల్లింది. ముందు జాగ్రత్తగా దాదాపు 25 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో ప్రాణనష్టం తప్పినట్లు అధికారులు తెలిపారు.

ఎస్పీ అధ్యక్షుడిగా మూడోసారి అఖిలేశ్

లక్నో : సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధ్యక్షుడిగా అఖిలేశ్ యాదవ్ (49) గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లక్నోలో జరిగిన పార్టీ జాతీయ సదస్సులో ఈ సంగతి ప్రకటించారు. అఖిలేశ్... పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికవడం ఇది వరుసగా మూడోసారి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రానున్న ఐదేళ్లలో ఎస్పీ జాతీయ పార్టీగా ఎదగడానికి కృషి చేయాలని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన యూపీ శాసనసభ ఎన్నికల్లో ప్రజలు నిజానికి తమ పార్టీకే ఓటు వేసినప్పటికీ తమ నుంచి ప్రభుత్వాన్ని బీజేపీ లాక్కుందని చెప్పారు. అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి, తప్పుడు మార్గాల్లో ప్రభుత్వాన్ని బీజేపీ లాక్కుందని విమర్శించారు. ఉత్తర ప్రదేశ్‌లో గద్దె దిగడమంటే, కేంద్రంలో ప్రభుత్వాన్ని కోల్పోయినట్లేనని, అందుకే వాళ్లు చేయగలిగినదంతా చేశారన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) అంటే తమకు గొప్ప నమ్మకం ఉందని, అయితే అది బీజేపీ బూత్ ఇన్‌చార్జిలకు కొమ్ముకాసిందని ఆరోపించారు. అందుకే ఇప్పుడు మనం బూత్ స్థాయిలో కూడా చాలా బలంగా తయారవ్వాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జైళ్లకు వెళ్లవలసి వచ్చినప్పటికీ తాము కేంద్ర, రాష్ట్రాల్లోని బీజేపీ ప్రభుత్వాలపై పోరాడుతూనే ఉంటామని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవస్థలను కబ్జా చేశాయని చెప్పారు. పోరాడటానికి తాము భయపడబోమన్నారు. సోషలిస్టులు, దళితుల మధ్య ఐకమత్యం రావాలన్నారు. ఈ వర్గాలవారు తమ పార్టీలో పెద్ద సంఖ్యలో చేరుతున్నారని తెలిపారు. బీజేపీ నేతలు అబద్ధాలకోరులని, ప్రచార యావ ఎక్కువ అని మండిపడ్డారు. దుర్గా మాత పూజలు చేసుకుంటున్న ప్రస్తుత సమయంలో బీజేపీ నేతలు అబద్ధాలు ఆపాలని ప్రార్థన చేద్దామని అన్నారు. రైతులు అనేక కష్టాల్లో ఉన్నారని, అయినప్పటికీ రుణ మాఫీలు ఎక్కువగా గుజరాతీ వ్యాపారవేత్తలకే అందుతున్నాయన్నారు. పరిశ్రమలను గుజరాత్‌కు తీసుకెళ్లిపోతున్నారని, ఉత్తర ప్రదేశ్‌కు పరిశ్రమలను ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు. ఉత్తర ప్రదేశ్ బీజేపీకి అత్యధిక స్థానాలను ఇచ్చిందని, ప్రభుత్వ ఏర్పాటుకు సహాయపడిందని గుర్తు చేశారు.

అంతకుముందు సమాజ్‌వాదీ పార్టీ నేత రామ్ గోపాల్ యాదవ్ మాట్లాడుతూ... పార్టీ జాతీయ అధ్యక్షునిగా అఖిలేశ్ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఎస్పీ ఉత్తర ప్రదేశ్ శాఖ అధ్యక్షునిగా నరేశ్ ఉత్తమ్ పటేల్ బుధవారం ఎన్నికైన సంగతి తెలిసిందే. 2017 నుంచి పార్టీ అధినేతగా కొనసాగుతూ వస్తున్న అఖిలేశ్... వరుసగా మూడోసారి పార్టీ పగ్గాలు చేపట్టబోతున్నారు. 2017కి ముందు ఆయన తండ్రి, పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ అధ్యక్షుడిగా పని చేశారు. పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడానికి ముందు 2012 నుంచి 2017 వరకు యూపీ ముఖ్యమంత్రిగా అఖిలేశ్ పని చేశారు. సమాజ్‌వాదీ పార్టీని 1992లో స్థాపించగా, అఖిలేశ్ యాదవ్ 2000 సంవత్సరంలో రాజకీయరంగ ప్రవేశం చేశారు.

తొలిసారిగా కన్నౌజ్ నుంచి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2004, 2009లో కూడా ఎంపీగా గెలుపొందారు. 2012లో సమాజ్‌వాదీ పార్టీకి పూర్తి మెజారిటీ రావడంతో ములాయం సింగ్ యాదవ్ తన కుమారుడు అఖిలేశ్ యాదవ్‌ను ముఖ్యమంత్రిని చేశారు. అప్పటి నుంచి పార్టీలో చీలిక మొదలైంది. 2017లో, అఖిలేశ్ తన తండ్రిని జాతీయ అధ్యక్ష పదవి నుంచి తొలగించి, పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. మేనమామ శివపాల్ సింగ్ యాదవ్‌ను సైతం రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించారు.

'చిన్న మొత్తాల పొదుపు'పై వడ్డీ పెంపు

న్యూఢిల్లీ: కొన్ని చిన్న మొత్తాల పొదుపు పథకాలపై కేంద్రం వడ్డీ రేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 30 బేసిస్ పాయింట్ల వరకు ఆయా పథకాలపై వడ్డీరేట్లను పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి (అక్టోబర్- డిసెంబర్) ఈ వడ్డీ రేట్లు వర్తిస్తాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. గురువారం ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. సవరించిన వడ్డీ రేట్ల ప్రకారం.. మూడేళ్ల కాలావ్యవధి కలిగిన పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్ పథకంపై వడ్డీ 5.8 శాతానికి చేరనుంది. ప్రస్తుతం 5.5 శాతంగా ఉంది. ఈ పథకంపై 30 బేసిస్ పాయింట్లు వడ్డీ పెంచారు. అలాగే, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్‌పై వడ్డీ రేటును 20 బేసిస్ పాయింట్లు మేర పెంచారు. దీంతో ఈ పథకంలో ప్రస్తుతం 7.4 శాతం వడ్డీ లభిస్తుండగా.. మూడో త్రైమాసికానికి 7.6 శాతం చొప్పున వడ్డీ చెల్లించనున్నారు. కిసాన్ వికాస్ పత్ర వడ్డీ రేటు 6.9 శాతం నుంచి 7 శాతానికి చేరింది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, సుకన్య సమృద్ధి యోజన, పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్ పథకాలపై ఇప్పుడున్న వడ్డీనే కొనసాగనుంది. ద్రవ్యోల్బణం కట్టడికి ఆర్‌బీఐ ఇటీవల వరుసగా వడ్డీ రేట్లను సవరించిన సంగతి తెలిసిందే. మే నెల నుంచి ఇప్పటి వరకు 140 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటు పెంచింది. దీంతో ఆయా బ్యాంకులు డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచాయి. ఈ క్రమంలో చిన్నమొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

హర్యానాలో ప్రపంచంలోనే అతిపెద్ద జంగిల్ సఫారీ

చండీగఢ్: ఆరావళి శ్రేణిలో ప్రపంచంలోనే అతిపెద్ద జంగిల్ సఫారీ పార్క్‌ను అభివృద్ధి చేయనున్నట్లు హర్యానా రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. గురుగ్రామ్. నుహ్ జిల్లాలను కలిపి ఈ పార్క్ పదివేల ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్ట్ అవుతుందని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం, షార్జా ఆఫ్రికా వెలుపల అతిపెద్ద క్యూరేటెడ్ సఫారీ పార్కుకు నిలయంగా ఉంది. ఫిబ్రవరి 2022లో ప్రారంభించబడిన షార్జా సఫారీ సుమారు 2,000 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. "ప్రతిపాదిత ఆరావళి పార్కు ఈ పరిమాణంలో ఐదు రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఇందులో పెద్ద హెర్పెటారియం (సరీసృపాలు, ఉభయచరాల కోసం ఒక జంతుప్రదర్శన స్థలం), పక్షిశాల/పక్షి ఉద్యానవనం, పులల కోసం నాలుగు జోన్లు, శాకాహారుల కోసం ఒక పెద్ద ప్రాంతం ఉన్నాయి. అన్యదేశ జంతు పక్షులు, నీటి అడుగున ప్రపంచం, ప్రకృతి మార్గాలు, సందర్శకులు, టూరిజం జోన్‌లు, బొటానికల్ గార్డెన్‌లు, బయోమ్స్, ఈక్వటోరియల్, ట్రాపికల్, కోస్టల్, ఎడారి మొదలైనవి ఏర్పాలు చేయనున్నట్లు ప్రభుత్వం ఆ ప్రకటనలో తెలిపింది. కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్, హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈ విషయంలో షార్జా సఫారీని సందర్శించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. జంగిల్ సఫారీ పథకం వల్ల పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కోసం గ్లోబల్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌ను నిర్ణయించామని, ఇటువంటి సౌకర్యాల రూపకల్పన, నిర్వహణలో అంతర్జాతీయ అనుభవం ఉన్న రెండు కంపెనీలను ఎంపిక చేశామని ఖట్టర్ పేర్కొన్నారు.

మంత్రి ఫౌజా సింగ్‌ను మంత్రివర్గం నుంచి తప్పించాలి

పంజాబ్ అసెంబ్లీలో కాంగ్రెస్ డిమాండ్

చండీగఢ్ : కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న పంజాబ్ మంత్రి ఫౌజా సింగ్ సరారీని మంత్రివర్గం నుంచి తొలగించాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ డిమాండు చేసింది. ఈ మేరకు గురువారం అసెంబ్లీలో ఆందోళన చేపట్టింది. ఫౌజా సింగ్ రవాణా విభాగంలో కాంట్రాక్టులు పొందిన వారి నుంచి డబ్బులు వసూలు చేయడం పై సన్నిహితుడితో ఫోన్‌లో మాట్లాడుతున్నట్టున్న ఆడియో ఒకటి బయటకు వచ్చింది. ఈ ఆడియో క్లిప్‌పై విచారణ జరిపించాలని, ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించాలని అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పర్తాప్ సింగ్ బజ్వా డిమాండు చేశారు.

ఈ వ్యవహారంపై సీఎం భగవంత్ మాన్ స్పందించాలని పేర్కొన్నారు. మంత్రిపై అవినీతి కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు. ప్రభుత్వం నుంచి సమాధానం రాకపోవడంతో వెల్‌లోకి చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ సభ్యులు శాంతించకపోవడంతో సభ అరగంట పాటు వాయిదా పడింది. పర్తాప్ సింగ్ మాట్లాడుతూ...మంత్రి సంభాషణ ఉన్న ఆడియో క్లిప్ ఈ నెలలో బయటపడిందని చెప్పారు. సీఎం అధికారంలోకి వచ్చిన కొత్తలో అవినీతి ఆరోపణల ఆడియో క్లిప్ ఆధారంగానే మంత్రివర్గ సహచరుడు విజయ్ సింగ్లాను ఆ పదవి నుంచి తొలగించారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే తరహా ఆరోపణలు మరో మంత్రిపై వస్తే ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు.

అసంపూర్తి చర్చలు

(మొదటిపేజీ తరువాయి)

ముంపు సమస్య లేకుండా ఉండేందుకు కరకట్ట నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు ఒడిశాతో కలిసి ఉమ్మడి సర్వే నిర్వహించి ముంపు ప్రాంతాల్లో భూసేకరణ చేపట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. దీనిపై ఎన్నిసార్లు లేఖలు రాసినా ఒడిశా నుంచి స్పందన లేదు. అందుచేత ఆ రాష్ట్రంలోని ముంపు ప్రాంతాల సమస్యపై కేంద్రమే చొరవ తీసుకుని ఒక నిర్ణయాన్ని ప్రకటించి ఒప్పించాల్సి ఉంది. ఇప్పటి వరకూ ముంపు సమస్య ఒడిశా నుంచే ఎదురువుతుండగా.. తాజాగా తెలంగాణ నుంచి అవరోధాలు ఎదురవుతున్నాయి. పోలవరం నిర్మాణంతో భద్రాచలం మునిగిపోతుందని అంటోంది. జాతీయ హోదా కలిగిన ఈ ప్రాజెక్టుకయ్యే వ్యయమంతటినీ కేంద్రమే భరించాల్సి ఉంది. కాంక్రీట్ నిర్మాణ పనులు సహా భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల వ్యయం బాధ్యతా కేంద్రానిదే. కానీ భూసేకరణ విషయంలో రాష్ట్రాన్ని తప్పుబడుతూ వస్తోంది. భూసేకరణలో జాప్యం కారణంగా వ్యయాలు విపరీతంగా పెరిగాయని, సహాయ పునరావాస చెల్లింపుల బాధ్యత తనది కాదని, 2013 భూసేకరణ చట్టం మేరకు చెల్లింపులు జరపాలంటే కష్టమని ఏపీ చెబుతోంది. ఈ నేపథ్యంలో జరిగిన ఈ సమావేశంలో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశించగా, అసంపూర్తిగానే ముగియడం రాష్ట్ర ప్రజలను నిరాశపర్చింది.

'స్మార్ట్'లో యువతకు శిక్షణ ఇవ్వాలి: కేటీఆర్



హైదరాబాద్: స్మార్ట్ మ్యానుఫ్యాక్టరింగ్ కోసం ప్రభుత్వంతో కలిసి స్థానిక యువతకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, ఫ్రెంచ్‌కు చెందిన ష్నీడర్ ఎలక్ట్రిక్ కంపెనీని కోరారు. రూ.300 కోట్లతో హైదరాబాద్ సమీపంలోని జీఎంఆర్ ఇండస్ట్రియల్ పార్కు వద్ద ఏర్పాటు కానున్న ష్నీడర్ ఎలక్ట్రిక్ కంపెనీ కొత్త స్మార్ట్ ఫ్యాక్టరీ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఐటీ మంత్రి కేటీఆర్ హాజరై భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. దేశంలోనే అతిపెద్ద ఫ్యాక్టరీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. స్మార్ట్ మ్యనుఫ్యాక్టరింగ్‌లో స్థానిక యువతకు శిక్షణ ఇస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఒకే రోజు హైదరాబాద్‌లో మూడు ఫ్రెంచ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇది సంతోషించే విషయమని పేర్కొన్నారు. మరిన్ని ఫ్రెంచ్ సంస్థలు హైదరాబాద్ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించాలని కేటీఆర్ కోరారు. 75 శాతం ష్నీడర్ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. ఏడాది లోపే సంస్థ తన నూతన ఫ్యాక్టరీని ప్రారంభించనుందని పేర్కొన్నారు.

ఇసుక మాఫియా మధ్య కాల్పులు... నలుగురి మృతి

పాట్నా: బీహార్‌లోని పాట్నా జిల్లాలో విషాదం నెలకొంది. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ముఠాలు గొడవపడి పరస్పరం కాల్పులు జరుపుకున్నాయి. ఈ దుర్ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, తొమ్మిది మంది గాయపడ్డారు. జిల్లాలోని బిహ్తా పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోన్ నది తీరంలోని ఇసుకను కొందరు ముఠాలుగా ఏర్పడి అక్రమంగా తరలిస్తున్నారు. అయితే గురువారం తెల్లవారుజామున రెండు గ్రూపుల మధ్య ఇసుక రవాణా విషయంలో చిన్న వివాదం తలెత్తింది. అనంతరం మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదానికి దారి తీసింది. దీంతో రెండు వర్గాలు కాల్పులు జరుపుకున్నాయి. ఈ ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా తొమ్మిది మంది గాయపడ్డారు. స్థానికుల నుంచి ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు,సోన్‌నది వద్దకు చేరుకున్నారు. మృతులను మానేర్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన శతృఘ్న, హరేంద్ర, లాల్‌దేవ్, విమలేశ్ కుమార్‌గా పోలీసులు గుర్తించారు.

ఆర్జీయూకేటీ ఫలితాల్లో

సర్కారు విద్యార్థుల హవా

- 1, 2, 3 ర్యాంకులు... ప్రకాశం, శ్రీకాకుళం, గుంటూరు కైవసం
- 66 శాతం సీట్లు బాలికల వశం
- ఐఐఐటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు
- విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం లక్ష్యం
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) 2022-23 విద్యా సంవత్సరానికిగాను ఐఐఐటీ ఇంటిగ్రేటెడ్ ప్రవేశాలకు నిర్వహించిన ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు హవా కొనసాగించారని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులో లెమన్ ట్రీ ప్రీమియర్ మొదటి అంతస్థులో ఐఐఐటీ ఆరేళ్ల కోర్సుకు సంబంధించిన ప్రవేశ ఫలితాల సీడీని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత నిరుపేద విద్యార్థులకు ఐఐటీ స్థాయి నాణ్యమైన సాంకేతిక ఉన్నత విద్యను అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆర్జీయూకేటీ/ఐఐఐటీ పవేశ ఫలితాల్లో ప్రకాశం జిల్లా సింగరాయకొండ జడ్పీ పాఠశాలకు చెందిన జల్లెల నందిని మయూరి ఓపెన్ కేటగిరిలో ప్రథమ ర్యాంకు సాధించిందని వివరించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన చక్రపాణి బెహర రెండో ర్యాంకు, గుంటూరు జిల్లా మున్నంగికి చెందిన సోమిశెట్టి ఫణీంద్ర రామకృష్ణ మూడవ ర్యాంకు సాధించారన్నారు. టాప్ ర్యాంకులు సాధించిన వారిలో 76.97శాతం మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కాగా, 23.03శాతం మంది ప్రైవేట్ విద్యార్థులున్నారని వివరించారు. 66.04 శాతం సీట్లు బాలికలు సాధించగా, 33.96 శాతం సీట్లు బాలురు సాధించారని వెల్లడించారు. 600 మార్కులకుగాను అన్ని క్యాంపస్‌లలో 93 నుంచి 95 శాతం మార్కులను కేటగిరీల వారీగా కటాఫ్‌గా నిర్ణయించామని పేర్కొన్నారు.

పదో తరగతి మార్కుల ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన ప్రతిభావంతులకే ప్రవేశాలు పారదర్శకంగా కేటాయించామని బొత్స పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సౌకర్యార్థం కౌన్సెలింగ్‌ను రాష్ట్రంలో నాలుగు క్యాంపస్‌లలో జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఐఐఐటీల అభివృద్ధికి, మౌలిక సదుపాయాలు, వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రపంచ స్థాయి పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సీఎం జగన్ సంకల్పించారన్నారు. మార్కులు ఎక్కువగా వచ్చి సీటు రాని విద్యార్థులెవరైనా ఉంటే వారు క్యాంపస్‌లలో కులపతిని సంప్రదించాలన్నారు.

ప్రతి ఏటా ఎస్టీ కేటగిరీలో సీట్లు మిగిలేవని, వాటిని ఎస్సీ కేటగిరీకి బదలాయించేవారమన్నారు. ఈ విడత ఎస్టీ కేటగిరీ అభ్యర్థుల సంఖ్య పెరగడం సంతోషకరమని పేర్కొన్నారు. న్యాయస్థానం సూచనల మేరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చదివే విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి గ్రామీణ ప్రాంత విద్యార్థినీ, విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా ఎదగాలన్న ఉద్దేశ్యంతో 2008లో ఆర్జీయూకేటీ నెలకొల్పారని గుర్తుచేశారు. దీనిని ఆయన తన మానసపుత్రికగా భావించారన్నారు. ఏలూరు జిల్లా-నూజివీడు, వైఎస్ఆర్ జిల్లా-ఇడుపులపాయ వద్ద ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం జిల్లాలోని ఎచ్చెర్ల వద్ద మొత్తం నాలుగు క్యాంపస్‌లు ఉన్నాయని వివరించారు. ఒక్కో క్యాంపస్‌లో 1,100 చొప్పున మొత్తం 4,400 సీట్లు ఉన్నాయని తెలిపారు. గతంలో 4,000 సీట్లు మాత్రమే ఉంటే వాటికి అదనంగా ఈడబ్ల్యూఎస్ కేటగిరి కింద మరో 400 సీట్లు చేర్చామని పేర్కొన్నారు.

ప్లేస్‌మెంట్ల పెంపుదలకు కృషి: కేసీ రెడ్డి

ఇప్పటివరకు క్యాంపస్‌లలో విద్యనభ్యసించిన విద్యార్థులకు 93శాతం ప్లేస్‌మెంట్‌లు లభించాయని, ఇప్పటికే వివిధ కంపెనీలతో ఒప్పందం చేసుకున్నామని, ప్లేస్‌మెంట్ల శాతం పెంపుదలకు కృషి చేస్తున్నామని ఆర్జీయూకేటీ కులపతి కేసీ రెడ్డి చెప్పారు. ఆరేళ్ల కోర్సును పదేళ్ల వరకు పూర్తి చేసుకునేందుకు విద్యార్థులకు అవకాశముందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ, అభ్యర్థుల జాబితాను తమ వెబ్‌సైట్ www.rgukt లో అందుబాటులో ఉంచామన్నారు. అక్టోబర్ 12, 13 తేదీల్లో నూజివీడు, ఆర్కే వ్యాలీ, ఇడుపులపాయ, 14, 15 తేదీల్లో ఒంగోలు, 15,16 తేదీల్లో ఎచ్చెర్ల క్యాంపస్‌లలో కౌన్సెలింగ్ జరుగుతుందని వివరించారు. ఐఐఐటీ క్యాంపస్‌ల సంచాలకులు ఆచార్యులు జీవీఆర్ శ్రీనివాసరావు, బి.జయరామిరెడ్డి, పి.జగదీశ్వర్‌రావు, ప్రవేశాల కన్వీనర్ ఎస్ఎస్‌వీ గోపాలరాజు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో 'సీపీఆర్' శిక్షణ

450 మంది ఉద్యోగులకు హృదయ స్పందనపై అవగాహన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఉద్యోగులకు గురువారం కార్డియో పల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్) శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 'ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఆర్ఎం, మంగళగిరి ఎయిమ్స్, అమెరికన్ హార్ట్ అసోసియేషన్లు సంయుక్తంగా శిక్షణను నిర్వహించాయి. రోగులు అకస్మాత్తుగా ఛాతీ నొప్పితో కుప్పకూలిపోయినప్పుడు వారి హృదయ స్పందనను పునరుద్ధరించేందుకు సీపీఆర్ పద్ధతి బాగా ఉపకరిస్తుందని ఎయిమ్స్ వైద్యులు తెలిపారు. సీపీఆర్ విధానంలో శిక్షణ అందించడం వల్ల ఆపత్కాలంలో ఎక్కువమందిని బతికించుకునే వీలుంటుందన్న ఉద్దేశంతో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వైద్యులు తెలిపారు. డాక్టర్ సీహెచ్ లక్ష్మీరాజ్యం, డాక్టర్ కిరణ్ కుమార్ పర్యవేక్షణలో 450 మంది ఉద్యోగులు శిక్షణ పొందారు. రోగి పల్స్ రేటు, హృదయ స్పందనను పరిశీలించి వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా శారీరక కసరత్తులు చేస్తూ ఒత్తిడిని తగ్గించుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని డాక్టర్ లక్ష్మీరాజ్యం పేర్కొన్నారు. ఆల్కహాల్, పొగతాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 40 ఏళ్లు పైబడిన వారంతా గుండె సంబంధిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళగిరి ఎయిమ్స్ రీసెర్చ్ డీన్ డాక్టర్ దీప్తి, డాక్టర్ రాజీవ్, డాక్టర్ ధ్రుబజ్యోతి, డాక్టర్ యామిని, డాక్టర్ నవ్య కృష్ణనాయుడు, డాక్టర్ వినోద్ కుమార్ కాళిదాస్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర అడ్డుకునేందుకు

ప్రభుత్వం కుట్ర: బాలకోటయ్య

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అరసవల్లి పాదయాత్రను ఎలాగైనా అడ్డుకునేందుకే మంత్రులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, అడుగడుగునా అల్లర్లు సృష్టించి అమాయకంగా న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసే వ్యూహ రచన ప్రభుత్వం చేస్తుందని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య ఆరోపించారు. విలేకర్లతో గురువారం ఆయన మాట్లాడుతూ, మంత్రులు బొత్స సత్యనారాయణ పాదయాత్రను అడ్డుకోవడం ఐదు నిమిషాల పని అన్నా, మంత్రి సీదిరి అప్పలరాజు ఉత్తరాంధ్రపై దండయాత్ర అన్నా, మంత్రి అంబటి రాంబాబు బలిసినోళ్ల యాత్ర అన్నా... పాదయాత్ర చేస్తున్న మహిళలను రెచ్చగొట్టేందుకే అని అన్నారు. రేపల్లెలో మూడు రాజధానులు అంటూ, గుడివాడలో నరుకుతాం అంటూ ఫ్లెక్సీలు పెట్టినా, ఏలూరులో జై జగన్ నినాదాలు చేసినా ఉద్రిక్తతలు సృష్టించేందుకే అని తెలిపారు. వీటిపై పాదయాత్ర చేస్తున్న మహిళల స్పందనలను, వీడియో క్లిప్పింగులతో కోర్టులో పెట్టి నిబంధనల అతిక్రమించినట్లుగా పిటిషన్ దాఖలు చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. అమరావతికి మూడు ప్రాంతాల అపూర్వ మద్దతు దేవస్థానం పాదయాత్ర తోనే రాష్ట్రానికి ఏనాడో తెలిసిందని చెప్పారు. ఒక యజ్ఞం విజయవంతం కావాలంటే, ఓర్పు, సహనంతో పాటు, సమిష్టి ఆలోచనలు ఉండాలని పాదయాత్ర నిర్వాహక సమితి నాయకులకు బాలకోటయ్య సూచించారు.

హమాలీల కూలి పెంపు ఉత్తర్వులివ్వాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్‌లో రేషన్ బియ్యం ఎగుమతి, దిగుమతి చేస్తున్న హమాలీల కూలీ రేట్ల పెంపుపై ఉత్తర్వులివ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. గురువారం విజయవాడ గొల్లపూడి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో పౌరసరఫరాల హమాలీల రాష్ట్ర సర్వసభ్య సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్నాంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఓబులేసు మాట్లాడుతూ, ఈ నెల 21వ తేదిన జరిగిన చర్చల్లో క్వింటాల్‌కు మూడు రూపాయాలు చొప్పున పెంచుతామని, రూ.22 నుంచి రూ.25 చేస్తున్నట్లు దానిని ఈ ఏడాది జనవరి 1 నుంచి అమలు చేస్తున్నట్లు కార్పొరేషన్ అధికారులు అంగీకరించారన్నారు. ఈ మేరకు ఉత్తర్వులు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో కార్మికుల కూలీ రేట్ల పెంపు కోసం మంచి పోరాటం చేశారని, దాని ఫలితంగానే కూలి రేట్లు పెరిగాయన్నారు. తొలి దశలో ప్రభుత్వం మొండిగా వ్యవహరించినప్పటికీ, తుదకు దిగివచ్చి కూలి రేట్లు పెంచడం హర్షణీయమన్నారు. హమాలీలు ఐక్యంగా ఉండి భవిష్యత్ లోనూ కార్మికులకు రావాల్సిన సౌకర్యాలు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14 నుంచి 18 వరకు విజయవాడలో జరుగుతున్న సీపీఐ జాతీయ మహాసభల దిగ్విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ కార్మికులు మొదటి నుంచి చాలా క్రమశిక్షణగా ఉంటూ మంచి ఉద్యమం కొనసాగిస్తున్నారని కొనియాడారు. ఇంకా పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలున్నాయని వాటిని కూడా సాధించుకోవాలన్నారు. కార్మికులకు పనిభద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ప్రస్తుతం గోడౌన్లలో దించకుండా నేరుగా చౌక దుకాణాలకు సరుకును తరలించేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాన్ని తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రావుల అంజిబాబు, కొఠారి రమణ, ఎం.మన్మధరావు, చిక్కాల గోవిందు, వీరబాబు పాల్గొన్నారు.

పోటెత్తిన అభిమానం

- ఘనంగా కృష్ణంరాజు సంస్మరణసభ
- స్మృతివనం ఏర్పాటు: మంత్రులు
- మీ ఆదరణ మరువలేనిది: ప్రభాస్

విశాలాంధ్ర-మొగల్తూరు: ప్రముఖ సినీనటుడు, కేంద్ర మాజీమంత్రి కృష్ణంరాజు సంస్మరణ సభ గురువారం పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభాస్ కూడా రావడంతో మొగల్తూరు అభిమానులతో పోటెత్తింది. హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కృష్ణంరాజు ఈ నెల 11న కన్నుమూశారు. దశ దిన కర్మను అక్కడే పూర్తిచేసిన కుటుంబ సభ్యులు... ఆయన స్వగ్రామంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర మంత్రులు ఆర్కే రోజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు , రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ... సినీ, రాజకీయ రంగాల్లో రెబల్ స్టార్ కృష్ణంరాజు సేవలకు గుర్తింపుగా రెండు ఎకరాల విస్తీర్ణంలో ఆయన స్మృతివనం, పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి, యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్‌ను పరామర్శించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. కృష్ణంరాజు కుటుంబంతో సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఇక కృష్ణంరాజు సంస్మరణ కార్యక్రమానికి ప్రభాస్ రాకతో.. అభిమానులు భారీ సంఖ్యలో మొగల్తూరుకు తరలివచ్చారు. ప్రభాస్‌ను చూసేందుకు లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో తీవ్ర తోపులాట జరిగింది. రంగంలోకి దిగిన పోలీసులు... అభిమానులను చెదరగొట్టారు. దీంతో ఇంట్లోనుంచి బయటకు వచ్చిన ప్రభాస్... అభిమానులకు చేయి ఊపుతూ అభివాదం చేశారు. అందరూ భోజనం చేసి వెళ్లాలని కోరారు. కాగా కృష్ణంరాజు సంస్మరణ సభకు ఆయన కుటుంబ సభ్యులు అభిమానులు భారీగా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు అధికార యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రంగంలోకి దిగింది. కృష్ణంరాజు, ప్రభాస్ అభిమానులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేసే విధంగా భారీ ఏర్పాట్లు చేశారు. కాగా భారీగా హాజరైన అభిమానులను చూసి కృష్ణంరాజు భార్య చలించిపోయారు. మా కుటుంబం పట్ల మీరు చూపించిన ఆదరాభిమానాలు ఎన్నటికీ మరువలేనంటూ ఆమె ఉద్వేగభరితంగా మాట్లాడారు. ప్రభాస్ మాట్లాడుతూ... మా పెదనాన్న కృష్ణంరాజు ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకునే వారని, అటువంటి వ్యక్తి లేకపోవటం దురదృష్టకరమన్నారు. నేను సినీ రంగంలో ఈ స్థాయికి రావడానికి ఆయన కృషి ఎంతో ఉందన్నారు. మేము ఊహించిన దానికంటే అధిక సంఖ్యలో అభిమానులు వచ్చి మా యెడల ఆదరణ చూపినందుకు ఎప్పుడు రుణపడి ఉంటామని ప్రభాస్ అన్నారు. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మాజీ మంత్రులు కొత్తపల్లి సుబ్బారాయుడు, పీతల సుజాత తదితరులు ప్రభాస్, కృష్ణంరాజు భార్యను కలిసి సానుభూతి తెలియజేశారు.

లక్షమందికి వంటలు...

రెబెల్ స్టార్ కృష్ణంరాజు సంస్మరణ సభ సందర్భంగా దాదాపు లక్ష మందికి నోరూరించే వంటకాలను వడ్డించారు. టన్నుల కొద్దీ వంటకాలను వండారు. వంటకాల్లో ప్రధానంగా... 6 టన్నుల మటన్ బిర్యానీ, 6 టన్నుల చికెన్ బిర్యానీ, 6 టన్నుల మటన్ కర్రీ, 6 టన్నుల చికెన్ కర్రీ, 4 టన్నుల చందువా ఫిష్ ఫ్రై, 2 టన్నుల చిట్టి చేపల పులుసు, 1 టన్ను రొయ్యల ఇగురు, 1 టన్ను స్టఫ్ క్రాబ్, 1 టన్ను రొయ్యల గోంగూర ఇగురు, 1 టన్ను బొమ్మిడాయల పులుసు, 2 లక్షల బూరెలు తయారు చేశారు. మొత్తం 22 రకాల నాన్ వెజ్ వంటకాలని వండించారు.

ఒడిశా సరిహద్దు సమస్యలు పరిష్కరించాలి

సీఎంకు సీపీఎం నేత శ్రీనివాసరావు లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: శ్రీకాకుళంజిల్లా మందస మండల పరిధిలోని ఒడిశా రాష్ట్ర సరిహద్దు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు గురువారం ఆయన లేఖ రాశారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా మందస మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా స్థానిక ప్రజలు ఒడిస్సాతో సరిహద్దు సమస్యలున్నట్లు, ఫలితంగా తాము ఇబ్బందులు పడుతున్నట్లు నా దృష్టికి తెచ్చారని వివరించారు. మాణిక్యపట్నం, చీపి, సాబకోట, బుడార్సింగి తదితర గ్రామ పంచాయతీల్లోని చాలా గ్రామాల ప్రజలు ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో నివసిస్తున్నారన్నారు. ఈ గ్రామాల్లో అత్యధికులు గిరిజనులనీ, రాజులు-జమీందార్ల కాలంలోనూ, బ్రిటీష్ పాలనలోనూ, స్వాతంత్ర్యానంతరం వీరంతా తరతరాలుగా కలిసిమెలసి జీవిస్తున్నారని, సంబంధ బాంధవ్యాలున్న వారని వివరించారు. ఇటీవల సరిహద్దుల పేరిట ఒడిశా అధికారులు అక్కడి ప్రజలను వేధిస్తున్నారని, వివిధ అభివృద్ధి పనులను సైతం అడ్డుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రశ్నించిన వారిపై ఒడిశా పోలీసులు కేసుపెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంద్వారా ఉపాధి పనులు చేపట్టిన కొండమేర గ్రామంలో చెరువును, సింగుపురం గ్రామంలో స్మశానాన్ని ఒడిస్సా అధికారులు ఆ రాష్ట్రానికి చెందినవిగా పేర్కొన్నారని, ఇలాంటి ఉదాహరణలెన్నో ఉన్నాయని వివరించారు. ఒడిశా ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి, ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

జూడో పోటీల్లో ఏపీ పోలీసు ప్రతిభ: డీజీపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దిల్లీలో నిర్వహించిన 7వ జాతీయ పోలీసు జూడో క్లస్టర్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పోలీస్‌శాఖకు ఏడు పతకాలు (2-వెండి, 5-కాంస్య) లభించినట్లు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. 28 రాష్ట్రాలకు చెందిన పోలీస్ క్రీడకారులు, ప్యారా మిలటరీ, ఐటీబీటీ ఫోర్సెస్ పాల్గొన్నారని వివరించారు. ఏపీ పోలీస్‌శాఖకు చెందిన 20 మంది పురుషులు, మహిళలు పాల్గొన్నారన్నారు. నంద్యాల జిల్లాకు చెందిన ఎస్.ఫరాహతుల్లా, ప్రకాశం జిల్లాకు చెందిన డీఎస్పీ రత్నం బాబు... పెన్కాట్ శిలాట్ విభాగంలో వెండి పతకాలు, నెల్లూరు జిల్లాకు చెందిన ఎ.శ్రావణి కరాటే లో, కర్నూలు జిల్లాకు చెందిన పి. కల్పన, నంద్యాల జిల్లాకు చెందిన ఎస్. మహబూబ్ బాషా, చిత్తూరు జిల్లాకు చెందిన ఎం.షంషేర్ తైక్వాండోలో కాంస్య పతకాలు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా గురువారం డీజీపీ కార్యాలయంలో విజేతలను అభినందించారు. ఆటగాళ్లకు సహకరించిన ఏపీ పోలీస్ సంక్షేమ, క్రీడల ఐజీపీ ఇన్‌చార్జ్ ఎల్వీకే రంగారావును ప్రశంసించారు. స్పోర్ట్స్ ఆఫీసర్ కేవీ ప్రేమ్‌జిత్, సిబ్బంది పాల్గొన్నారు.

లోన్‌యాప్ కేసులో మరో నలుగురి అరెస్ట్

విశాలాంధ్ర-మచిలీపట్నం: లోన్‌యాప్‌లతో రుణాలిచ్చి అధికమొత్తం కోసం వేధిస్తున్న రెండు కేసుల్లో నలుగురు ముద్దాయిలను కృష్ణాజిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ పీ జాషువా వివరాలను వెల్లడించారు. జిల్లా పరిధిలోని పెనమలూరు, ఆత్కూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వ్యక్తులపై వేధింపులకు పాల్పడుతున్న నలుగురిని గతంలో అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. వచ్చిన సమాచారం మేరకు అడిషనల్ ఎస్పీ ఎన్వీ రామాంజనేయులు స్వీయ పర్యవేక్షణలో బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ నేరస్థుల కదలికలపై నిఘా పెట్టారు. ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌కు చెందిన సోదరులు రాహుల్‌సింగ్, రోహిత్‌కుమార్, ఉత్తరప్రదేశ్ అయోధ్య జిల్లాకు చెందిన జైశంకర్ ఉపాధ్యాయ, న్యూఢిల్లీలోని ఉత్తమనగర్‌కు చెందిన అభిషేక్ కుమార్ సిన్హాలను అరెస్ట్ చేశారు. నలుగురు నిందితులను విచారణ చేస్తున్న క్రమంలో శుభమ్ అనే వ్యక్తి ఈ కార్యకలాపాలన్నిటికీ కీలకంగా వ్యవహరిస్తున్నట్టు నిందితుడు అభిషేక్ తెలిపాడు. అభిషేక్ శుభమ్ సోదరుడు నితేష్ దగ్గర పని చేసేవాడు. అభిషేక్ శుభమ్ బ్యాంకు ఏటీఎం కార్డులకు కొరియర్‌గా ఉపయోగించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితుల్లో ఒకరు వాట్సాప్, ఫోన్‌కాల్స్, నకిలీ ఫోన్ నెంబర్ల ద్వారా బాధితులను బెదిరించే ఒక గ్రూపులో ఉండగా, మరొక గ్రూప్ సామాజిక మాధ్యమాల వేదికగా కీలక సమాచారం రాబడుతూ వివిధ రాష్ట్రాల్లో కరెంటు అకౌంట్లు తెరిపించే ఏజంట్లతో సంప్రదింపులు జరుపుతుంటారు. లోన్ తీసుకున్న బాధితుల వివరాలు సోషల్‌మీడియా నుంచి సేకరించడంలో వీరికి విశేష ప్రావీణ్యముంది. వీరితో పాటు హైదరాబాద్ రాజేంద్రనగర్‌కు చెందిన హక్తర్ హుస్సేన్ అనే వ్యక్తి కూడా సదరు నేరాలకు సహకరిస్తూ కరెంటు అకౌంట్‌లను సమకూర్చి ముద్దాయిలకు ఇస్తున్నట్లు గుర్తించారు. హుస్సేన్‌ను కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేయగా వివిధ జిల్లాలకు చెందిన వ్యక్తుల కరెంటు ఖాతాల సమాచారం సేకరించుకున్నట్లుగా తేలింది. ఈ మధ్యకాలంలో నేరస్థుల బ్యాంకు ఖాతాలను పోలీసులు గుర్తిస్తున్న కారణంగా వారు నేరుగా బ్యాంకు ఖాతాలకు సంబంధించిన అకౌంట్ల నెంబర్లను బాధితులకు పంపించకుండా, సాంకేతిక పరిజ్ఞానంతో యూపీఐ తదితర లింకులను తయారుచేసి బాధితులకు వాట్సాప్ ద్వారా పంపుతున్నారు. వీటిని బ్యాంకు అధికారులు, పోలీస్ అధికారులు తెలుసుకునే లోపే సదరు లింకులు నిర్వీర్యం అవుతున్నాయి. అయినప్పటికి కృష్ణా జిల్లా సైబర్‌క్రైమ్ విభాగం ఎంతో చాకచక్యంగా సదరు లింకులను కనిపెట్టి బ్యాంకు ఖాతా వివరాలను సేకరించింది. బెదిరింపు కాల్స్ చేస్తున్న వీఐపీ కాల్స్, బ్యాంకు ఖాతా లింకులను కనిపెట్టగా చేయగా అవి పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్, నేపాల్ దేశాలలో సర్వర్లు పెట్టి విస్తృతమైన నెట్‌వర్క్ సహాయంతో అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వీరందరూ కూడా ఒకరికి ఒకరికి ముఖ పరిచయం కూడా లేకుండా కేవలం వాట్సాప్, మెసెంజర్లు, టెలిగ్రామ్ వంటి వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా మాత్రమే సమాచారం అందిపుచ్చుకుంటూ 2.5 శాతం, 5శాతం కమీషన్ ప్రాతిపదికన లావాదేవీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు నమోదైన ఐదు కేసుల్లో మొత్తం 15 బ్యాంక్ అకౌంట్ల ద్వారా పాత, తాజా నిందితులు కలసి రూ. 91,48,59,376 వరకు లావాదేవీలు నిర్వహించినట్లు తెలిసిందన్నారు. సంబంధిత బ్యాంకు అధికారులను సంప్రదించి ప్రస్తుతానికి రూ.23,33,272ను బ్యాంకు ఖాతాలలో నిలిపివేశామని తెలిపారు. ఇంకా మిగిలిన మొత్తాన్ని కూడా ఇతర శాఖలను సమన్వయపరచుకుంటూ బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కేసును ఛేదించడంలో ఎప్పటికప్పుడు సాంకేతికపరమైన సమాచారాన్ని సైబర్ క్రైమ్ ఎస్ఐ దీపిక అందిస్తుండగా ఎస్పీ ఆదేశాలపై ఏర్పడిన ప్రత్యేకబృందంలోని స్పెషల్‌బ్రాంచి ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజీ, ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు సిబ్బందితో కలసి నిందితులను వారి ప్రదేశాలకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారని వివరించారు. ఈ కేసులో నిందితులందరిపై పెనమలూరు సీఐ గోవిందరాజు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. ఎవరైనా లోన్‌యాప్ ద్వారా బెదిరింపులకు గురైతే డయల్ 100, సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930 ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. విలేకరుల సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎన్.వెంకట రామాంజనేయులు, స్పెషల్‌బ్రాంచి డీఎస్పీ భరత్ మాతాజీ, గన్నవరం డీఎస్పీ విజయపాల్, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ శివాజీ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, పెనమలూరు సీఐ గోవిందరాజు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలక్షేత్రంలో వైభవంగా గ్రామోత్సవం

విశాలాంధ్ర-శ్రీశైలం: శ్రీశైలమహాక్షేత్రంలో దసరా మహోత్సవాల్లో భాగంగా గురువారం భ్రమరాంబదేవి కూష్మాండ దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం సాయంత్రం పూజల అనంతరం అక్కమహాదేవి మండపంలో శివ పార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి...మేళతాళాల నడుమ మంగళ హారతులు సమర్పించి, కైలాస వాహనంపై గ్రామోత్సవానికి తోడ్కొని వచ్చారు. ఈ గ్రామోత్సవంలో కళాకారుల విన్యాసాలు భక్తులను ఎంతగానో ఆకట్టు కున్నాయి. విద్యుద్దీప కాంతుల మధ్య గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

వీఆర్వోలకు కారుణ్య నియామకాలపై

ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ హర్షం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వీఆర్వోలకు కారుణ్య నియామకాలు వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీజేయడం పట్ల ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, నాయకులు చేబ్రోలు కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తమ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వారు స్వాగతించారు. ఈ మేరకు సీఎం జగన్‌కు, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, సీసీఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు. కారుణ్య నియామకాలపై కాలానుగుణంగా ప్రభుత్వాలు వివిధ రకాలుగా ఉత్తర్వులిచ్చాయని వివరించారు. వీఆర్వోల కారుణ్య నియామకాలపై జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ధన్యవాదాలు తెలిపారు.

సంపాదకీయం

అమానుష విడుదలపై ఆక్రోశం

రెండు దశాబ్దాల కిందట గుజరాత్‌లో జరిగిన మారణ కాండలో భాగస్వాములైన 11 మందిని గుజరాత్ ప్రభుత్వం గత ఆగస్టు 15న విడుదల చేయడంపై తీవ్ర ఆక్రోశం ఇప్పటికీ వ్యక్త మవుతూనే ఉంది. బిల్కిస్ బానో అనే మహిళ మీద గుజరాత్ మారణ కాండ సమయంలో అత్యంత ఘోరమైన రీతిలో మూకు మ్మడి అత్యాచారం జరిగింది. ఆమె సన్నిహిత కుటుంబ సభ్యులైన 14 మందిని కిరాతకంగా హతమార్చారు. అప్పటికి మూడేళ్ల యినా లేని బిల్కిస్ కూతురిని ఆమె కళ్ల ముందే బండకేసి బాది చంపేశారు. ఇంతకన్నా హీనమైన అత్యాచారం విని కూడా ఉండ మేమో. చివరకు ఆ 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్క రించుకుని గుజరాత్ ప్రభుత్వం వారిని జైలు నుంచి విడుదల చేసింది. వారిని మళ్లీ జైలుకు పంపాలని మానవత్వం ఉందనుకునే వారందరూ ముక్త కంఠంతో కోరు తున్నారు. అయినా గుజరాత్ బీజేపీ ప్రభుత్వం చలించడం లేదు. 401 మంది రచయితలు, కళాకారులు, రాజకీయ నాయకులు, పత్రికా రచయితలు, సమాజంలో పలుకుబడిగల వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేసి ఈ 11 మంది కిరాతకులకు జైలు శిక్ష తగ్గించడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వీరిలో రాజ్య సభ సభ్యుడు జవహర్ సర్కార్, రాజకీయ నాయకుడు, పత్రికలలో తర చుగా వ్యాసాలు రాసే, ఇదివరకు అద్వానీకి, అటల్ బిహారీ వాజ్‌పేయికి సన్ని హితంగా మెలగిన సలహాదారు సుధీంద్ర కులకర్ణి; అంబానీల గ్యాస్ కుంభ కోణాన్ని బద్దలు కొట్టిన ప్రసిద్ధ పత్రికా రచయిత పరంజయ్ గుహాతకుర్త లాంటి వారు ఉన్నారు. ఈ కిరాతకులకు జైలు శిక్ష తగ్గించి నందుకు అనేక మంది వీరు విడుదలపై ఆక్రోశం వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం మౌనంగా ఉండడం అమానుషమైన, నీతిబాహ్యమైన విధా నాన్ని అమలు చేసినట్టు అవుతోందని వారు ఈ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. హేయమైన నేరానికి పాల్పడ్డ వారు సైతం జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉందన్న దుష్ట సంప్రదాయానికి గుజరాత్ ప్రభుత్వం కారణమైందని వీరు తెలియజేశారు. ఇలా అమానుషమైన అత్యాచారాలకు పాల్పడే వారిని విడు దల చేస్తే ప్రజలకు న్యాయం, మానవత్వం, అసలు మానవ నాగరికత మీదే విశ్వాసం సడలి పోతుంది అని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. జనం గోడు పట్టించుకోని ప్రభుత్వానికి ఇలా విజ్ఞప్తి చేయడం ఇది మొదటిసారి ఏమీ కాదు. రాజ్యాంగ ప్రవర్తనా బృందం పేరుతో 134 మంది ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. అధికారులు కూడా సుప్రీంకోర్టుకు బహిరంగ లేఖ రాశారు. గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న భయానకమైన ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోమని ఆదేశించాలని వీరు అభ్యర్థించారు. వీరే కాక సామాజిక కార్యకర్తలు, ప్రసిద్ధ రచయితలు, సినీ ప్రముఖులు మొత్తం ఆరు వేలమంది సుప్రీంకోర్టుకు ఇదే రకమైన అభ్యర్థన పంపించారు. వీరిని విడదల చేసిన రోజు స్వాతంత్ర్య దినో త్సవం కావడం ఒక్కటే విశేషం కాదు. ఆ రోజు ప్రధాన మంత్రి మోదీ ఎర్ర కోట బురుజుల మీంచి ప్రసంగిస్తూ మహిళల హక్కులు, గౌరవం, నారీ శక్తి లాంటి గొప్ప గొప్ప నీతి వచనాలు పలికారు. ప్రధాన మంత్రి ప్రసంగం పొద్దున జరిగితే ఆ మధ్యాహ్నమే ఈ 11 మందిని విడుదల చేయడం చట్టాన్ని, న్యాయాన్ని, నైతికతను అపహాస్యం చేయడానికే అను కోవలసి వస్తోంది. ఒక వేపు ఆయన పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభు త్వమే అత్యంత కిరాతకులను విడుదల చేస్తే కిమ్మనని ప్రధాని ఇలాంటి హితవచనాలు, నీతి వాక్యాలు పలకడం కూడా ఆయన బూట కపు వాగ్దానాలలోనే జమకట్టక తప్పదు. నిజానికి సుదీర్ఘ కాలం న్యాయ పోరాటం చేసి దోషులకు శిక్ష పడేట్టు చేసిన బిల్కిస్ బానోనే అసలైన నారీశక్తి. ఆ కిరాతకులను విడుదల చేశారు కనక ఆమె బిక్కు బిక్కు మంటూ బతకవలసి వస్తోంది.

జీవచ్ఛవంలా బతుకుతున్న బిల్కిస్ బానో వ్యథ అక్కడితో పూర్తి కాలేదు. ఆమె పోరాటం ఎంత తీవ్రమైంది అయినా, గౌరవాన్ని, జీవి తాన్ని, స్వేచ్ఛను, న్యాయాన్ని కాపాడడానికి ఆమె ఎంత పరితపిస్తున్నా ఒక మతం వారి విషయంలో విద్వేషం నింపడంలో క్షణం తీరిక లేకుండా ఉన్న బీజేపీ సర్కారుకు కనికరం ఉంటుందని అనుకోవడం భ్రమే. కిరాతకులను వెనకేసుకొచ్చే పార్టీ ఆ పదకొండు మంది విడుద లైన తరవాత వారిని పూలమాలతో సత్కరించింది. మిఠాయిలు పంచి పెట్టింది. గోధ్రా నుంచి ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే సి.కె.రావుల్జీ మరింత కిరాతకంగా ఆ 11 మంది "ఉన్నత విలువలు ఉన్న బ్రాహ్మణులు" అని కీర్తించడం మానవత్వం ఏ స్థితికి దిగజారింది అనడానికి నిదర్శనం. ఇందులో పురుషంకార ధోరణి మాత్రమే లేదు. కులాధిపత్యం, ముస్లిం లంటే ద్వేషం కూడా ఇమిడి ఉన్నాయి. దిల్లీలో ఒక మహిళపై మూకుమ్మడి అత్యాచారానికి పాల్పడిన వారిని 2012 డిసెంబర్‌లో ఉరి తీసినప్పుడు ఇది ప్రజల అంతరాత్మ అన్నారు. హైదరా బాద్‌లో ఇలాగే ఒక మహిళపై మూకుమ్మడి అత్యాచారం చేసి హతమార్చిన నలుగురిని పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్లో హతమార్చినప్పుడు ఆ అంత రాత్మ ఎక్కడికి పలాయనం చిత్తగించినట్టు? అంటే నేరస్థులను వెనకేసుకు వచ్చేవారికి న్యాయమార్గ పాలన మీద ఎటూ నమ్మకం లేదు. న్యాయస్థానాల తీర్పులను గౌరవించే సంస్కారం అంతకన్నా లేదు. బిల్కిస్ బానో మీద అత్యాచారం చేసిన వారిని విడుదల చేయడానికి సిఫార్సు చేసిన పది మందితో కూడిన కమిటీలో బీజేపీతో సంబంధం ఉన్నవారే ఎక్కువ. ఇందులో ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు, ఒకరు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు. సంఘ సంఘసేవకురాలి పేరుతో ఈ కమిటీలో ఉన్న వినీత లేలే సైతం బీజేపీ సభ్యురాలే. సంఘ సేవకుల పేర ఈ కమిటీలో ఉన్న పవన్ భాయ్ సోనీ, సర్దార్ సింఘ్ పటేల్ కూడా బీజేపీ సభ్యులే. జైలు సూపరిం టెండెంట్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్, ప్రధాన జిల్లా జడ్జి, ఒక జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి సైతం ఈ కమిటీలో ఉన్నారు. ఈ కమిటీకి నాయకత్వం వహించింది పంచ్ మహల్ జిల్లా మేజిస్ట్రేట్. బీజేపీతో సంబంధం ఉన్న వారి నిర్ణయం ఎలా ఉంటుందో చెప్పలేం. ప్రభుత్వోద్యోగాల్లోనో, న్యాయ వ్యవస్థలోనో భాగమైన వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తారను కోవడం కుదిరే పని కాదు. నియమం ప్రకారం ఈ కేసులో తీర్పు చెప్పిన న్యాయమూర్తిని కూడా సంప్రదించ లేదు. ఈ కమిటీ ఆ అంశాన్ని పట్టించుకోనే లేదు. క్రౌర్యానికి పాల్పడ్డ వారిని విడుదల చేయడం బీజేపీ వ్యవహార సరళికి ప్రబలమైన నిదర్శనం.

ఒన్ నేషన్ మోదీ ఉవాచ

రా బావ ఏంటి ఈ రోజు ఆలస్యంగా వచ్చావు. ఏంలేదు బావ రాత్రి మా అబ్బాయి స్నేహితులిద్దరు వచ్చి అర్ధరాత్రి పన్నెండు గంటల వరకు ఏదో ఒక విషయంపై చర్చించుకుంటూ ఉంటే నేను కూడా వింటూ కూర్చున్నా. నిద్ర చాలక ఆలస్యంగా లేచాను. నువ్వు కూడా నిద్ర మాని విన్న విషయం ఏంటి. ఆ ఏంలేదు బావ ప్రధాని ఒన్ నేషన్ అని యిచ్చిన స్లోగను మన దేశంలో సాధ్యం కాదని చర్చ నడిపారు.

నిజమే బావ మన దేశంలో కుల నిర్మూలన జరగకుండా దేశం మొత్తం కాదు గద హిందువులు అంతా ఒకటి కాలేరు. అంబేద్కర్ ఏనాడో చెప్పాడుగా బావ. అసలు కుల వ్యవస్థ సమాజం విచ్ఛిన్నకారి అని ఆయన అన్నారు. సమానత్వం సామాజిక జీవితాన్ని నడిపే ప్రాథమిక సూత్రం అని కూడా అంబేద్కర్ అన్నారుగా బావ. నిజమే బావ మోదీ ముందు ఒకే జాతి అని తర్వాత ఒకే పార్టీ ఉండాలంటాడు కూడ. అందులో సందేహం ఏముంది బావ. బి.జె.పి హిందుత్వాన్ని నెత్తిన మోస్తోంది. ముందు ముందు హిందు వులు తప్ప భారతదేశంలో ఎవరూ ఉండడానికి వీల్లేదు అని కూడ అంటారు. అది ఎప్పుడో కాదు బావ మరోసారి మనం గెలిపించి నెత్తిన పెట్టుకుంటే భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చి హిందూయేతరులను పొమ్మంటుంది.

నిజమే బావ అంత పని చేసి తీరుతారు. ఖచ్చితంగా అంత పని చేస్తా రనే కమ్యూనిస్టులు అప్రమత్తమవుతున్నారు. రెండు కమ్యూనిస్టు పార్టీలు ఈ విషయంలో చర్చలు జరపవచ్చు. మరోపక్క బి.జె.పి యేతర ప్రతిపక్షాలను

ఏకం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి కె.సి.ఆర్, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, రాజకీయ కురు వృద్ధుడు పవార్‌లు కృషి చేస్తున్నారు. అసలు ఈ కుల కుంపట్లు ఏంటి? ఏముంది బావ ప్రకృతిలో మానవ ఆకారం ఏర్ప డిన తరవాత తన లాంటి మనిషిని చూసి జంతువుల నుండి కాపాడు కోవడానికి చేయి కలిపి సహజీవనం చేస్తూ తనకు కావల్సిన వాటిని సమ కూర్చుకున్నాడు. ఆనాడు లేని కుల మతాలు యిప్పుడెందుకు వచ్చాయి బావ.

ఇదంతా మను సృష్టి బావా. ఆ మనువాదాన్ని నెత్తిన పెట్టుకుని మోస్తున్న బి.జె.పి మన దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చే ఆలోచనలో ఉంది. అప్పట్లో విద్య నేర్పిన బ్రాహ్మణుడు చెప్పినట్లు పాలించే రాజులు వినడం, రాజ శాసనం ప్రజలు అమలు చేయడం జరిగేది. రాజును పైన కూర్చోబెట్టి తరవాత తాను కూర్చుని యిద్దరు బతకడానికి సంపాదించే వైశ్యుడిని మూడో మెట్టు మీద ఉంచి మిగతా ప్రజలంతా అంటరానివారుగా పరిగణించి ఆ మనువు ఈ నిచ్చెన మెట్ల వ్యవస్థ సృష్టించాడు బావ. తరవాతే మతాలు, కులాలు ఏర్పడినాయి బావ. అది సరే బావ ఆ మనువు ఏర్పాటు చేసిన ఈ కుల నిర్మూలన ఎప్పటికి జరుగుతుందంటావు.

ఋగ్వేద కాలంలో తెగ వ్యవస్థ ఉండేది. మలి యుగంలో శ్రమ విభజన ప్రాతిపదికపై బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అని చాతుర్వర్ణ వ్యవస్థ ఏర్ప డింది. యుద్ధాలలో రాజుల విజయం కోసం బ్రాహ్మణులు యజ్ఞ యాగాదులు చేసేవారు. జంతు బలులు ఇచ్చేవారు. వారిని గుర్తించి రాజులు గో, వస్త్ర, కనక, అశ్విక దానాలతో సత్కరించేవారు. వైశ్యులు ఆదాయాన్ని సృష్టించే వారు. ఆ మూడు వర్ణాలకు శూద్రులు డబ్బులు తీసుకోకుండా సేవలు చేసే వారు. ఆ తర్వాత హరిజనులను ఊరి బయట ఉంచి అంటరాని వారుగా పరిగణించి పంచమ వర్ణంగా అయిదవ నిచ్చెన మెట్టు ఏర్పాటయింది. అది సరే బావ యిపుడిపుడే మార్పు పుణ్యమా అని శ్రమ దోపిడీని అరికట్టి శ్రమ జీవుల శ్రమకు తగిన వేతనం కోసం కమ్యూనిస్టుల పోరాటంతో ఊపిరి పీల్చుకుంటే మళ్లీ ఈ బి.జె.పి హిందువులు, హిందూ యేతరులు అంటూ ఈ గోల ఏంటి బావ. హిందూ మతం పునాదిగా హిందువునే మనిషిగా పరిగ ణించే సంస్థ నుండి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా ఎదిగి రాజకీయాల్లోకి వచ్చిన మోదీ తన ప్రభుత్వానికి ఢోకా లేదనుకున్న నాడు మరల చాతుర్వర్ణ వ్యవస్థ ముందుకు తెస్తాడు. అది సరే బావ ఏ ముఖ్యమంత్రి కుల నిర్మూలన పట్ల శ్రద్ధ చూపడం లేదు కదా. ఓ పిచ్చి బావ కుల నిర్మూలన కాదు కులాలను పెంచి పోషిస్తు న్నారు. జగన్ ఒక అడుగు ముందుకేసి కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేరాడు. కులాల వారీగా మంత్రి పదవులు, ఎం.ఎల్.ఏ టిక్కెట్లు యివ్వడంతో ప్రస్తుతం రాజకీయ నాయకులు కులగణన చెయ్య మంటున్నారు. అంటే ఎక్కువ సంఖ్యలో ఉన్న కులాలకు ఎక్కువ టికెట్లు కావా లని డిమాండు చెయ్యడానికి. అది సరే పాలకులే కులాలను పెంచి పోషి స్తుంటే కుల నిర్మూలన అనే మాట మరిచిపోవాలేమో బావ. అలాంటపుడు ప్రధాని ఒకే జాతి అనే నినాదం ఎలా సాధ్యం బావ. సాధ్యం కాదనే రాత్రి మీ అబ్బాయి స్నేహితులు చర్చ జరిపారు.

ముమ్మాటికి సాధ్యం కాదు కదా. పైగా కులాల మధ్య గొడవలు పెరిగే అవకాశం ఎక్కువ. జనాభా లెక్కల ప్రకారం రెడ్లు, కమ్మ కంటె కాపులెక్కువ. వారికి ముఖ్యమంత్రి పదవి దక్కలేదనే బాధ వారు వ్యక్తం చేస్తున్నారు కద బావ. ఏది ఏమైనా మోదీ స్లోగను నిరర్థకమే.

పశుసంపదను వణికిస్తున్న లంపి వైరస్

రావుల వెంకయ్య

మన దేశంలో ఆవులు, గేదెలు ఇతర పశు సంపదను వణికిస్తున్న తాజా వ్యాధి "లంపి". 2020-21 సంవత్సరాలలో ప్రపంచాన్ని, దేశాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి వలన లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. తిరిగి అలాంటి వైరస్ పశుసంపదను కబళించటానికి లంపి వైరస్ రూపంలో ముందుకు వచ్చింది. ఇలాంటి వ్యాధి గతంలో ఎప్పుడూలేదు. కొత్తగా ముంచుకు వచ్చింది. గతంలో గాలికుంటులాంటి వ్యాధుల వల్ల పశువులకు ముప్పు ఏర్పడినా అది తాత్కాలికమే. ఇప్పుడు వచ్చిన లంపి వ్యాధికి దేశంలో ఎక్కడా మందు కనిపెట్టలేదు. పాడి పశువుల పాలిట మహమ్మారి అయి ఈ వైరస్ చాప కింద నీరులా విస్తరిస్తున్నది. లంపిగా పిలిచే చర్మ వాధి కాప్రీ పాక్స్ అనే ఈ వైరస్ ఆవులు, గేదెలు తదితర పశువులపై ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధి తొలిసారిగా గుజరాత్‌లోని "కచ్" ప్రాంతంలో బయటపడింది. తదనంతరం రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్‌లకు వ్యాపించింది. మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలతో సహా 13 రాష్ట్రాలకు ఈ వ్యాధి ఎగబాకింది. దేశ వ్యాప్తంగా ఈ వ్యాధి 15 లక్షల పశువులకు సోకింది. అందులో 70 వేలకు పైగా పశువులు చనిపోయాయి.

ఈ వ్యాధి రాజస్థాన్‌లో పెద్ద ఎత్తున ప్రమాద ఘంటికలను మోగించింది. రాజస్థాన్ రాష్ట్రంలో ఇప్పటికే 11 లక్షలకు పైగా పశువులు ఈ వ్యాధి బారిన పడ్డాయి. అందులో 57 వేల పశువులు మరణించాయి. రోజుకు సగటున 600 నుండి 700 వరకు ఆవులు మరణిస్తున్నాయి. ఈ వ్యాధి కారణంగా రాజస్థాన్‌లో పాల ఉత్పత్తి 15 నుండి 18 శాతం వరకు తగ్గిపోయింది. దీని ప్రభావం పాలతో తయారుచేసే స్వీట్లు తదితర పదార్థాల ధరలపై పడింది. రోజుకు 5 నుండి 6 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి తగ్గిపోయిందని రాజస్థాన్ కోపరేటివ్ డెయిరీ ప్రకటించింది.

ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు జిల్లాల్లో ఈ వ్యాధి కనబడుతున్నదని ప్రభుత్వ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ప్రభుత్వ వర్గాల లెక్కల ప్రకారం విజయనగరంలో 25, ఏలూరులో 16, శ్రీకాకుళంలో 11 కృష్ణా, గుంటూరు, కర్నూలు జిల్లాల్లో పశువులకు అక్కడక్కడ ఈ వ్యాధి సోకిన లక్షణాలు కనబడుతున్నాయన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని ఏడు జిల్లాల్లో ఈ వ్యాధి కనబడుతున్నదని ప్రభుత్వ వర్గాలు హెచ్చరిస్తు న్నాయి. ప్రభుత్వ వర్గాల లెక్కల ప్రకారం విజయనగరంలో 25, ఏలూరులో 16, శ్రీకాకుళంలో 11 కృష్ణా, గుంటూరు, కర్నూలు జిల్లాల్లో పశువులకు అక్కడక్కడ ఈ వ్యాధి సోకిన లక్షణాలు కనబడుతున్నాయన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, పశు సంవర్థకశాఖ తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదం ముంచుకువచ్చే సూచ నలు కనబడుతున్నాయి. ఈ వ్యాధి ఈగలు, దోమలు, పేలు, కందిరీగలు లాంటి రక్తం పీల్చే కీటకాల వల్ల వస్తుంది. ఈ వ్యాధి గోటాఫ్యాక్స్, ఫిష్ ఫ్యాక్స్ కుటుం బానికి చెందిన వైరస్‌గా గుర్తించారు. ఈ మహమ్మారి అత్యంత వేగవంతంగా వ్యాపిస్తుంది. మొదట చిన్న బుడిపల్లా ఏర్పడి తర్వాత గడ్డలుగా మారిపోతున్నది. జ్వరంతోపాటు గడ్డలు ఏర్పడి పశువుల శ్వాస నాళాలపై ప్రభావం కలిగిస్తున్నది.

దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, పశుసంవర్థకశాఖ తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదం ముంచుకువచ్చే సూచనలు కనబడుతున్నాయి. ఈ వ్యాధి ఈగలు, దోమలు, పేలు, కందిరీగలులాంటి రక్తం పీల్చే కీటకాల వల్ల వస్తుంది. ఈ వ్యాధి గోటాఫ్యాక్స్, ఫిష్ ఫ్యాక్స్ కుటుంబానికి చెందిన వైరస్‌గా గుర్తించారు. ఈ మహమ్మారి అత్యంత వేగవంతంగా వ్యాపిస్తుంది. మొదట చిన్న బుడిపల్లా ఏర్పడి తర్వాత గడ్డలుగా మారిపోతున్నది. జ్వరంతోపాటు గడ్డలు ఏర్పడి పశు వుల శ్వాస నాళాలపై ప్రభావం కలిగిస్తున్నది. పశువులు మేత సరిగా తినలేవు. నోటి నుండి సురగలు, లాలాజలం కారిపోతుంది. ముక్కు, కండ్లు నుండి కూడా నీరు కారుతుంది. కొన్ని రోజులకు పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. దీనికి వైద్యం లేనందువల్ల కేవలం యాంటిబయాటిక్స్ మాత్రమే వాడుతున్నారు. ఇది ఒక ఉపశమనంగా ఉపయోగపడుతుంది తప్ప శాశ్వత పరిష్కారం కాదు. వ్యాధి సోకిన పశువులను ఇతర ప్రాంతాలకు పోనివ్వకుండా పశువులశాలను పరిశుభ్రంగా ఉంచుకొంటే కొంత మేరకు ఈ వ్యాప్తిని అరికట్టవచ్చు.

ఇటీవల బరేలీ దగ్గర పంత్‌నగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంవారు ఈ వ్యాధి నివారణకు వ్యాక్సిన్ కనుగొన్నారు. ముందు జాగ్రత్తగా "లంపి ప్రొమిక్స్ ఇండ్" వ్యాక్సిన్‌ను సెప్టెంబరు 10న దిల్లీలో కేంద్ర వ్యవసాయ మంత్రి తోమర్ విడుదల చేశారు. దీనికి కేంద్ర వ్యవసాయశాఖ (ఐ.సి.ఎ.ఆర్), వెటర్నరీ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐ.బి.ఆర్.ఐ) లాంటి సంస్థలు ఈ వ్యాక్సిన్‌కు ఆమోదం తెలిపాయి. ఈ వ్యాక్సిన్ ప్రక్రియ ఇప్పటికే మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో మొదలైంది. దేశంలో పశువులన్నింటికి వ్యాక్సిన్ ఇవ్వాలంటే మొత్తం 1.5 మిలియన్ల డోస్‌లు అవసరం అవుతుంది. దేశ వ్యాప్తంగా 80% పశు వులకు ఇస్తేనే ఈ ప్రయోజనం నెరవేరుతుంది. ఈ వ్యాక్సిన్ పంపిణీ ఈ విధంగా మొదలైతే 2025 నాటికి పూర్తికావచ్చునని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

భారతదేశంలో వ్యవసాయం తరవాత పాడి పరిశ్రమ ప్రధానమైన వృత్తిగా ఉన్నది. గ్రామీణ ప్రాంతాల్లో 90% మంది సన్న, చిన్న కారు రైతులు, మహిళలు ఈ పాడిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. నేటి పాలకులు నిత్యం ఆవు పవిత్రమైనదిగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పశు గణాభివృద్ధికే మా ప్రాధాన్యతని ప్రచారం చేస్తున్నది. కనుక పశువుల పాలిట మహమ్మారిగా వచ్చిన ఈ వైరస్‌ను "జాతీయ విపత్తుగా" ప్రకటించి తగు చర్యలు చేపట్టాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యాక్సిన్‌ను యుద్ధ ప్రాతిపదికన జిల్లాల్లో పంపిణీ చేసి పశుసంపదను రక్షించాలి. పాడి రైతాంగాన్ని ఆదుకోవటానికి తగు చర్యలు చేపట్టాలి.

వ్యాస రచయిత అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు

విదేశాంగ విధానంలోకీ చొరబడిన హిందూత్వ

షోయబ్ దనియాల్

పచ్చ కామెర్ల రోగికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందట! ప్రాణాలు తోడేసే ఈ పచ్చదనం గురించి మనందరికీ తెలుసు. మరి ఇదే వైఖరితో వ్యవహరిస్తున్న బీజేపీ గురించి మనకు అర్థమవుతోందా? హిందూత్వమే ప్రధాన అజెండాగా నడుస్తున్న బీజేపీ, దీని మాటున జనం జీవితాలతో చెలగాట మాడుతున్న బీజేపీ అత్యంత ప్రమాదకరమైన ఈ హిందూత్వను మన దేశానికే పరిమితం చేయడం లేదు, ప్రపంచ దేశాలకూ విస్తరించే ప్రయత్నంలో ఉంది. అవును ఈ ప్రాతిపదికనే ఇప్పుడు మనదేశ విదేశాంగ విధానం ఉంది. మోదీ విదేశాంగ విధానంలో ప్రపంచ హిందూత్వనే కీలకమైన అంశమన్నది అందరినీ ఆశ్చర్యపరిచే అంశమే కాదు ఆందోళన కలిగించే అంశం కూడా. ఇదేమీ ఆషామాషీగా చెబుతున్నది కాదు. తరచి చూస్తే ఎన్నో రుజువులు కనిపిస్తాయి. హిందూత్వ లక్ష్య సాధన కోసం మనదేశంలో చేయాల్సిన దురాగతాలన్నీ చేస్తున్న బీజేపీ ఇప్పుడు ఇదే లక్ష్యంతో ప్రపంచ దేశాల మీద పడుతోంది. ఇందుకోసమే దేశ విదేశాంగ విధానంలోనూ హిందూత్వనే కీలకాంశంగా మార్చింది, ఈ బాటనే అనుసరిస్తోంది.

ఇందుకు తాజా ఉదాహరణ యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లీసెస్టర్ సంఘ టన. ఇక్కడ ఈ నెలలో హిందూ, ముస్లింల మధ్య చిన్నపాటి మత ఉద్రిక్తత చోటుచేసుకుంది. వాస్తవానికి ఇది నగర పోలీసులు పరిష్కరించగలిగిన స్థానిక అంశం. ఇలాంటి విషయాన్ని భూతద్దంలో చూపిస్తూ పెద్ద గలాటా సృష్టిం చింది భారత (బీజేపీ) ప్రభుత్వ అనుకూల మీడియా. ఇలాంటి పనులు మాకు కొట్టిన పిండి అన్నట్టుగా గోటితో పోయేదాన్ని గొడ్డలి దాకా తీసుకొచ్చింది. భారత్‌లో ఉన్న మత ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో లీసెస్టర్ ఘటనను చూపిస్తూ దేశంలోని టీవీ ఛానల్స్ చర్చోపచర్చలు సాగించాయి. భారత (బీజేపీ) ప్రభుత్వ అనుకూల వార్తా ఛానల్స్ లీసెస్టర్ ఘటనకు మతం రంగు పులమడాన్ని యుకె జర్నలిస్టు ఒకరు ప్రశ్నించారు. విద్వేషాన్ని పెంచు తున్నాయని ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న ఈ ఛానల్స్ లీసెస్టర్ ఘటనను పూర్తిగా వక్రీకరించాయన్నారు.

దేశానికి ఆవల ఎక్కడో జరిగిన ఈ ఘటనలపై భారత్‌లోని సోషల్ మీడియా చూపించిన విపరీత ఆసక్తిని ఆధారంగా చేసుకుని ప్రధాన మీడియా ఈ కార్యక్రమాలను నిర్వహించింది. లీసెస్టర్‌లో ఉద్రిక్తతలపై సగానికి సగం ట్వీట్లు భారతదేశం నుంచే ఉన్నాయని బీబీసీ పరిశోధనలో తేలింది. ఇందులో చాలా వరకూ మతపరమైనవే కావడం గమనించాల్సిన విషయం. హిందు వులపై దాడులు జరుగుతున్నాయనే హ్యాష్‌టాగ్‌లతో వీటిని పోస్ట్ చేశారు. గోరంతను కొండంతలుగా చూపించేందుకు కొంతమంది వ్యక్తులు కావాలనే అనేక అకౌంట్లను ఉపయోగించారు. భారత్‌లో హిందూత్వ వెబ్‌సైట్ 'ఒపిఇండియా' లీసెస్టర్ ఘటన గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిందని బీబీసీ పేర్కొంది.

భారత్ కాదు... హిందూత్వ ప్రాతినిధ్యం!

ఇక్కడ అత్యంత బాధాకరమైన విషయమేమంటే లీసెస్టర్ ఘటనలపై భారత ప్రభుత్వ వైఖరీ ఇలాగే ఉండడం. "హిందూ మత చిహ్నాలను, ఆవ రణను ధ్వంసం చేశారు" అని ఆరోపిస్తూ యు.కె.లోని భారత హై కమిషన్ ఈ నెల 19వ తేదీన ఒక అధికారిక ప్రకటనను విడుదల చేసింది. దీనిపై స్పందించిన బ్రిటన్ ముస్లిం మండలి.. భారత్ పక్షపాత వైఖరి కనబరుస్తోం దని విమర్శించింది. దీనికి ముందు ఇటీవలే కెనడాలోని భారతీయ హై కమిషన్ కూడా టొరంటోలోని హిందూ దేవాలయాన్ని అపవిత్రం చేశారని బహిరంగంగా విమర్శించింది. కెనడాలో భారత్ వ్యతిరేక కార్యకలాపాలు, విద్వేష నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆరోపిస్తూ భారత ప్రభుత్వం గత శుక్రవారమే ఒక ప్రకటన చేసింది.

ఇతర దేశాల శాంతిభద్రతల వ్యవహారాల్లోకి చొరబడేందుకు భారత ప్రభుత్వం తన విదేశాంగ విధానాన్ని ఆయుధంగా ఉపయోగించుకుంటోంది. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ప్రధానమైన మార్పుల్లో ఇది కూడా ఒకటి. ఇప్పుడు భారత విదేశాంగ విధానంలో ప్రధాన పాత్ర హిందూత్వదే. విదేశాంగ విధానంలో హిందూత్వ భావనలు, హిందూ జాతీయతా చిహ్నాలను ఉపయోగించడం మాత్రమే కాదు విదేశాల్లో 'హిందూ' అంశాలకూ మద్దతునిచ్చేంతగా బరితెగించింది.

విదేశాంగ విధానంగా మతం

మోదీ ప్రధానమంత్రి అయిన తర్వాత పొరుగు దేశాల్లో జరిపే దౌత్య పర్యటనల్లో తన వ్యక్తిగత విశ్వాసాలను చూపించడం హిందూత్వకు ఆయన ఎంత ప్రాధాన్యతనిస్తున్నారో మనకు నేరుగా అర్థమయ్యేలా చేస్తోంది. ఉదా హరణకు గత ఏడాది (2021) ఆయన బంగ్లాదేశ్ దేవాలయంలో ప్రార్థనలు చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ముందు జరిగిన ఈ పర్యటనలో హిందూత్వతో పాటు ఎన్నికల కోణమూ కనిపించింది. నేపాల్ పర్యటనలోనూ మోదీ ఇలాగే వ్యవహరించారు. 2015లో శ్రీలంక వెళ్ళినప్పుడూ అక్కడి హిందూ దేవాలయంలో పూజలు చేశారు.

సంపూర్ణ లౌకిక దేశ లక్షణమైన ప్రభుత్వ కార్యకలాపాల్లో వ్యక్తిగత విశ్వాసాలను దూరంగా ఉంచడాన్ని ఆయన పాటించడం లేదు. భారత్‌లో మెజారిటీ ప్రజల మతాన్ని కేంద్రంగా చేసుకుని తాను వ్యాప్తి చేయదలుచు కున్న హిందూత్వను కీలక భాగంగా మార్చారు. "మోదీ ఖాట్మండులో పశుపతి నాథ్ దేవాలయానికి వెళ్ళి పూజలు చేసినప్పుడు లేదా కేదార్‌నాథ్ బనారస్‌లకు వెళ్ళినప్పుడు నుదుటన బొట్టు లేదా విభూతి పెట్టుకునే బయటకు వస్తారు. తాను హిందువునని, ఇందుకు తాను గర్విస్తున్నానని ఆయన చెబుతారు" అని బీజేపీ నాయకుడు ఒకరు జర్నలిస్టుతో అన్నారు.

హిందూత్వ కేవలం వివిధ రూపాల్లో కనిపించడమే కాదు మోదీ విదే శాంగ విధానంలోనూ మూలకంగా మారింది. మోదీ విదేశాంగ విధాన దృక్పథంపై 2019లో పుస్తకం రాసిన ఆస్ట్రేలియా విద్యావేత్త ఇయాన్ హాల్.. 2014 తర్వాత భారత విదేశాంగ విధానంలో వచ్చిన మార్పు గురించి చెప్పారు. "విశ్వగురు హిందూ జాతీయవాదుల గుప్పెట్లోకి దేశాన్ని దీర్ఘ కాలంలో తీసుకోవడమే వారి లక్ష్యం. కాదంటే కనీసం నామమాత్రంగానైనా దీనిని సాధించడమే వారి ధ్యేయం"

విదేశాంగ విధానంలో ప్రవాస భారతీయుల కోసమూ కీలక పాత్ర పోషిం చడం దాని ప్రధాన ఉద్దేశం. మోదీ తొలి దఫా విదేశీ పర్యటనల్లో అక్కడి భార తీయులతో ముచ్చటించడం, ఇష్టాగోష్ఠులు జరపడం తదితరాలకు అత్యధిక ప్రాధాన్యనిచ్చి టీవీ ఛానల్స్‌లోనూ ప్రసారం చేసారు. ప్రత్యేకించి అమెరికా

బంగ్లాదేశ్‌లోని హిందూ దేవాలయంలో మోదీ పూజలు

లాంటి దేశాలకు వెళ్ళినప్పుడు అక్కడ ప్రవాస భారతీయులతో మంచి సంబంధాలు ఉన్న హిందూత్వ నెట్‌వర్క్‌లు ఎక్కువగా ఈ పని చేసాయి.

మోదీ అసలు దౌత్యవేత్తలకు కాకుండా బీజేపీ సభ్యులు, బీజేపీ సిద్ధాం తానికి మూలకర్త అయిన ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఇది ఎంతవరకూ వెళ్ళిందంటే హిందూ జాతీయవాద కోణంలో ప్రపంచాన్ని చూడ డం నుంచి తమ ప్రభుత్వ చర్యల సమర్థన, వ్యాప్తి కోసం తమ అనుకూలుర కు అనుగుణమైన వేదికలను ఏర్పాటు చేయడం వరకూ అని హాల్ రాశారు.

నాలుగేళ్ళ క్రితం 2019లో ఆమోదించిన పౌరసత్వ సవరణ చట్టం ఇటు విదేశాంగ విధానంలో హిందూత్వ కోణాన్ని అర్థం చేసుకునేందుకు, అటు భారతదేశ ప్రయోజనాలను ఎలా దెబ్బతీస్తోందో తెలుసుకోవడానికి ఒక మంచి ఉదాహరణ. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్‌ల నుండి భారతదేశం లోకి ఎలాంటి పత్రాలు లేకుండా వచ్చినవారికి భారతీయ పౌరసత్వాన్ని ఇచ్చే అవకాశాన్ని తొలిసారిగా ఈ చట్టం కల్పించింది. ఇక్కడ ఉన్న మెలికేమంటే వారు ముస్లింలు అయి ఉండకూడదు. ఈ చట్టాన్ని ఆమోదించడంలో బీజేపీ తన రాజకీయ చాతుర్యాన్ని చూపించింది. మనదేశానికి అత్యంత సన్నిహితమైన మిత్ర దేశం బంగ్లాదేశ్ మత మైనారిటీలను చిన్నచూపు చూస్తోందంటూ ఆరోపించింది. ఇక్కడ రాజకీయాల్లో మత విశ్వాసాల కోణం మనకు స్పష్టంగా కనపడుతోంది. బంగ్లాదేశీ ముస్లింల ఆరోపణల కారణంగా భారత్‌లోకి వస్తున్న బంగ్లాదేశీ హిందువులకు రక్షణ కోసమే ఈ చర్య తీసుకుంటున్నట్టు చెప్పడం విడ్డూరం. ప్రస్తుత కేంద్ర హోం మంత్రి అమిత్ షా 2018లో బంగ్లాదేశ్ వలసలను "చెద పురుగులు" అని కువ్యాఖ్య చేయడం తెలిసిందే. 2021లో మోదీ బంగ్లాదేశ్ స్వాతంత్ర్య స్వర్ణోత్సవ సంబ రాల్లో పాల్గొనేందుకు అక్కడకు వెళ్ళినప్పుడు అల్లర్లు చెల రేగాయి. ఈ హింసలో 17మంది చనిపోయారు. పాలక అవామీలీగ్ పార్టీ ఇప్పటికీ భారత్‌తో సన్నిహితంగా ఉన్న ప్పటికీ మోదీ హిందూత్వ చిహ్నంగా వ్యవహరిస్తుం డడంతో భారత దౌత్యవేత్తల పని క్లిష్టంగా మారింది.

భారతీయ ప్రయోజనాలకు గండం

ముస్లింలు ఎక్కువగా ఉన్న మాల్దీవుల్లోనూ ఇప్పుడు ఇలాంటి వైఖరే నెరపుతున్నారు. ఈ దేశ రాజకీయాల్లో భారత్ అనుకూల, వ్యతిరేక సెంటిమెంట్లు తరచుగా భాగమవుతున్నాయి. హిందూత్వ ముద్రతో నడుస్తున్న భారత విదేశాంగ విధానం వల్లే ఈ పరిస్థితులు చోటు చేసుకున్నాయి. మాల్దీవుల రాజధాని మాలేలో భారత హై కమిషన్ నిర్వహించిన యోగా కార్యక్రమాన్ని జూన్‌లో కొంతమంది అడ్డగించడం ఇందుకు ఉదాహరణ.

విదేశాంగ విధానంలో హిందూత్వను ఉపయోగిం చడం ద్వారా మోదీ దేశీయంగా తన ప్రతిష్ఠను పెంచుకోవాలను కుంటున్నారు. హిందువుల ఓట్ల మీదే బీజేపీ పూర్తిగా ఆధారపడ నందున దేశంలో మెజారిటీ మతమైన ఈ హిందువుల నుండి మద్దతు సంపాదించాలను కుంటున్నారు. కానీ, ఇది ప్రవాస భారతీయుల్లోనూ మత చీలికలు తీసుకొచ్చింది.

ఉదాహరణకు ఆగస్టులో అమెరికాలోని ఒక నగరంలో భారతదేశ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు జరిపినప్పుడు 'బుల్డోజర్'ను ప్రదర్శించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. బీజేపీ పాలిత అనేక రాష్ట్రాల్లో ముస్లింల గృహాలను బుల్డోజర్‌తో ధ్వంసం చేసిన నేపథ్యంలో ఈ విమర్శలు వెల్లువెత్తాయి. ఇలాంటి తీవ్ర విచ్ఛిన్నకర చిహ్నాలను ఉపయోగించడంపై చివరకు నిర్వాహకులు క్షమా పణలు చెప్పాల్సి వచ్చింది. హిందూత్వ లక్ష్యాల కోసం యు.కె., కెనడా, బంగ్లాదేశ్ దేశాల రాజకీయాల్లో తనంతట తానుగా జోక్యం చేసుకుంటున్న మోదీ ప్రభుత్వం మన దేశ ప్రయోజ నాల కోసం విదేశాంగ విధానాన్ని ఉపయోగించకపోవడం దాని కుతంత్రానికి తార్కాణం.

చల్లారని కాంగ్రెస్ కుమ్ములాట

రాజస్థాన్‌లో ఆధిపత్య రాజకీయం
గెహ్లాట్, పైలట్ వర్గాల నిందారోపణలు

జైపూర్: రాజస్థాన్ కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాట, ఆధిపత్య ధోరణి కొనసాగుతోంది. సీఎం అశోక్ గెహ్లాట్, యువనేత సచిన్ పైలట్ వర్గాలుగా ఆ పార్టీ నాయకులు మరోసారి రోడ్డెక్కి పరస్పర విమర్శలు గుప్పించుకుంటున్నారు. పార్టీకి తాము విధేయులమంటే తాము విధేయులమని చెప్పుకుంటున్నారు. పరస్పర విమర్శలు గుప్పించుకుంటున్నారు. పార్టీ ద్రోహులని నిందించుకుంటున్నారు. అధిష్ఠానానికి దగ్గరగా ఉన్నామని రెండు వర్గాలు చంకలు గుద్దుకుంటున్నాయి. తాజాగా సచిన్ పైలట్‌కు అత్యంత విశ్వాసపాత్రుడు వేద్ ప్రకాశ్ సోలంకి పార్టీ ద్రోహి అని, అందుకు సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని రాజస్థాన్ కాంగ్రెస్ నేత, అశోక్ గెహ్లాట్ సన్నిహితుడు ధర్మేంద్ర రాథోడ్ చెప్పారు. క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడిన రాథోడ్‌కు కాంగ్రెస్ పార్టీ ఇటీవల షోకాజ్ నోటీస్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో తాను కాంగ్రెస్ పార్టీ సైనికుడినని, తాను పార్టీకి ఎలాంటి నష్టం చేయలేదని ఆయన గురువారం చెప్పారు. సచిన్ పైలట్ ముఖ్యమంత్రి అవుతారన్న భావంతో ధర్మేంద్ర రాథోడ్ సీఎం అశోక్ గెహ్లాట్ అనుకూల ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేశారు. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా స్పందించింది. 'ఎవరు పార్టీ ద్రోహి...ఎవరు విశ్వాసపాత్రుడు అనే విషయాన్ని నేను నిరూపిస్తాను. ఆధారాలను అందరి ముందూ పెడతాను. జిల్లా పరిషత్ ఎన్నికల వేళ బీజేపీ అధ్యక్షుడు సతీశ్ పూనియాను ఓ హోటల్‌లో పైలట్ సన్నిహితుడు సోలంకి కలిశారు' అని రాథోడ్ చెప్పారు. సోలంకి, పూనియా హోటల్‌లోకి ప్రవేశించడం, ఒకరి తర్వాత మరొకరు హోటల్ గదిలోకి వెళ్లిన వీడియోను విలేకరుల సమావేశంలో రాథోడ్ ప్రదర్శించారు. జిల్లా పరిషత్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ సభ్యుల ఫిరాయింపుపై ఇద్దరు సమావేశమయ్యారని ఆరోపించారు. పార్టీకి హాని కలిగిస్తున్నాడని సోలంకిపై తాను సైతం ఫిర్యాదు చేశానని మంత్రి గోవింద్ రామ్ మేఘవాల్ అదే విలేకరుల సమావేశంలో చెప్పారు. అయినా రాజస్థాన్ పార్టీ ఇన్‌చార్జి అజయ్ మాకెన్ పట్టించుకోలేదని ఆరోపించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీజేపీ గెలవడానికి సోలంకి సహకరించాడని, పార్టీకి తీరని ద్రోహం చేశారని ఆరోపించారు.

కాంగ్రెస్, బీజేపీకి మధ్యవర్తిగా రాథోడ్ పనిచేస్తున్నాడని సోలంకి బుధవారం ఆరోపించారు. ధర్మేంద్ర ఎవరు? ధర్మేంద్ర రాథోడ్ బీజేపీ, కాంగ్రెస్‌కి ఓ బ్రోకర్. రెండు పార్టీలకు బ్రోకర్‌గా ఎలా పనిచేస్తున్నాడో అందరికీ తెలుసని సోలంకి మండిపడ్డారు. 'మేము అధిష్ఠానంతో ఉన్నాం. ఎవరు నిజాయతీపరులు, ఎవరు అసత్యవాదులు, ఎవరు ద్రోహులో అందరికీ తెలుసు. ధర్మేంద్ర రాథోడ్ గురించి మాట్లాడటమంటే సమయం వృథా చేసుకోవడమే'నని సోలంకి వ్యాఖ్యానించారు. రాజస్థాన్ కాంగ్రెస్‌లో సంక్షోభానికి కూడా ఈ ఇద్దరు నేతలే ప్రధాన కారణంగా నిలిచారు. వీరితో పాటు రెండు వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, నాయకులు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు.

'మై కార్పొరేటర్' యాప్‌లో ముంబై కార్పొరేటర్ల పనితీరు

ముంబై : ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల పనితీరుపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ప్రజల్ని చైతన్య పర్చడానికి ముంబైలోని ఒక సంస్థ నడుంకట్టింది. వివరాల్లోకి వెళితే ముంబై మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56 మంది కార్పొరేటర్ల పని తీరును 'మై కార్పొరేటర్' అనే పేరుతో రూపొందించిన మొబైల్ యాప్‌లో పొందుపర్చారు. ఇందుకు సంబంధించిన వివరాలను నాగరికాయన్ పరిశోధనా కేంద్రం కో-ఆర్డినేటర్ ఆనంద్ భండారే గురువారం పీటీఐతో పంచుకున్నారు. మెకానికల్ ఇంజనీర్ చదువుకున్న బండారీ మాట్లాడుతూ...2016లో తమ సంస్థ తరఫున 'నా వార్డు -నా కార్పొరేటర్' అనే ప్రాజెక్టును ప్రారంభించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా మై కార్పొరేటర్ అనే మొబైల్ యాప్‌ను రూపొందించినట్టు తెలిపారు. కార్పొరేటర్ల పని తీరును పరిశీలించి రిపోర్టు కార్డులను తయారు చేసి ఆ యాప్‌లో పొందుపరుస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ యాప్‌లో ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌లోని 56 మంది కార్పొరేటర్ల పనితీరుకు సంబంధించిన నివేదికలు ఉన్నాయని తెలిపారు. గత ఆరేళ్లుగా తాము ఈ యాప్ కోసం కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని చెప్పారు. యాప్‌లో ఇంగ్లీషు, మరాఠీ భాషల్లో సమాచారం అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఐవోఎస్ ద్వారానూ యాప్ డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. యాప్ వినియోగించేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందుకోసం వివిధ వార్డుల్లో కార్యశాలలు నిర్వహించి అవగాహన కల్పిస్తోన్నట్టు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లోనూ తాము చేపట్టిన ప్రాజెక్టు, మై కార్పొరేటర్ యాప్ వివరాలను ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో పొందుపర్చిన వివరాలను సమాచార చట్టం కింద అధికారికంగానే సేకరిస్తున్నట్టు తెలిపారు. కార్పొరేటర్లు ఎన్ని సమావేశాల్లో పాల్గొన్నారు.

అభివృద్ధే బీజేపీ లక్ష్యం

గుజరాత్‌లో మోదీ పర్యటన

భావనగర్: ప్రచారం కోసం పెద్దఎత్తున డబ్బులు వృథా చేయకుండా గుజరాత్‌లోని తీరప్రాంతంలో బీజేపీ ప్రభుత్వం అనేక అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టిందని ప్రధాని నరేంద్రమోదీ గురువారం చెప్పుకొచ్చారు. రూ.6వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రారంభించిన మోదీ...అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. సౌరాష్ట్ర నర్మద అవతరణ్ ఇరిగేషన్ పథకాన్ని అమలు చేయడం ద్వారా తన విమర్శకులు సైతం మెచ్చుకునేలా నిరూపించానని మోదీ తెలిపారు. ఎలాంటి హడావుడి, హంగామా లేకుండా...ప్రచారం కోసం పెద్దఎత్తున డబ్బులు వృథా కాకుండా అభివృద్ధి ప్రాజెక్టులు అమలు చేశామని తెలిపారు. తమకు సంబంధించినంత వరకు అధికారమనేది ప్రజలకు సేవ చేయడానికేనని నమ్మబలికారు. సౌరాష్ట్ర నర్మద అవతరణ్ ఇరిగేషన్ పథకాన్ని ఎన్నికల కోసమే ప్రకటించారని చాలామంది విమర్శలు చేశారని, కానీ దీనిని సమర్థవంతంగా అమలు చేసి...ఆ ఆరోపణలు తప్పని నిరూపించామని ప్రధాని చెప్పారు. హామీల అమలుకు తాము ఎప్పుడూ కట్టుబడి ఉంటామని గొప్పగా ప్రకటించారు. తాము(బీజేపీ) సమాజం అభ్యున్నతి కోసమే జీవిస్తుందని అన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా సౌరాష్ట్ర నర్మద అవతరణ్ ఇరిగేషన్ పథకాన్ని మోదీ ప్రారంభించారు. నర్మదా నదిపై గల సర్దార్ సరోవర్ డ్యామ్ నుంచి వరదనీటిని కరువు ప్రాంతాలకు మళ్లించడం ద్వారా 115 డ్యామ్‌లు నింపే లక్ష్యంతో ఈ పథకాన్ని చేపట్టారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

సుక్మా: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఏడుగురు మావోయిస్టులు లొంగిపోయినట్లు జిల్లా ఎస్పీ సునీల్ శర్మ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న పురావాస ప్యాకేజీ, జిల్లా పోలీసులు చేపట్టిన ప్రచారం కారణంగా వారు ఆయుధాలను వదలి జనజీవన స్రవంతిలోకి వచ్చినట్టు తెలిపారు. లొంగిపోయిన మడ్కం మాసా, మాండ్వి హిర్మా, మడ్కం భీమా, మడ్కం బండి, మడ్కం నందా, సోడి జోగా, లచ్చిందర్‌లు భేజీ పోలీసు స్టేషన్ పరిధిలో మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించినట్టు పేర్కొన్నారు. వివిధ సంఘటనల్లో వీరి పాత్ర ఉందని చెప్పారు. ఈ మావోయిస్టుల లొంగుబాటు వెనుక సీఆర్‌పీఎఫ్ 219 బెటాలియన్‌కు చెందిన ఇంటిలిజెన్సు విభాగం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రోత్సాహకాలు, ఇతర సౌకర్యాలను కల్పించనున్నట్టు వెల్లడించారు.

మహిళపై సామూహిక అత్యాచారం

బస్తీ : ఉత్తరప్రదేశ్‌లో మహిళపై అత్యాచారానికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు వైద్యులపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే బస్తీ పట్టణంలోని కైలీ ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తున్న ఒక వైద్యుడు సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన లక్నోకు చెందిన మహిళను తన ఆసుపత్రికి ఆహ్వానించారు. ఈ నెల 10 వ తేదీన ఆసుపత్రికి వచ్చిన సదరు మహిళను తాను ఉంటున్న గదికి తీసుకువెళ్లి ఇద్దరు సహచరులతో కలసి అత్యాచారానికి పాల్పడినట్టు పట్టణంలోని సదర్ కొత్వాలి సీఐ అలోక్ ప్రసాద్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆశిశ్ శ్రీవాస్తవ ఆదేశాల మేరకు నిందితులపై సామూహిక అత్యాచారం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ అధ్యక్ష రేసులో లేను

అశోక్ గెహ్లాట్ ప్రకటన
సోనియాగాంధీకి రాజస్థాన్ సీఎం క్షమాపణలు

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష రేసు నుంచి తప్పుకున్నట్లు సీనియర్ నేత, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ గురువారం ప్రకటించారు. ఏఐసీసీ అధినేత్రి సోనియా గాంధీతో భేటీ అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. జైపూర్ పరిణామాలపై ఆమెకు క్షమాపణలు చెప్పానన్నారు. రాష్ట్రంలో రాజకీయ సంక్షోభానికి నైతిక బాధ్యత వహిస్తూ కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకున్నట్లు తెలిపారు. రాజస్థాన్ ముఖ్యమంత్రిగా కొనసాగింపుపై సోనియా గాంధీ నిర్ణయిస్తారని గెహ్లాట్ చెప్పారు. ఢిల్లీలోని 10జనపథ్ నివాసంలో అధినేత్రితో భేటీ అనంతరం విలేకరులతో గెహ్లాట్ మాట్లాడారు. తనకు మద్దతిచ్చే పార్టీ శాసనసభ్యులు వేరుగా సమావేశం కావడం, పార్టీ కేంద్ర పరిశీలకులతో భేటీ కాకపోవడంపై చింతన వ్యక్తం చేస్తూ సోనియాగాంధీకి క్షమాపణలు చెప్పానన్నారు. '50 ఏళ్లుగా కాంగ్రెస్‌కు నిబద్ధతగల సైనికుడిగా ఉన్నాను. ఇందిర, రాజీవ్ గాంధీ, నరసింహా రావు, సోనియాగాంధీ వెంట నడిచాను. కేంద్రమంత్రిగా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేశాను. మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యాను. అవన్నీ నేను మర్చిపోలేను. ఆదివారం జరిగినది మమ్మల్ని కలచివేసింది. నేను సీఎంగా ఉండాలన్న సందేశం వెళ్లడం ఎంతగానో బాధించింది' అని గెహ్లాట్ అన్నారు. తాజా పరిణామాలతో పార్టీ అధ్యక్ష రేసు నుంచి తప్పుకున్నట్లు తెలిపారు.

రాజస్థాన్ ముఖ్యమంత్రిపై ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం

రాజస్థాన్ ముఖ్యమంత్రి పదవిపై కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఒకట్రెండు రోజుల్లో నిర్ణయిస్తారని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఆయన 10 జన్‌పథ్‌లోని సోనియాగాంధీ నివాసంలో రాజస్థాన్ సంక్షోభాన్ని పరిష్కరించే క్రమంలో జరిగిన వరుస భేటీల అనంతరం ఈ మేరకు వెల్లడించారు. కాంగ్రెస్ అధ్యక్ష రేసులో ఎవరెవరు ఉన్నారన్నది నామినేషన్ల ఆఖరి రోజైన శుక్రవారం తేలిపోనున్నట్లు తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్ష బరిలో ఉన్న ఇద్దరు సీనియర్లు దిగ్విజయ్ సింగ్, శశిథరూర్ భేటీ అయ్యారు. తమ మధ్య జరిగేది స్నేహపూర్వక పోటీ మాత్రమేనని ఇద్దరు నేతలు నొక్కిచెప్పారు. ఎన్నికల కోసం నామినేషన్ పత్రాలను సేకరించిన అనంతరం దిగ్విజయ్ సింగ్ గురువారం తిరువనంతపురంలో శశిథరూర్‌ను కలిశారు. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా థరూర్ తెలిపారు. 'ఈ మధ్యాహ్నం దిగ్విజయ్ సింగ్ వచ్చి కలిశారు. ఆయన అభ్యర్థిత్వాన్ని స్వాగతిస్తున్నా. మేమిద్దరం ప్రత్యర్థులం కాదు.. మా మధ్య జరిగేది స్నేహపూర్వక పోటీ మాత్రమే.. అంతిమంగా పార్టీ గెలుపే మేము కాంక్షించేది' అని థరూర్ ట్వీట్ చేశారు. కాగా, దిగ్విజయ్, థరూర్ ఇద్దరూ శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. 30వ తేదీతో నామినేషన్ల గడువు ముగుస్తుంది. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికలు అక్టోబరు 17న జరగనున్నాయి. ఫలితాలు అక్టోబరు 19న వెలువడతాయి.

పీఎఫ్ఐపై కేరళ నిషేధం

సత్వర చర్యలకు డీఎంలు, పోలీసులకు ప్రభుత్వ ఆదేశాలు
మంగళూరులో 12 కార్యాలయాలకు తాళం

న్యూఢిల్లీ: ఉగ్రవాద, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆరోపణల నేపథ్యంలో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) నాయకులు, సిబ్బంది ఇళ్లు, కార్యాలయాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలోనే కేంద్రప్రభుత్వం ఈ సంస్థపై నిషేధం విధించింది. తాజాగా కేరళ ప్రభుత్వం కూడా పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)పై నిషేధం విధిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తమ ఆదేశాలు సత్వరమే అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగానికి, పోలీసులకు ఆదేశాలతో పాటు ఆ మేరకు అధికారాలనూ ఇచ్చింది. యూఏపీఏ చట్టం కింద ఈ సంస్థ, అనుబంధ కూటములు, సంఘాలపై నిషేధాన్ని కేరళ ప్రభుత్వం విధించింది. యూఏపీఏలోని సెక్షన్ 7 కింద తమ పరిధిలో చర్యలు చేపట్టేలా జిల్లా మెజిస్ట్రేట్లు, పోలీసు సూపరింటెండెంట్లకు సూచనలు చేసింది. మరోవైపు కర్ణాటకలోని మంగళూరులో ఆ నగర పోలీసులు 12 పీఎఫ్ఐ కార్యాలయాలకు సీల్ వేశారు. బుధవారం సాయంత్రం నుంచి పీఎఫ్ఐకి చెందిన 10 ఆఫీసులు, క్యాంపస్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (సీఎఫ్ఐ) కార్యాలయానికి, పీఎఫ్ఐ సమాచార, సాధికారత కార్యాలయానికి తాళం వేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. కసాబా బెంగ్రే, చోక్కాబెట్టు, కటిపల్ల, అదూర్, కిన్నిపదావ్, కేసీ రోడ్, ఇనోలి, మల్లూర్, నల్లికాయి రోడ్డు, కుద్రోలిలోని పీఎఫ్ఐ కార్యాలయాలతో పాటు బందర్, అజిజుద్దీన్ రోడ్డులోని సీఎఫ్ఐ కార్యాలయానికి,రావు & రావు సర్కిల్ వద్దనున్న సమాచార, సాధికారత కార్యాలయానికి సీల్ వేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. కాగా, ఈనెల 23న కేరళ వ్యాప్తంగా హర్తాళ్‌ను పీఎఫ్ఐ నిర్వహించగా అది హింసాత్మకంగా పరిణమించింది. దేశవ్యాప్తంగా తమ సంస్థ కార్యాలయాలపై దాడులు, 100 మందికిపైగా నాయకుల అరెస్టును పీఎఫ్ఐ నిరసించిన విషయం విదితమే.

కశ్మీర్‌లో వరుస పేలుళ్లు... రెండు బస్సుల ధ్వంసం

జమ్ము: జమ్ముకశ్మీర్‌లోని ఉదంపూర్‌లో వరుస పేలుళ్లు కలకలం సృష్టిస్తున్నాయి. ఎనిమిది గంటల వ్యవధిలో రెండు పేలుళ్లు జరగడం ఆందోళన రేపుతోంది. తొలుత బుధవారం రాత్రి ఓ పెట్రోల్ బంక్ దగ్గర ఆగి ఉన్న ఓ బస్సులో పేలుడు సంభవించింది. రాత్రి 10.30 గంటలకు జరిగిన ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వీరిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పేలుడుకు సంబంధించిన దృశ్యాలు పెట్రోల్‌బంక్‌లోని సీసీటీవీలో నిక్షిప్తమయ్యాయి. బంకులో పెట్రోల్ కొట్టించుకునేందుకు బస్సు అక్కడికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన జరిగిన కొద్ది గంటలకే ఉదంపూర్‌లోనే మరో బస్సులో పేలుడు సంభవించింది. ఉదయం ఆరు గంటల సమయంలో బస్టాండ్‌లో ఆగి ఉన్న ఓ బస్సులో పేలుడు జరిగింది. ఉదంపూర్ నుంచి రామ్‌నగర్‌కు ఈ బస్సు వెళ్లాల్సి ఉండగా.. ఒక్కసారిగా పేలుడు సంభవించింది. అయితే, బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇది ప్రమాదం కాదని, పేలుళ్లే అని పోలీసులు నిర్ధరించారు. ఎటువంటి పేలుడు పదార్థాలను ఉపయోగించారనే విషయం తెలియాల్సి ఉందని డీఐజీ సులేమాన్ చౌదరి పేర్కొన్నారు. అయితే, వరుస పేలుళ్ల నేపథ్యంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులతో పాటు అధికార యంత్రాంగం ఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నాయి. ఘటన ఎలా జరిగిందని ఆరా తీస్తున్నాయి.

పేలుళ్లకు వ్యతిరేకంగా నిరసనలు

బస్సుల్లో బాంబు పేలుళ్లకు వ్యతిరేకంగా జమ్ము, ఉదంపూర్‌లో పాక్ వ్యతిరేక నిరసనలు వెల్లువెత్తాయి. ఉదంపూర్‌లో జాతీయ రహదారి, ఇతర రహదారులను నిరసనకారులు దిగ్బంధించారు. ఉదంపూర్ పట్టణంలోని మూడు చోట్ల స్థానికులు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. పాకిస్తాన్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి, పాక్ వ్యతిరేక నినాదాలు చేశారు. భయాందోళనలను సృష్టించేందుకు ఉగ్రవాదులు పన్నిన కుట్రలను తిప్పికొట్టడానికి, పట్టణంతో పాటు చుట్టుపక్కల భద్రతను పెంచాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం నవరాత్రి ఉత్సవాలు జరుగుతుండటం, అక్టోబర్ 4 న కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో భద్రతను అందించడంలో భద్రతా సంస్థలు విఫలమయ్యాయని వారు విరుచుకుపడ్డారు. జమ్ము నగరంలో, శివసేన, బజరంగ్ దళ్, డోగ్రా ఫ్రంట్ పాకిస్తాన్ వ్యతిరేక నిరసనలు నిర్వహించాయి. పేలుళ్లకు పాల్పడ్డ వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పిలుపునిచ్చాయి. జమ్ముశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (జేకేపీసీసీ) అధ్యక్షుడు జీఏ మిర్ పేలుళ్లను తీవ్రంగా ఖండించారు. ఇది దిగ్భ్రాంతికరం... అత్యంత సిగ్గుచేటైన విషయమని పేర్కొన్నారు.

అంకిత హత్య కేసు పర్యవేక్షణకు కమిటీ

ఉత్తరాఖండ్ మహిళా కమిషన్

డెహ్రాడూన్ : దేశ వ్యాప్తంగా సంచలనం కలిగించిన రిసార్టు రిసెప్షనిస్టు అంకితా భండారీ హత్య కేసు దర్యాప్తు పర్యవేక్షణ కోసం ఉత్తరాఖండ్ మహిళా కమిషన్ ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు కమిషన్ చైర్మన్ కుసుమ కంద్వాల్ ఒక ప్రకటన చేశారు. అంకితా బండారి హత్య చాలా సున్నితమైందని పేర్కొన్నారు. కేసు విషయంలో తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరముందని చెప్పారు. ఈ క్రమంలో ఇప్పటికే కేసు విషయంలో కొనసాగుతున్న దర్యాప్తును నిశితంగా పరిశీలించడానికి మహిళా కమిషన్ వైపు నుంచి ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పౌరీ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ యమకేశ్వర్, ఎస్ఐ లక్ష్మణ్ జూలా లతో కూడిన కమిటీ ఆ కేసు దర్యాప్తును పరిశీలించి వివరాలను మహిళా కమిషన్‌కు నివేదిస్తుందని పేర్కొన్నారు. రిషికేశ్ సమీపంలోని బీజేపీ కీలక నేత వినోద్ ఆర్య కుమారుడు పుల్‌కిత్ ఆర్య నిర్వహిస్తున్న రిసార్టులో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తున్న భండారీని వ్యభిచారం చేయమని ఒత్తిడి చేయడం, ఆమె నిరాకరించడంతో కాలువలోకి తోసి హత్య చేసిన విషయం తెలిసిందే.

కారులో ఆరు ఎయిర్‌బ్యాగ్‌ల ప్రతిపాదన ఏడాది వాయిదా

న్యూఢిల్లీ: ప్యాసింజర్ కార్లలో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను తప్పనిసరి చేయాలన్న ప్రతిపాదన అమలును ప్రభుత్వం ఏడాదిపాటు వాయిదా వేసినట్టు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం తెలిపారు. అక్టోబరు 1, 2022 నుండి ప్రయాణికుల మెరుగైన భద్రత కోసం ఎనిమిది సీట్ల వాహనాల్లో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను తప్పనిసరి చేయాలని ప్రభుత్వం ముందుగా ప్రణాళిక రచించింది. ప్రస్తుతం ఆటోమొబైల్ రంగం ఎదుర్కొంటున్న కొన్ని సమస్యల కారణంగా ఈ నిర్ణయాన్ని వాయిదా వేయాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. మోటారు వాహనాల్లో ప్రయాణించే వారి భద్రత నిమిత్తం వేరియంట్‌లతో సంబంధం లేకుండా భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్టు గడ్కరీ వివరించారు.

మాదకద్రవ్యాల స్థావరాలపై సీబీఐ దాడులు

175మంది అరెస్టు, 127 కేసుల నమోదు

న్యూఢిల్లీ: ఎన్‌సీబీ, ఇంటర్‌పోల్, బహుళ రాష్ట్రాల్లోని పోలీసులతో సమన్వయంతో నార్కోటిక్స్ నెట్‌వర్క్‌లపై సీబీఐ దేశవ్యాప్తంగా దాడులు చేసి, 175 మంది డ్రగ్స్ పెడ్లర్లను అరెస్టు చేసినట్లు అధికారులు గురువారం తెలిపారు. అంతర్జాతీయ సంబంధాలతో మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌లకు అంతరాయం కలిగించడం, విచ్ఛిన్నం చేయడం కోసం ఈ వారం ప్రారంభంలో 'ఆపరేషన్ గరుడ' మొదలుపెట్టారు. దీని సహాయంతోనే 127 ఎఫ్ఐఆర్‌లు దాఖలు అయ్యాయని సీబీఐ ఓ ప్రకటనలో తెలిపింది. పంజాబ్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, మహారాష్ట్ర నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ)తో సహా ఎనిమిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పోలీసులు ఈ ఆపరేషన్‌లో సుమారు 6,600మంది అనుమానితులను పట్టుకున్నారు. అనంతరం 127 కేసులు నమోదు చేయగా, ఆరుగురు పరారీలో ఉన్నారు. వారితో కలుపుకుని మొత్తంగా 175మందిని గుర్తించారు. హిందూ మహాసముద్ర ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి, నిషేధిత డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాల స్మగ్లింగ్‌ను ఏజెన్సీలు లక్ష్యంగా చేసుకున్నాయని సీబీఐ తెలిపింది. 5.125 కిలోల హెరాయిన్‌తో సహా అక్రమ మందులు, సైకోట్రోపిక్ పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ ప్రతినిధి పేర్కొన్నారు.

పీటీఐ వైస్‌చైర్మన్‌గా శాంత్‌కుమార్ డైరెక్టర్‌గా ఆదిమూలం

న్యూఢిల్లీ: ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ వార్షిక సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో శాంత్ కుమార్ వైస్ చైర్మన్‌గా తిరిగి ఎన్నికయ్యారు. ఎల్ ఆదిమూలం డైరెక్టర్‌గా నియమితులయ్యారు. శాంత్ కుమార్, ది ప్రింటర్స్ (మైసూర్) ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన శాంత్ కుమార్ రెండో ఏడాది కాలానికి వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ప్రింటర్స్ మైసూర్ డెక్కన్ హెరాల్డ్, ప్రజావాణి, సుధ, మయూర వార్తాపత్రికలను బెంగళూరులోని ప్రధాన కార్యాలయం నుంచి ప్రచురిస్తుంది. 2021లో రెండేళ్ల పదవీ కాలానికి ఎన్నికైన చైర్మన్ అవేక్ సర్కార్ 16 మంది డైరెక్టర్ల బోర్డుకు నేతృత్వం వహిస్తారు. బోర్డులోని ఇతర డైరెక్టర్లలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ప్రచురణకర్తలు అలాగే ప్రముఖ, స్వతంత్ర వ్యక్తులు ఉన్నారు. ఆదిమూలం దినమలర్ దినపత్రిక కోయంబత్తూర్ ఎడిషన్ ప్రచురణకర్త, దాని వ్యాపార, సాంకేతిక అధిపతి కూడా. తిరుచ్చిలోని ప్రతిష్ఠాత్మక రీజినల్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అయిన ఆదిమూల, 37 సంవత్సరాలుగా టెక్నికల్, మార్కెటింగ్ రంగాలను నిర్వహిస్తూ దినమలర్ సీనియర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఉన్నారు. ఇక శాంతకుమార్ మైసూర్ ప్రింటర్స్ యాజమాన్యంలో 1983 నుంచి భాగమై ఉన్నారు. ఆడిట్ బ్యూరో సర్క్యులేషన్‌కు ఆయన చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఐఎన్ఎస్‌లో ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా 20 ఏళ్ల నుంచి ఉండగా, ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాక మాజీ చైర్మన్‌గా కూడా వ్యవహరించారు.

శ్రీనగర్‌లో ఉగ్రవాది అరెస్ట్

శ్రీనగర్: అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్ (ఏజీహెచ్)కి చెందిన ఉగ్రవాదిని గురువారం స్థానిక పాల్పోరా ప్రాంతం నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రితో అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు, సైన్యం శ్రీనగర్‌లోని పాల్పోరా ప్రాంతంలో ప్రత్యేక చెక్‌పోస్టు లను ఏర్పాటు చేసినట్లు పోలీసు అధికార ప్రతినిధి తెలిపారు. 'పోలీసులు, ఆర్మీని చూసిన ఒక అనుమానితుడు పాల్పోరా వంతెన సమీపంలోని వరి పొలాల వైపు తప్పించుకోవడానికి ప్రయత్నించాడు, కానీ అతను వ్యూహాత్మకంగా పట్టుబడ్డాడు," అని ప్రతినిధి చెప్పారు. గుర్తు తెలియని ఆ వ్యక్తి తన పేరు జునైద్ అహ్మద్ పారారేఅని, బారిపోరా నవకదల్ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పేర్కొన్నారు. తుపాకీ, పత్రికలు, తుపాకీ గుండ్లు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు వివరించారు.

కుక్కల బెడద నివారణకు కేఎస్‌యూఎం 'ఐడియాథాన్'

తిరువనంతపురం: కేరళ, అనేక ఇతర రాష్ట్రాల్లో వీధి కుక్కల బెడద ప్రధానంగా మారడంతో, కేరళ స్టార్టప్ మిషన్ (కేఎస్‌యూఎం) స్టార్టప్‌లు, వ్యక్తుల నుంచి కొత్త ఆలోచనలను పరిష్కరించడానికి 'ఐడియాథాన్'ని ఏర్పాటు చేసింది. 'ఐడియాథాన్' ద్వారా, కేఎస్‌యూఎం వాక్సినేషన్, స్పేయింగ్, ఇతర కుక్కల పెంపకం నియంత్రణ చర్యలతో సహా సమస్యను పరిష్కరించడానికి సమర్థవంతమైన చర్యలను చేపట్టడానికి ప్రభుత్వ, పౌర సంస్థల నుంచి స్థిరమైన ఆలోచనలున్న ప్రాజెక్టులను పరిశీలిస్తోంది. స్టార్టప్‌లు అవగాహన పెంచడం, పారిశుధ్యం, వీధి కుక్కలను గుర్తించే పద్ధతులు, కుక్కలను పట్టుకోవడానికి శిక్షణ, వీధుల నుంచి పట్టుకున్న కుక్కలను ఉంచడానికి షెల్టర్‌లను తయారు చేయడం, వీధికుక్కల దత్తత, పునరావాసం కోసం ఆలోచనలు, పరిష్కారాలను సూచించనున్నట్లు కేఎస్‌యూఎం అధికారిక ప్రకటనలో తెలిపింది. ఉత్తమ ఆలోచనలు, పరిష్కారాలను అమలు చేసేందుకు కేఎస్‌యూఎం ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని కూడా అందించనున్నది. ఈ సందర్భంగా కేఎస్‌యూఎం సీఈఓ అనూప్ అంబికా మాట్లాడుతూ సామాజిక సంబంధిత ఆలోచనలు కలిగిన స్టార్టప్‌లను ప్రోత్సహించడం కేఎస్‌యూఎం ప్రారంభమైనప్పటి నుంచి తన లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

రెండోసారి ఉత్తరాఖండ్‌కే 'సీడీఎస్'

డెహ్రాడూన్: లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) అనిల్ చౌహాన్‌ను కేంద్రప్రభుత్వం భారత సాయుధ దళాల ప్రధానాధికారి (సీడీఎస్)గా నియమించింది. రెండో సారి కూడా ఉత్తరాఖండ్‌కు చెందిన వ్యక్తికే ఈ గౌరవం దక్కడం విశేషం. జనరల్ చౌహాన్ ఉత్తరాఖండ్‌లోని పౌరి జిల్లాకు చెందినవారు. గతేడాది డిసెంబర్‌లో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన మొట్టమొదటి సీడీఎస్ జనరల్ రావత్ కూడా ఇదే జిల్లాకు చెందిన వ్యక్తి. లెఫ్టినెంట్ జనరల్ చౌహాన్ రెండవ సీడీఎస్‌గా నియమితులైనందుకు ఉత్తరాఖండ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) గుర్మీత్ సింగ్ ఆయనకు అభినందనలు తెలిపారు. సైన్యంలో పనిచేసేటప్పుడు చౌహాన్ తనతో పాటు అనేక కార్యాచరణ సవాళ్లను ఎలా ఎదుర్కొన్నదీ, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలలో ఎలా పాల్గొన్నారో గుర్తు చేసుకున్నారు. చౌహాన్‌ను అత్యంత సమర్థ అధికారిగా అభివర్ణించారు. తన సామర్థ్యం, అనుభవం, వ్యూహాత్మక దూరదృష్టితో తన కొత్త బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గుర్మీత్‌సింగ్ కశ్మీర్‌లో భారత సైన్యానికి కార్ప్స్ కమాండర్‌గా ఉండగా, లెఫ్టినెంట్ జనరల్ చౌహాన్ బారాముల్లాలో జీఓసీగా పనిచేస్తున్నారు. వారు సైనికదుస్తుల్లో కలిసి నడిచిన ఆనాటి ఫొటోను కూడా గవర్నర్ మీడియాకు చూపించారు. సీడీఎస్‌గా నియమితులైన లెఫ్టినెంట్ జనరల్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి అభినందించారు. ఇది ఉత్తరాఖండ్ మొత్తానికి గర్వకారణమని అన్నారు. 'మీ సమర్థ నాయకత్వంలో భారత సైన్యం జాతీయ భద్రత విషయంలో ఎప్పటిలాగే కొత్త రికార్డులను నెలకొల్పుతుందని మేము విశ్వసిస్తున్నాము' అని ధామి అన్నారు.

పల్లెవాసుల నీరాజనం

- దెందులూరులో కోలాహలంగా మహా పాదయాత్ర
- రైతులకు అన్ని వర్గాల సంఘీభావం
- హోరెత్తిన 'జై అమరావతి'

విశాలాంధ్ర-ఏలూరు: అన్నదాతలకు అపూర్వ స్వాగతం చెబుతూ దెందులూరు నియోజకవర్గంలో మహా పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ అమరావతి నుంచి అరసవల్లికి రైతులు తలపెట్టిన మహాపాదయాత్ర 18వ రోజు కోలాహలంగా సాగింది. గురువారం కొవ్వలిలో ప్రారంభమైన పాదయాత్ర దెందులూరు, శ్రీరామవరం వరకు సాగి భోజన విరామం అనంతరం మేదినరావుపాలెం, రామారావు గూడెం, చల్ల చింతలపూడి మీదుగా కొనసాగింది. పెరుగు గూడెంలో సాయంత్రం 6 గంటలకి పాదయాత్ర ముగిసింది. పాదయాత్ర సందర్భంగా రైతులకు ఎక్కడికక్కడ స్థానికులు ఘనస్వాగతం పలికారు. హారతులు పడుతూ పూల వర్షం కురిపించారు. పాదయాత్రలో పాల్గొన్న రైతులకు పల్లెల్లో మజ్జిగ, తాగునీరు స్వచ్ఛందంగా అందిస్తూ సంఘీభావం తెలిపారు. గ్రామాలలో అమరావతి నినాదాలతో హోరెత్తించారు. పాదయాత్ర సాగిన ప్రతి కూడలిలో రైతులు జన నీరాజనాలు అందుకున్నారు. రైతుల శాంతియుత పోరాటానికి మద్దతుగా రహదారికి ఇరువైపులా గ్రామస్తులు చేరి రైతులపై పూలు చల్లారు. పాలకుల వైఖరిపై మండిపడిన స్థానికులు ఏకైక రాజధానిగా అమరావతే కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

అభివృద్ధి నిర్వీర్యం: సీపీఐ

18వ రోజు పాదయాత్రలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పుప్పాల కన్నబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి మూడు రాజధానుల ముక్కలాటలో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాల మాటున అభివృద్ధిని నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. కోర్టులతో అనేకసార్లు మొట్టికాయలు వేయించుకున్న జగన్ లాంటి ముఖ్యమంత్రి... దేశంలో ఎక్కడా లేరన్నారు. కుల, ప్రాంతీయ, మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల దృష్టిని మళ్లించే యత్నం చేస్తున్నారన్నారు. సీపీఐ మొదటినుంచీ అమరావతే రాజధానిగా ఉండాలని చెబుతోందన్నారు. న్యాయం స్థానం టు దేవస్థానం పాదయాత్రలో కూడా పాల్గొందని తెలిపారు. ఏలూరు జిల్లాలో సీపీఐ శ్రేణులు మహాపాదయాత్రలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఇకనైనా తన తప్పుని గ్రహించి అమరావతిని రాజధానిగా కొనసాగిస్తూ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీరామవరంలో స్వల్ప ఉద్రిక్తత

రైతుల మహా పాదయాత్రలో టీడీపీ ప్రత్యక్షంగా పాల్గొంది. దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తన అనుచరులతో పాదయాత్రలో పాల్గొన్నారు. పాదయాత్ర శ్రీరామవరం చేరుకొన్న సమయంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తలు పోటాపోటీ నినాదాల మధ్య కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. శ్రీరామవరం సర్పంచ్ కామిరెడ్డి ఇంటి వద్ద జై అమరావతి, జై ప్రభాకర్ అంటూ టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేయగా... మూడు రాజధానులే ముద్దు, జై జగన్ అంటూ వైసీపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. దాదాపు పావుగంట పాటు నినాదాలు కొనసాగాయి. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పి శాంతింపజేశారు. చివరకు టీడీపీ కార్యకర్తలు పాదయాత్రలో కలిసి ముందుకు సాగడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం సాయంత్రం 6 గంటలకు పెరుగు గూడెం వద్ద పాదయాత్ర ముగిసింది. మాజీ ఎంపీ మాగంటి బాబు, ఎన్ఆర్ఐ భానుప్రకాష్, టీడీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి పాల్గొన్నారు.

బీజేపీ వ్యతిరేకత అవసరం

కేసీఆర్ జాతీయ పార్టీపై నారాయణ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) అధ్యక్షుడు కేసీఆర్ దసరా నాటికి కొత్తగా పెడుతున్న జాతీయ పార్టీ బీజేపీ వ్యతిరేక కూటమిని బలపరిచేలా ఉండాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ సూచించారు. మతోన్మాదాన్ని ప్రేరేపిస్తూ, కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెట్టడం, సమాఖ్య వ్యవస్థను, రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి బలమైన కూటమి అవసరమని నారాయణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తరుణంలో బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చాలామంది ముఖ్య మంత్రులు, కాంగ్రెస్‌తో సహా అన్ని జాతీయ పార్టీలు ముందుకు వస్తున్నాయని, ఇందుకు కేసీఆర్ కూడా ముందుకు రావడం సమర్థనీయమని అభిప్రాయపడ్డారు. బీజేపీ వ్యతిరేక కూటమి బలపడేలా కేసీఆర్ జాతీయ పార్టీ అడుగులు వేస్తే మంచిదని నారాయణ వ్యాఖ్యానించారు.

రాజ్యాంగ విలువల పరిరక్షణలో కళాకారులు కీలక భూమిక పోషించాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య

విశాలాంధ్ర-విజయవాడ: రాజ్యాంగ విలువల పరిరక్షణలో కళాకారులు కీలక భూమిక పోషించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ మహాసభల నేపథ్యంలో గురువారం విజయవాడ బెంజ్‌సర్కిల్‌లో ఏపీ ప్రజానాట్యమండలి కళాకారులు చేపట్టిన ప్రచార కార్యక్రమాన్ని ఈశ్వరయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ పాలన దారుణంగా ఉందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో నగరంలో నిర్వహించనున్న సీపీఐ జాతీయ 24వ మహాసభలకు ప్రత్యేకత ఉందని పేర్కొన్నారు. దేశ రాజకీయాలను మార్చే దిశగా సీపీఐ జాతీయ మహాసభలు దోహదపడతాయని చెప్పారు. ఈ మహాసభలకు అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో పాటు వివిధ దేశాలకు చెందిన కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. అక్టోబర్ 14 నుంచి 18 వరకు విజయవాడ నగరాన్ని ఎరుపెక్కించాలని కోరారు. సభల విజయవంతానికి విరివిగా విరాళాలిచ్చి సహకరించాలని ప్రజలను అభ్యర్థించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ సీపీఐ జాతీయ మహాసభలు విజయవంతం కోసం చేపట్టిన ఈ ప్రచార కార్యక్రమం అక్టోబర్ 14 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. కళా రూపాల ప్రదర్శ నతో మహాసభల ఆవశ్యకతను ప్రజలకు వివరించనున్నట్టు చెప్పారు. ప్రజలంతా తమకు తోచిన రీతిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కోశాధికారి ఆర్.పిచ్చయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ కే నజీర్, నేతలు లంక దుర్గారావు, నగర కార్యదర్శి దోనేపూడి సూరిబాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. శివారెడ్డి, ఎం. సాయికుమార్, మహంకాళి సుబ్బారావు, పోతురాజు నాగేశ్వరరావు, వెంకట్ రాముడు, దప్పుసూరి, ఎస్ రంగారావు, తదితరులు పాల్గొన్నారు

అంకబాబుకు పరామర్శ

పత్రికా రంగంలో అంకబాబు అందరికీ సుపరిచితులని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. గురువారం ఏఐఎస్ఎఫ్ నేతలతో కలసి అంకబాబు నివాసానికి వెళ్లిన ఈశ్వరయ్య ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ ఒక వాట్సాప్ పోస్టును ప్రచారం చేసిన ఆరోపణలతో అంకబాబుపై అక్రమ కేసు పెట్టడాన్ని తప్పుబట్టారు. కోర్టు ఆయనకు బెయిల్ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. అంకబాబుకు సీపీఐ తరుపున సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే.శివారెడ్డి, కోశాధికారి ఎం.సాయికుమార్ ఉన్నారు.

విప్లవాత్మకంగా కేరళ

నూతన పారిశ్రామిక విధానం

తిరువనంతపురం: కేరళలోని వామపక్ష ప్రభుత్వం పారిశ్రామిక విధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తయారు చేసిన నూతన పారిశ్రామిక విధానానికి సంబంధించిన ముసాయిదాను ఆవిష్కరించారు. ఈ విషయంపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి పి రాజీవ్ విలేకరులతో మాట్లాడుతూ...రాష్ట్రం భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువతకు ఉద్యోగాలు. పరిశ్రమల ఏర్పాటు, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి, స్థిరమైన పెట్టుబడులు తదితర కీలకమైన అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతూ నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించాలని భావిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన ముసాయిదాను తయారు చేసినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వనరులను వెలికి తీయడం, పెట్టుబడులకు అవకాశం ఉన్న రంగాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఇందుకోసం శక్తి మేరకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించడంతో ఉపాధి కల్పనాపై దృష్టి సారించనున్నట్టు తెలిపారు. నైపుణ్యాల అభివృద్ధి చేసుకుంటూ పెట్టుబడులకు ప్రోత్సాహకాలను అందించనున్నట్టు పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అంతరిక్షం, ఆయుర్వేదం, బయోటెక్నాలజీ, డిజైనింగ్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఫుడ్ టెక్నాలజీ తదితర రంగాలను అభివృద్ధి చేయనున్నట్టు పేర్కొన్నారు. అత్యాధునిక వ్యవసాయం, రబ్బరు ఉత్పత్తులు, వైద్య పరికరాలు, నానో టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధనం, రోబోటిక్స్, టూరిజం తదితర రంగాలకూ ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తరపున ఇవ్వనున్న ప్రోత్సాహకాలను కూడా ముసాయిదాలో పేర్కొన్నట్టు చెప్పారు. ఈ ముసాయిదాను 10 రోజుల్లో విడుదల చేస్తామని తెలిపారు.

ప్రజా ఉద్యమాలకు అండ

జనసేవాదళ్‌కు ముప్పాళ్ల విజ్ఞప్తి

విశాలాంధ్ర-శ్రీకాకుళం: సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై పోరాడాలని జనసేవాదళ్‌కు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై జరిగే ప్రజా ఉద్యమాల రక్షణ కోసం పని చేయాలని సూచించారు. విజయవాడలో అక్టోబర్ 14 నుంచి 18 వరకు నిర్వహించనున్న సీపీఐ జాతీయ మహాసభల్లో పాల్గొనే జనసేవాదళ్ సభ్యులకు రెండు రోజుల శిక్షణా తరగతులను గురువారం ముప్పాళ్ల ప్రారంభించారు. స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతిభవన్‌లో జరిగిన సమావేశానికి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.మురళి అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ జనసేవాదళ్ సభ్యులు ప్రజలకు రక్షకులుగా పనిచేయాలని కోరారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న సీపీఐలో జనసేవాదళ్ సభ్యులుగా పనిచేస్తున్నట్లు చెప్పుకోవడం గర్వంగా ఉంటుందన్నారు. ఈ శిక్షణతో శారీరక దారుఢ్యం పెరగడంతోపాటు సమాజానికి సేవ చేసే అవకాశం లభిస్తుందన్నారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై జరిగే ఉద్యమాల్లో ఎటువంటి ఉద్రిక్తత లేకుండా ముందుండి నడిపించాలని ఆయన కోరారు. స్వార్థపరులు ఘర్షణ సృష్టించడం ద్వారా ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కుట్ర చేస్తున్నారని, వీటిని తిప్పికొట్టాలని ముప్పాళ్ల చెప్పారు. మైనార్టీలపైనా, మహిళలపైనా దాడులు పెరుగుతున్నాయని, బాధితులకు జనసేవాదళ్ అండగా నిలవాలని సూచించారు. దివిసీమ ఉప్పెన సమయంలో జనసేవాదళ్ చేసిన సేవను సోదాహరణగా వివరించారు. సీపీఐ అంటే క్రమశిక్షణకు మారుపేరని, జనసేవాదళ్ సభ్యులు సైతం క్రమశిక్షణతో మెలగాలని ఉద్బోధించారు. జాతీయ మహాసభల కవాతులో జనసేవాదళ్ సభ్యులు పాల్గొనాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యవర్గసభ్యులు సనపల నర్సింహులు, చాపర వెంకట రమణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జనసేవాదళ్ శిక్షకుడు జి.ఫణీంద్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి, జనసేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ కేసులతో...

ప్రశ్నించే గొంతుకల్ని అణచలేరు: చలసాని

విశాలాంధ్ర-బ్యూరో కర్నూలు: ప్రశ్నించే గొంతుకల్ని అణచివేతకు బీజేపీ నేతలు కుట్రలకు పాల్పడుతున్నారని ఆంధ్ర మేధావుల ఫోరం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ ధ్వజమెత్తారు. కర్నూలుకు చెందిన బీజేపీ నేత సోమిశెట్టి వెంట్రామయ్య చేసిన ఫిర్యాదుకు సంబంధించి గురువారం ఓయూ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్‌లో కలసి కర్నూలు నగరంలోని టూ టౌన్ సీఐ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఒక టీవీ చర్చలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అన్యాయంపై ప్రశ్నిస్తే భరించలేని బీజేపీ నేతలు తమపై అక్రమ కేసులు పెట్టి బెదిరించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి కేసులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తోంటే చూస్తూ మిన్నకున్న ఏపీ బీజేపీ నేతల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరడం, ప్రశ్నించడం తప్పెలా అవుతుందో చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం భారతదేశానికి అన్ని విధాల అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. దేశ సంపదలను గుజరాత్ కార్పొరేట్ శక్తులకు బీజేపీ ప్రభుత్వం దోచి పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణకు హాజరైన చలసాని, గాలి వినోద్‌కుమర్ లకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, రాధాకృష్ణ, కేవీ నారాయణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు గౌడ్, సహాయ కార్యదర్శి రంగస్వామి, నగర అధ్యక్షులు శరత్ కుమార్, పీడీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ తదితరులు మద్దతుగా నిలిచారు.

చలసాని శ్రీనివాస్‌పై అక్రమ కేసులు దుర్మార్గం

సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, శ్రీనివాసరావు ఖండన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీజేపీ ఒత్తిడికి లొంగి ఆంధ్రా మేధావుల ఫోరం అధ్యక్షులు చలసాని శ్రీనివాస్‌పై కర్నూలులో అక్రమ కేసు బనాయించడాన్ని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు. ప్రజాతంత్ర వాదులంతా బీజేపీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలను, కుట్రలను ఖండించాలన్నారు. కులాన్ని, మతాన్ని రెచ్చగొడుతున్నారంటూ చలసాని శ్రీనివాస్‌పై అక్రమ కేసు బనాయించడం దుర్మార్గమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పదేపదే ద్రోహం చేస్తోందనే విషయాన్ని ఎత్తిచూపారన్న అక్కసుతో ఆయనపై బీజేపీ కేసులు మోపిందన్నారు. ఈ వైఖరి సరైందికాదనీ, చలసాని శ్రీనివాస్ ఏనాడూ ఒక మతాన్నిగానీ, కులాన్నిగానీ రెచ్చగొట్టలేదన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని, బీజేపీ మతోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టే వారిని అణచి వేసేందుకు బ్లాక్‌మెయిలింగ్ కుట్రలకు పాల్పడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు వాస్తవాలు విచారించకుండా కేసులు పెట్టి, వేధించడం దుర్మార్గమన్నారు. నిరంతరం సమాజ శ్రేయస్సు కోసం తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ, ఆంధ్రా మేధావుల ఫోరం అధ్యక్షులుగా, ఏపీ ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల సాధన సమితి అధ్యక్షులుగా సమాజంలో బాధ్యతాయుత స్థానంలో ఉన్న చలసాని శ్రీనివాస్‌పై పెట్టిన అక్రమ కేసులు తక్షణమే ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు.

అరెస్టు తగదు: శైలజానాథ్

చలసాని శ్రీనివాస్ అరెస్టును రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు సాకే శైలజానాథ్ ఖండించారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో జగన్ ప్రజాస్వామ్య పాలనకు పాతరేస్తున్నారన్నారు. నిరంకుశ, నియంతృత్వ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. మోదీ ఆదేశాలతో ప్రజలపై జగన్ భారాలు మోపుతున్నారని, ప్రతిపక్ష, ప్రజా సంఘాల నాయకులపై కూడా కేసులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. మోదీ అంటే జగన్‌కు భయమెందుకని ప్రశ్నించారు. మీ తప్పులను ప్రశ్నించకుండా బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారా? అని నిలదీశారు. విచారణ లేకుండా పోలీసులు కేసులు పెట్టడం రాష్ట్రంలో ఒక ఫ్యాషన్‌గా మారిందని, భవిష్యత్తులో జరిగే పరిణామాలకు పోలీసులే బాధ్యత వహించాలన్నారు. అరాచక పాలనతో దేశ, రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని విమర్శించారు.

ఉగ్రవాదంపై పోరులో

భారత్ పాత్ర కీలకం: ముర్ము

న్యూఢిల్లీ: ఉగ్రవాదంపై ముందుండి పోరాడే దేశాల్లో భారత్ ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెప్పారు. అనేక రంగాల్లో భారత్ సాధించిన విజయాలను సవాల్ చేసే పరిస్థితి లేదని అన్నారు. ఆమె గురువారం ఐఎఫ్ఎస్ 2021 బ్యాచ్ గ్రూప్ ఆఫ్ ఆఫీస్ ట్రైనీలతో రాష్ట్రపతిభవన్‌లో మాట్లాడారు. భారతదేశం బలమైన స్థానం దాని ఆర్థిక పనితీరు, ఇతర అంశాల ఆధారితమని తెలిపారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలు ఇప్పటికీ మహమ్మారి ప్రభావాలను అధిగమించలేకపోగా మన దేశం నిలదొక్కుకోవడమే కాకుండా ఆత్మవిశ్వాసాన్ని నింపుకొని ముందుకు సాగుతోందని, దీంతో అత్యంత వేగవంతమైన వృద్ధి రేటును నమోదు చేయగలిగిందని అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ కొంతవరకు భారత్‌పైనే ఆధారపడి ఉందని ముర్ము అన్నారు. ప్రపంచ దేశాల మెప్పును భారత్ పొందుతోందని చెప్పారు. ద్వైపాక్షిక-బహుళ పాక్షిక సంబంధాల క్రమంలో కొత్తగా అనేక రంగాల్లో చొరవ కనిపించిందని అన్నారు. నిర్ణయాత్మకంగా భారత్ ముందుకు సాగుతోందని, బహుళ రంగాల్లో గొప్ప అవకాశాలను పొందుతోందని, అలాగే సవాళ్లనూ ఎదుర్కొంటోందని చెప్పారు. ఇలాంటి తరుణంలో విదేశీ సేవల్లో కెరీర్‌ను ప్రారంభించడం ఆఫీస్ ట్రైనీలకు ఉత్సాహభరితంగా ఉంటుందని అన్నారు. భారత నాగరికత, వారసత్వం, సంస్కృతిని ప్రపంచదేశాలకు అందించడానికి ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) ప్రత్యేక అవకాశాన్ని ఇస్తుందని అభిప్రాయపడ్డారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన ఆరోగ్య సంరక్షణ లభిస్తోందని చెప్పారు. టెక్నాలజీ పెరిగేకొద్దీ భద్రతా ముప్పు పెరుగుతుందని అన్నారు. వేగంగా మారుతున్న ప్రపంచంలో ఆధునిక సాంకేతికతల నడుమ ఐఎఫ్ఎస్ అధికారుల పాత్ర గతంలో కంటే క్లిష్టంగా ఉండనున్నట్లు తెలిపారు. కష్టాలను ఎదురీదుతూ దేశానికి ఉత్తమ సేవలను అందిస్తారని, భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటూ విజేతలుగా నిలుస్తారని ఆకాంక్షిస్తున్నట్లు ట్రైనీలతో ముర్ము అన్నారు.

బీపీ మండల్ విగ్రహ దిమ్మె కూల్చివేత

అధికారుల తీరును నిరసిస్తూ బీసీ నేతల బైఠాయింపు

విశాలాంధ్ర-గుంటూరు: బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ విగ్రహ దిమ్మెను నగరపాలక సంస్థ అధికారులు బుధవారం రాత్రి కూల్చివేశారు. అమరావతి ఇన్నరింగ్‌రోడ్డు కూడలి వద్ద డివైడర్‌పై విగ్రహ నిర్మాణానికి ఈ నెల 25న శంకుస్థాపన చేశారు. మాజీ హోంమంత్రితో పాటు ఎమ్మెల్సీలు, మండల్ మనవడు శంకుస్థాపనకు హాజరయ్యారు. మండల్ విగ్రహ నిర్మాణం కోసం ఏడాది క్రితమే అనుమతి కోరుతూ కలెక్టర్‌కు బీసీ సంఘం నేతలు వినతిపత్రం అందించారు. ఇటీవల నగరపాలక అధికారులు, మేయర్‌కు కూడా వినతులు సమర్పించారు. దిమ్మె కూల్చడాన్ని నిరసిస్తూ గురువారం బీసీ సంఘాల నాయకులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చివేయడంపై మండిపడ్డారు.

ప్రభుత్వ అరాచకానికి పరాకాష్ఠ: అచ్చెన్నాయుడు

బీపీ మండల్ విగ్రహ ఏర్పాటుకు ఉద్దేశించిన దిమ్మెను గుంటూరు నగరపాలక సిబ్బంది కూల్చివేయడం అత్యంత దుర్మార్గమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మాజీ హోం మంత్రి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు బీహార్ నుంచి వచ్చిన మాజీ ముఖ్య మంత్రి మనుమడు ఎంతో గొప్పగా గౌరవ సూచకంగా ఏర్పాటు చేసుకున్న విగ్రహ దిమ్మెను కూల్చివేయడం జగన్ దుర్మార్గానికి పరాకాష్ఠ అని అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల ఆశలను కూల్చివేయడం ఎన్నటికీ సాధ్యం కాదని గుర్తుపెట్టుకోవాలన్నారు. దేశంలో 52 శాతానికి పైగా బీసీ జనాభా ఉన్నప్పటికీ విద్య, ఉద్యోగ అవకాశాల్లో సమాన వాటా ఇచ్చినప్పుడే సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని మండల్ ఎలుగెత్తి చాటారన్నారు. కనీస సమాచారం కూడా ఇవ్వకుండా విగ్రహ దిమ్మెను కూల్చాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు.

బీసీలను అవమానపర్చడమే: ఆలా

బీపీ మండల్ విగ్రహ దిమ్మెను కూల్చివేయడం బీసీలను అవమానపర్చడమేనని విగ్రహ కమిటీ కో-కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు అన్నారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడును కలిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దేశ రాజకీయ చరిత్రను మార్చిన గొప్ప నాయకుడి విగ్రహ నిర్మాణానికి ఏర్పాటు చేసిన దిమ్మెను కూల్చడం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని మండల్ విగ్రహాన్ని నిర్మించే వరకు దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

బీసీ వర్గాల మనోభావాలను కించపరచడమే: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

బీసీ రిజర్వేషన్ల ఆద్యులు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికై నిరంతర కృషి సల్పిన మహనీయుడు బీపీ మండల్ విగ్రహ ఏర్పాటు కోసం నిర్మించిన దిమ్మెను గుంటూరు నగరపాలక సంస్థ సిబ్బంది కూల్చివేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ఈ దుశ్చర్యల వెనుక రాష్ట్ర ప్రభుత్వం, వైసీపీ నేతల ఆదేశాలు ఉండి ఉండాయని భావిస్తున్నామన్నారు. పౌరహక్కుల కమీషన్ ఛైర్మన్‌గా ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యాలయాల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించేందుకు బీపీ మండల్ ఎంతో కృషి చేశారని, బీసీలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ ఇచ్చినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని నొక్కి వక్కాణించారన్నారు. అంతటి మహనీయుని విగ్రహం కోసం ఏర్పాటు చేసిన దిమ్మెను కనీస సమాచారం కూడా ఇవ్వకుండా కూల్చడం తగదన్నారు. బీసీల అభ్యున్నతి పట్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే గుంటూరులో బీపీ మండల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



వార్తా పత్రిక కేవలం ఉమ్మడి ప్రచార సాధనమే కాదు, అది ఉమ్మడిగా సమీకృతం కావడానికి మార్గమే..

లెనిన్

హిరేన్ నోరు విప్పితే గ్రంథాలయం మాట్లాడినట్టే

ఒక్క పలచగా ఉండే హీరేన్ ముఖర్జీ (1907 నవంబర్ 23- 2004 జులై 30) చాలా సాత్వికుడిలా కనిపిస్తారు. కానీ పార్లమెంటులో నోరు తెరిస్తే అందరూ అవాక్కై పోవాల్సిందే. మనిషి పీలగా ఉన్నా గొంతు ఘనమైందే. ఇంగ్లీషు ఉచ్చారణ పూర్తిగా ఆక్స్ఫర్డ్ దే. పలుకుబడి పూర్తిగా కలకత్తాదే. స్వరం మాత్రం అచ్చమైన బెంగాలీదే. ఆయన ఎప్పుడు మాట్లాడినా పాండిత్యం జాలువారేది. ఆయన ప్రసంగిస్తుంటే గ్రంథాలయం మొత్తం ముక్త కంఠంతో మాట్లాడుతున్నట్టు ఉండేది. ఇంకా నిషేధంలో ఉండగానే ఆయన 1936లో కమ్యూనిస్టు పార్టీల్లో చేరినా ఇంగ్లాండ్ లో చదువుకుంటున్నప్పటి నుంచే కమ్యూనిస్టు బీజాలు పడ్డాయి. కోల్కతా లోని ప్రెసిడెన్సీ కళాశాలలో ఎమ్మే పట్టా పుచ్చుకుని ఇంగ్లాండ్ వెళ్లి అక్కడ మళ్లీ ఇంగ్లీషు సాహిత్యంలో డిగ్రీ సంపాదించి న్యాయశాస్త్రంలోనూ పట్టభద్రులయ్యారు.

ఆంధ్రా యూనివర్సిటీలో చరిత్ర ఉపన్యాసకులుగా 1934-35లో బోధనా వృత్తి ప్రారంభించారు. తరవాత 1940 నుంచి 44 దాకా కలకత్తా విశ్వవిద్యాలయంలో చరిత్ర రాజకీయ తత్వ శాస్త్రం బోధించారు. ఆ తరవాత కలకత్తాలోని సురేంద్ర నాథ్ కళాశాల చరిత్ర విభాగం అధిపతిగా ఉన్నారు.

1952 లో మొట్ట మొదటి సారి ఈశాన్య కలకత్తా నియోజకవర్గం నుంచి ఎన్నికై లోకసభలో అడుగు మోపి వరసగా 1957, 1962, 1967, 1971లోనూ విజయం సాధించారు. హిరేన్ ముఖర్జీ గౌరవార్థం పార్లమెంటులో హిరేన్ ముఖర్జీ స్మారకోపన్యాసం ఏర్పాటు చేస్తారు. పార్లమెంటు సెంట్రల్ హాలులో జరిగే సమావేశంలో నోబెల్



హీరేన్ ముఖర్జీ

బహుమతి గ్రహీతలు అమర్త్య సేన్, మహమ్మద్ యూనస్, ప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త జగదీశ్ భగవతి, బూటాన్ ప్రధాని ల్యోంచెన్ జిగ్మి వై. తిన్లే లాంటి వారు స్మారకోపన్యాసాలు చేశారు. మరే పార్లమెంటు సభ్యుడికీ ఈ గౌరవం దక్కలేదు.

1952 నుంచి 1964 దాకా లోకసభలో సీపీఐ ఉప నాయకుడిగా, ఆ తరవాత 1962 నుంచి 1967 దాకా సీపీఐ పక్ష నాయకుడిగా ఉన్నారు. పార్లమెంటు గ్రంథాలయానికి, బ్యూరో ఆఫ్ పార్లమెంటరీ స్టడీస్ కు గౌరవ సలహాదారుగా ఉన్నారు. 1978 నుంచి 82 దాకా లోకసభ స్పీకర్ కు గౌరవ సలహాదారుగా ఉన్నారు.

విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పాల్గొనే వారు. 1936లో లక్నోలో అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భవించినప్పుడు హిరేన్ ముఖర్జీ కూడా వ్యవస్థాపక సభ్యుడే. ఆ తరవాత కొంత కాలం ఆయన ప్రజానాట్యమండలి అధ్యక్షుడిగా ఉన్నారు. 1948-49లో విచారణ లేకుండానే ఆయన జైలులో ఉండవలసి వచ్చింది.

కెనడాలోని టొరంటో విశ్వవిద్యాలయం, జర్మన్ అకాడమీ లో ఆయన అతిథి అధ్యాపకుడిగా ఉన్నారు. 1969లో మాస్కోలో లెనిన్ పై జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్నారు. అనేక విశ్వద్యాలయాల్లో ఆయన అతిథిగా పాఠాలు చెప్పారు. ఆయన పని చేసిన ఆంధ్ర విశ్వవిద్యాలయమే ఆయనను డి.లిట్ తో సత్కరించింది. కలకత్తా యూనివర్సిటీ, ఉత్తర బెంగాల్ యూనివర్సిటీ, రవీంద్ర భారత్ యూనివర్సిటీ కూడా గౌరవ డాక్టొరేట్లు ఇచ్చాయి. 190లో పద్మభూషణ్, 1991లో పద్మ విభూషణ్ అవార్డు అందుకున్నారు.

ఆయన ఉపన్యసిస్తుంటే ఒక్కో సారి చాలా ప్రామాణికమైన పదజాలం వాడితే మరో సారి సందర్భాన్ని బట్టి పామరులకు సైతం అర్థమయ్యే పదజాలం వాడే వారు. హిరేన్ ముఖర్జీకి ఎవరైనా ఉత్తరాలు రాస్తే అన్నింటికీ ఆయనే స్వదస్తూరీతో సమాధానం ఇచ్చే వారు. ఆయన సంస్కృత పండితుడని చాలా మందికి తెలియదు. ఆయన జ్ఞాపక శక్తి అద్వితీయమైంది. ఉపన్యసించేటప్పుడు ఎంత గంభీరంగా ఉండేవారో మామూలుగా మాట్లాడేటప్పుడు చాలా సాదా సీదాగా, మరీ చెప్పాలంటే సిగ్గరిగా కూడా ఉండే వారు.

-ఆర్వీ

తిరగబడ్డ దళిత బిడ్డ

ఒకవైపు పరదేశపు పాలన పై తిరుగులేని పోరాటం భారత స్వాతంత్ర్యోద్యమం. మరోవైపు సమస్త దోపిడీ పీడనలను సవాలు చేస్తున్న కమ్యూనిస్టు ఉద్యమం. మొత్తంగా భారత ప్రజానీకాన్ని చైతన్య పథాన నడిపిస్తున్న కాలం. జీవమున్న ప్రతి విత్తనం తొలకరి వానలో నాగేటిచాలున అంకురించినట్లే చైతన్యవంతుడైన ప్రతి వ్యక్తి ఈ విప్లవ వసంతంలో తనకు తానుగా ఉద్యమానికి ఒక ఆయుధంగా మారాడు. అలాంటి మొక్కవోని కమ్యూనిస్టు ఆయుధం కామ్రేడ్ గొరికపూడి జోసెఫ్. చల్లపల్లి జమీందారీ అణచివేతపై తిరగబడ్డ దళిత బిడ్డ జోసెఫ్.

గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలం చింతమోటు గ్రామంలో 1925 జులై 1న జోసెఫ్ పుట్టారు. కొల్లూరు గ్రామంలో గొరికపూడి రామస్వామి, దీవెనమ్మ వద్ద పెరిగారు. వారిది వ్యవసాయ కార్మిక కుటుంబం. కొల్లూరు ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.ఎల్.సి చదివారు. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులయ్యారు. సహజ ఆవేశపరుడు. గుమ్మడి బసవపున్నయ్య ఆయనకు మార్గదర్శకులు. 1948లో కొల్లూరులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు జరిగాయి. వాటి ఆహ్వానసంఘం అధ్యక్షునిగా జోసెఫ్ సభలు విజయవంతం అయ్యేందుకు కృషిచేశారు. సంఘం వ్యాప్తికి శ్రమించారు. 1947 ఆగస్టు 15న మన దేశానికి స్వాతంత్ర్యం

గొరికపూడి జోసెఫ్

సిద్ధించిన రోజు. ఆరోజు కొల్లూరులో మరో చారిత్రాత్మక ఘట్టం జరిగింది. అదే దేవాలయంలోకి దళితుల ప్రవేశం. ఈ కార్యక్రమంలో జోసెఫ్ ప్రధాన పాత్ర పోషించారు. అదే ఏడాది జిల్లా బోర్డుకు జరిగిన ఎన్నికల్లో పోటీచేశారు.

కృష్ణానదిలోని లంకభూముల్లో పేదరైతులు వ్యవసాయం చేసేవారు. వరదలొచ్చినప్పుడు లంక భూములు కొట్టుకుపోయేవి. పంటలు చల్లపల్లి జమీందారు స్వాధీనం చేసుకునేవాడు. ఆరుగాలం కష్టించిన రైతు నష్టపోయేవాడు.

జమీందారీ పరిధిలోని 60 గ్రామాల లంక భూముల రైతుపై పన్నుల రూపంలో జమీందారీ పీడన దారుణంగా ఉండేది. ఈ పీడనపై రైతులు ఉద్యమించారు. జమీందారుకు మద్దతుగా వచ్చిన పోలీసులు జరిపిన కాల్పుల్లో బావిరెడ్డి వియ్యమ్మ, మత్తి సుబ్బారావు, తాడిశెట్టి వెంకటేశ్వర్లు అనే రైతులు మరణించారు. గాజుల్లంక రైతుల పోరాటంలో పాల్గొన్న జోసెఫ్‌ను పోలీసులు ఎముకలు గుల్లయ్యేలా విరగొట్టారు.

అజ్ఞాతంలోకి వెళ్ళిన జోసెఫ్ ఆచూకీకోసం పోలీసులు దళితవాడపై దాడిచేసి ప్రజలను తీవ్రంగా హింసించారు. ఎట్టకేలకు గొరికపూడి జోసెఫ్, గొరికపూడి చింతయ్య, పులివర్తి చింతయ్యను అరెస్టు చేసి సేలం జైలుకు తరలించారు. వారు ఆరునెలలు జైలుశిక్ష అనుభవించారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కారణంగా నెహ్రూ ప్రభుత్వం కమ్యూనిస్టుపార్టీపై నిషేధం విధించింది. 1949 నుండి 1950 వరకు జోసెఫ్ అజ్ఞాత జీవితం గడిపారు. అరెస్టు చేసిన పోలీసులు రహస్య సమాచారం కోసం ఆయనను చిత్రహింసలకు గురిచేశారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన అనంతరం 1952లో తొలి సాధారణ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో 28 ఏళ్ళ వయస్సులో అమృతలూరు జనరల్ నియోజకవర్గం నుండి జోసెఫ్ శాసనసభకు పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థిపై విజయం సాధించారు. ఆంధ్రరాష్ట్ర సాధనకోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారు.

జమీందారీ వ్యవస్థ రద్దుకోసం పోరాడారు. 1955లో ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో తిరిగి అమృతలూరు నుండి పోటీచేశారు. తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన కోలుకునేందుకు కమ్యూనిస్టు పార్టీ ఎంతగానో సహాయసహకారాలను అందించింది. ఆరోగ్యం మెరుగయ్యాక తిరిగి జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం నిర్మాణానికి నడుంగట్టారు. తీవ్రమైన గుండెపోటుతో 1969 జులై 20న కామ్రేడ్ జోసెఫ్ తుదిశ్వాస విడిచారు.

- కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ

మొదటి పోరాటమే ఉత్సాహాన్నిచ్చింది

నిండు వేసవిలో పెదకొత్తపల్లి దళితకాలనీ వాసులకు తాగునీరులేక అల్లాడుతుంటే గ్రామంలోని చెరువులు, బావులలోని మంచినీటిని దగ్గరుండి ఇచ్చినప్పుడు జరిగిన పోరాటం ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపింది. ఆ గొడవలో గ్రామంలోని పెత్తందారులు దళిత కాలనీ వాసులపై కర్రలతో దాడులు చేస్తే, ఆ రక్తపు గాయాలతో ఒంగోలులోని కలెక్టరేట్ వరకు నడచి వెళ్లి సమస్యను కలెక్టర్‌కు విన్నవించాం.పోలీసుల సహాయంతో మరుసటి రోజు కూడా మంచినీటిని దళిత కాలనీ వాసులు గ్రామంనుండే తీసుకుపోయారు.దీంతో గ్రామస్తులంతా మా పది మంది కుర్రాళ్లను గ్రామం నుండి వెలివేశారు. ఏ ఇంటిలో పెళ్లిళ్లలకు గాని, భోజనాలకుగాని, చావులకు పిలవకూడదని,అలా పిలిస్తే రూ.500 జరిమాన విధించారు. మమ్మల్నే కాదు దళిత కాలనీ వాసులను ఎవ్వరూ వ్యవసాయ పనులకు పిలవకూడదని, నిత్యావసర సరుకులు ఎవ్వరూ అమ్మకూడదని, పొలాల గుండా ఎవ్వరినీ నడవనివ్వకూడదని తీర్మానించారు. దీంతో మాతో పాటుగా దళిత కాలనీ వాసులు ఇంటినుండి బయటకు వచ్చేందుకు వీలులేకుండా చేశారు. దళిత కాలనీకి రోడ్డుకు మధ్యలో మాకు చెందిన 9 ఎకరాల పొలంలో నుండి ఎవ్వరూ నడవకుండా కొందరినీ కాపలా కూడా పెట్టారు. అప్పుడు మేము వెళ్లి మా పొలం దగ్గర మీరు కాపలా ఏందిరా అని దబాయించి వారిని అక్కడ నుండి తరిమి కొట్టి దళితకాలనీ వాసులు నడిచేందుకు దారి చూపాము. దీంతో గ్రామస్తులు పూర్తిస్థాయిలో కక్ష కట్టారు.మమ్మల్ని నిర్బంధించేందుకు అనేక నిర్ణయాలు చేసిన వ్యక్తి కుమారుడి పెళ్లికి మా పదిమంది స్నేహితులను పిలిచారు. గ్రామంలోని పరిస్థితులు అతనికి తెలియవు. మేము పెళ్లికి పోయే సరికి గ్రామస్తులంతా అక్కడి నుండి వెళ్లిపోయారు. దీంతో రంగదాసు అనే పురోహితుడు చే పెళ్లిజరిపించి, దళిత కాలనీ వాసులందరినీ పిలిచి భోజనాలు పెట్టించాం. వీటన్నిటికంటే ముందు విద్యార్థి దశలో ఉన్నప్పుడు పార్టీ నిషేధంలో ఉంది. పార్టీ నాయకులు నల్లూరి అంజయ్య, పొత్తూరి పేరయ్య, మన్నంపిచ్చియ్య లాంటి వారు అజ్ఞాతంలో ఉండేవారు.వారికి ఎవరికీ తెలియకుండా ఆహారం అందించటం, వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించటం వంటి కోవర్టు పనులు చేసేవాడిని, మేము

నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న)

లేని సమయంలో పోలీసులు మా రూములో సోదాలు నిర్వహించి తన పెట్టెలు స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో చదువు వదిలేసి పెదకొత్తపల్లి గ్రామంలో కేవలం పార్టీ కార్యకలాపాలకు మాత్రమే పరిమితమయ్యాము. ప్రతి రోజు 10 మంది కుర్రాళ్లం సైకిళ్లు వేసుకుని చుట్టుపక్కల గ్రామాలకు తిరిగేవాళ్లం, ఈ నేపథ్యంలో కొంతమంది చిన్నపిల్లలచేత నల్లూరి చిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మమ్మల్ని చూసి కాంగ్రెస్ జై, కమ్యూనిస్టులు తస్సు మంటూ ఎగతాళి చేయించేవాడు. ఇతని ఆగడాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశ్యంతో ఒక నాటకాన్ని వేసేందుకు రిహార్సల్స్ ప్రారంభించాం. ఆ నాటకంలో చిన వెంకటేశ్వర్లుకు కూడా ఒక క్యారెక్టర్ ఇచ్చాం. మా నాటకం రిహార్సల్స్ చూసేందుకు వచ్చిన పిల్లలకు కూడా నృత్యాలు నేర్పి వారిని కూడా మావెంటే ఉంచుకున్నాం. ఈ నేపథ్యంలో ఆ నాటాకాన్ని మొదటి ప్రదర్శనగా మైనంపాడు గ్రామంలో కమ్యూనిస్టు నాయకులు మాదాల కోటయ్య, నరసయ్యల సంస్మరణ సభలో వేయాల్సివచ్చింది.అయితే అది కమ్యూనిస్టుల సభ అని దానిలో మేము వేయమని కొత్త పిల్లలు మంకు పట్టారు. వాళ్లతో మనకు సంబంధంలేదని, వాళ్ల సభ తర్వాత మనం నాటకం వేద్దామని చెప్పి మొదటి ప్రదర్శన ఇప్పించాం.అప్పటి నుండి ప్రతి గ్రామంలో యువతకు నాటకం నేర్పించటం,దాని ప్రదర్శన తర్వాత యువజన సంఘం ఏర్పాటు చేయటం, దానిని పార్టీకి అనుబంధంగా మరల్చటం చాలా వేగంగా జరిగిపోయేవి. ఈ విధంగా సాంస్కృతిక రంగం ద్వారా యువజన సంఘం, దాని ద్వారా పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశాం. పేర్నమిట్ట, కరవదితో పాటుగా పలు ఈ ప్రాంతమంతా కమ్యూనిస్టుల కోటగా మార్చాము. గ్రామంలోని ఒక వైశ్యుని ఇంటిపై అనుకోకుండా ఎర్రజెండా ఎగురవేశాము. దానిని చూసిన గ్రామంలోని కాంగ్రెస్ నాయకుడు ఆ జెండాని పీకివేసి చించి, తగులబెట్టాడు. దీంతో పట్టుదలతో గ్రామంలో యువజన సంఘం ద్వారా పార్టీని మరింతగా బలోపేతం చేసి మరుసంవత్సరానికల్లా అదే ఇంటిపై ఎర్రజెండాను రెపరెపలాడించాము.ఈ సారి దానిని తాకే సాహసం ఎవ్వరూ చేయలేదు. తెలుగునాట ప్రయోజనాత్మకమైన మార్పును తీసుకురావటంలో ప్రజానాట్యమండలి కారమైందని చెప్పటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.



- నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న)

పడినప్పుడల్లా లేచిన కెరటం

కొండపల్లి కోటేశ్వరమ్మ

నిండు నూరేళ్లు జీవించే వారు కొద్ది మందైనా కనిపిస్తారు. కానీ అందులో అధికభాగం అర్థవంతమైన జీవితం గడిపిన కొండపల్లి కోటేశ్వరమ్మ (1918 ఆగస్టు5 - 2018 సెప్టెంబర్19) లాంటి వారు చాలా చాలా అరుదు. ఆమె శతవత్సరాల నిండు జీవితం గడిపారు. ఆదర్శం, త్యాగం, పట్టుదల, ఎన్ని అవాంతరాలెదురైనా పడి లేచే కెరటంలా నిటారుగా నిలబడడం, ఓర్మి, సహనం, పోరాటాలు, విషాదం, బాధ, నిస్వార్థం, క్షమాగుణం, స్ఫూర్తి ఇవన్నీ కోటేశ్వరమ్మ జీవితంలో అక్షర సత్యాలు. బలహీనంగా ఉండే ఆమెలో ఈ లక్షణాలన్నీ చివరి దాకా కొనసాగడానికి సమాజం భవిష్యత్తు మీద ఆమెకు ఉన్న అమితమైన ఆశే కారణం. కోటేశ్వరమ్మను చాలా మంది కొండపల్లి సీతారామయ్య భార్యగానే గుర్తిస్తారు. కాని ఆయనతో ఆమె సాహచర్యం రెండు దశాబ్దాలకు లోపే. ఆమె జీవితం ఎంత విషాద భరితమైనా సామాజిక జీవనంలో మాత్రం కడ దాకా వెలుగులే నింపారు.

కోటేశ్వరమ్మ కృష్ణా జిల్లా పామర్రులో కలిగిన కుటుంబంలోనే పుట్టారు. శారదా చట్టం వస్తుందన్న భయంతో నాలుగేళ్ల వయసు ఉండగానే మేనమామతో పెళ్లి చేశారు. రెండేళ్లయినా తిరగక ముందే భర్త చనిపోయారు. ఆమెకు పెళ్లీ తెలియదు, భర్త పోవడమూ తెలియదు. జాతీయోద్యమ ప్రభావం ఆమె మీద ఎంత ఉండేదో తల్లి మీద కూడా అంతే ఉండేది. పదేళ్ల వయసున్నప్పుడు కోటేశ్వరమ్మ గాంధీజీని చూశారు. నగలన్నీ ఆయన కిచ్చేశారు. ఆమెకు లోకం తెలుస్తున్న దశలో జాతీయోద్యమం తీవ్ర ఆటుపోట్లలో ఉంది. ఒక వైపున గాంధీ నాయకత్వంలో అహింసాయుత పోరాటం, మరో వేపున కమ్యూనిస్టు పార్టీ ఆంధ్ర ప్రాంతంలో వేళ్లూనుకోవడం, అప్పుడప్పుడే దళిత ఉద్యమ ఛాయలు కనిపించడం మొదలైన పరిణామాలన్నీ ఆమెను తీర్చిదిద్దాయి. 1930-32 ప్రాంతంలో కాంగ్రెస్‌లో అతివాద భావాలున్నవారు ప్రత్యామ్నాయ మార్గం అన్వేషిస్తున్న రోజులవి. ఆంధ్ర ప్రాంతంలో వామపక్ష ఉద్యమం అంకురిస్తున్న దశ.

కమ్యూనిస్టు నాయకుడు చంద్ర రాజేశ్వరరావు చొరవతో అప్పటికే వామపక్ష రాజకీయాల్లో తలమునకలై ఉన్న కొండపల్లి సీతారామయ్యతో 1939 లో ఆమెకు పెళ్లయింది. పెళ్లి అయిన తర్వాత కోటేశ్వరమ్మ కుటుంబాన్ని కులంలోంచి వెలేశారు. ఒక వేపు భర్త అజ్ఞాత వాసం, అరెస్టు, తొలి చూలు మగబిడ్డ చంద్రశేఖరఆజాద్ పుట్టడం, ఆమెలో ఒంటరితనం పెరిగిపోయినా జీవన పోరాటంలో వెనుకడుగు వేయలేదు. రహస్యంగా వెలువడే స్వతంత్ర భారత్ పత్రిక సైక్లోస్టయిల్ కాపీలు తీయడం, తల్లితో కలిసి ఆ పత్రికలు పంచడంలో నిమగ్నమయ్యారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే వారు. భూమి కోసం నాటకంలో ప్రధాన భూమిక పోషించే వారు. ఆమె చేత నాటకాల్లో పాత్ర వేయించడం కోసం సీతారామయ్య నిరాహార దీక్షే చేయవలసి వచ్చింది. తెలంగాణా సాయుధ పోరాట ప్రభావం కోస్తా ఆంధ్ర మీద కూడా ఉండేది. అందుకే ఆమె అజ్ఞాతవాసం గడపవలసి వచ్చింది. సీతారామయ్య మరో స్త్రీతో సంబంధం పెట్టుకున్న తరువాత ఇద్దరు దూరంగా ఉన్నారు. ఆ తర్వాత ఆమె 35 ఏళ్ల వయసులో హైదరాబాద్ వచ్చి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఏర్పాటు చేసిన అనాథ శరణాలయంలో ఉంటూ మెట్రిక్ పాసయ్యారు. కథో, కవితో, రేడియోకు రాస్తే వచ్చే పది పరకతో జీవితం వెళ్లదీశారు. కాకినాడ పాలీటెక్నిక్ కళాశాలలో వార్డెన్ ఉద్యోగం సంపాదించారు. వార్డెన్‌గా ఇతర కళాశాలల్లోనూ పని చేశారు. సీతారామయ్య అమెకు దగ్గరవ్వాలని ప్రయత్నించినా ఆమె నిరాకరించడానికి వైవాహిక బంధం మీద ఆమెకు ఉన్న కచ్చితమైన అభిప్రాయమే కారణం.

1950 లలో సీతారామయ్యతో విడిపోవడం ఒక విఘాతం అయితే కొడుకు చంద్రశేఖర్ వామపక్ష ఉద్యమంలో పాల్గొన్నందువల్ల జాడ తెలియకుండా పోయాడు. రోజుల తరబడి తిండి లేకుండా గడిపారు. చౌకగా దొరికే పళ్లే ఆహారం. అవీ లేనప్పుడు కొబ్బరి నీళ్లే గతి. అలాంటి దురవస్థలోనే 1952, 1955 ఎన్నికలలో ప్రచారం చేశారు. కొంత కాలం నందిగామలో జైలు జీవితమూ తప్పలేదు. కూతురు కరుణ భర్త డా. రమేశ్ మరణంతో ఆ కూతురూ జీవితం చాలించారు. భర్త నుంచి దూరం కావడం, కళ్ల ముందే కొడుకు, కూతురు, అల్లుడు మరణించడం ఎవరికైనా భరించరాని విషయమే. కాని అంతకన్నా ఆమెను ఎక్కువగా కుంగదీసింది వామపక్షాలలో చీలిక. అయినా ఆమె రెండు కమ్యూనిస్టు పార్టీలకు నెల నెలా సభ్యత్వ రుసుం పంపించే వారు. వామపక్షాల చీలికలు ఆ పార్టీలకే పరిమితం అనుకున్నారు తప్ప ఉద్యమం మీద ఆమె విశ్వాసం ఇసుమంత కూడా సడల లేదు. ఇరవై ఏళ్లయినా లేని వయసులోనే ప్రారంభమైన ఆమె సామాజిక జీవితం కనీసం ఆరు దశాబ్దాలు సాగింది. సాంస్కృతిక కార్యకర్తగా ఆమె తాపీ ధర్మారావు రాసిన బండి ఆ పల్లకి నాటకంలో నటించే వారు. కన్యాశుల్కంలో కూడా నటించారు. ఆమెను ఎప్పుడు దుఃఖం ఆవరించినా సాహిత్యమే ఆలంబన అయింది. అమ్మ చెప్పిన అయిదు గేయాలు, అశ్రు సమీక్షణం - కవితా సంకలనం, సంఘమిత్ర కథలుతో పాటు ఆమె ఆత్మకథ నిర్జన వారధి (2012) ప్రచురితమైనాయి. చంద్ర రాజేశ్వరరావు మళ్లీ పెళ్లి చేసుకోవడానికి ప్రోత్సహించడమే కాదు, ముదిమి వయసులో కొంత కాలం ఆయన పేరిట నెలకొల్పిన వృద్ధాశ్రమమే ఆమెకు నెలవైంది.

ఆర్వీ రామారావ్

బొల్షివిక్ కుట్రకేసుగా ప్రచారం

భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ స్థాపన తేదీ వివాదాస్పదం. కానీ ఎక్కువ మంది 1925 కాన్పూరు సమావేశమే స్థాపిత సంవత్సరంగా అంగీకరిస్తున్నందున అదే స్థిరపడింది. కమ్యూనిస్టు పార్టీ గర్భస్థ శిశువుగా ఉన్న సమయంలోనే అనేక నిర్బంధాలకు, కేసులకు, జైలు శిక్షలకు గురైంది. 1923 పెషావర్ కుట్ర కేసు ముద్దాయిలైన కమ్యూనిస్టులకు శిక్షలు విధించి, వెంటనే 1924 లో కమ్యూనిస్టులపై కాన్పూరు కుట్ర కేసు బనాయించారు. శిక్షాస్మృతి 121 (ఎ) సెక్షన్ కింద యస్.ఎ.డాంగే, షౌకత్ ఉస్మాని, ముజఫర్ అహ్మద్, నళినీగుప్తా, గులాం హుస్సేన్, రామచరణ్‌శర్మ సింగారవేలు చెట్టియార్, ఎం.ఎన్.రాయ్‌లపై ఈ కేసు బనాయించారు. వీరిలో మొదటి నలుగురిపైనే విచారణ జరిగింది. రాయ్ యూరోపులో ఉన్నందున, సింగారవేలు చెట్టియార్ ఆనాటికి కదలలేని స్థితిలో ఉన్నందున వారిని కోర్టులో హాజరు పెట్టలేకపోయారు.

గులాం హుస్సేన్ పోలీసులకు లొంగిపోయినా ఆ తర్వాత జైలు నుంచి పారిపోయి ఫ్రెంచి వారి ఆధీనంలో ఉన్న పాండిచేరిలో ఆశ్రయం పొందాడు. కాన్పూరు సభ ఏర్పాట్లలో కూడా ముఖ్య పాత్ర నిర్వహించాడు. కేంద్ర గూఢాచార శాఖ డైరెక్టర్ సర్ నవిల్ కేయా ఈ కేసులో ఫిర్యాది. అతని కోరికపై ఈ కేసును "కాన్పూరు బోల్షివిక్ కుట్ర కేసు" గా పత్రికలు పేర్కొన్నాయి. సోవియట్ ప్రభుత్వాన్ని కూడా ఇరికించి ప్రచారం చేయాలని అతని ఉద్దేశం. చౌరిచౌరా కేసులో 172 మంది దేశ భక్తులకు ఉరిశిక్ష విధించిన న్యాయమూర్తి డి.ఎల్.హోం ఈ కేసులో కూడా న్యాయమూర్తి. విచారించిన నలుగురు ముద్దాయిలకు తలా నాలుగేళ్ల కారాగార శిక్ష విధించటమేగాక నలుగురినీ వేర్వేరు జైళ్లకు పంపారు. ఆ రోజుల్లో కాళ్లకు ఇనుప కడియాలు, మెడకు ఇనుప గొలుసులు వేయటం యు.పి.జైళ్లలో ఆచారం. నెహ్రూలాంటి వారికి మాత్రం మినహాయింపు ఉండేది. సింగారవేలు చెట్టియార్ తర్వాత కాలంలో అరెస్టు అయినా అప్పుడు తగిన సాక్ష్యాలు లేక శిక్ష వేయలేకపోయారు. ఈయనే 1925లో జరిగిన కమ్యూనిస్టు పార్టీ తొలి సమావేశానికి అధ్యక్షత వహించారు.

నళినీగుప్తా అసలు కమ్యూనిస్టు కాదు. కాని సాహసంతో యూరోప్ నుండి భారతదేశానికి వార్తాహరునిగా పార్టీకి ఉపయోగపడ్డాడు. ఈ కేసును పెట్టిన వెంటనే బ్రిటీష్ ప్రభుత్వం "కమ్యూనిస్టు పార్టీని భారతదేశంలో నిర్మూలించాం" అని ఉత్సాహంగా ప్రకటించింది. కాని ఆ మరుసటి సంవత్సరమే అదే కాన్పూర్‌లో కమ్యూనిస్టు పార్టీ తొలిసారిగా పురుడు పోసుకుంది. నిషేధం ఉన్న కాలంలో వివిధ ప్రాంతాల్లో కార్మిక సంఘాల్లోనూ, పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ పేరుతో పనిచేసి పార్టీని దినదిన ప్రవర్ధమానం చేశారు.

-చెరుకూరి సత్యనారాయణ

గౌతమ్ నవ్లాఖాకు చికిత్స అందించండి

తలోజా జైలు అధికారులకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: మావోయిస్టులతో సంబంధాలు, ఎల్గార్ పరిషత్ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న సామాజిక ఉద్యమకారుడు, హక్కుల కార్యకర్త గౌతమ్ నవ్లాఖాకు తక్షణమే వైద్య సదుపాయం అందించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ముంబైలోని తలోజా జైలులో ఉంటున్న 70 ఏళ్ల వయసున్న నౌవ్లాఖా జైలులో తగిన సదుపాయాలు లేవని, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తనను గృహనిర్బంధంలో ఉంచాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టి వేస్తూ బాంబే హైకోర్టు ఏప్రిల్ 26న ఇచ్చిన ఉత్తర్వులపై ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన జస్టిస్ కేఎం జోసెఫ్, హృషికేశ్ రాయ్ ల ధర్మాసనం నవ్లాఖాకు తగిన వైద్యం అందించాలని తలోజా జైలు సూపరింటెండెంటును ఆదేశించింది. ప్రతివ్యక్తికి వైద్యం ప్రాథమిక హక్కు అని పేర్కొంది. తక్షణమే నవ్లాఖాను ముంబైలోని జస్లోక్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని ఆదేశించింది. నవ్లాఖా భార్య సభా హుస్సేన్, సోదరిని ఆసుపత్రిలో కలవడానికి అనుమతి ఇస్తున్నట్టు వెల్లడించింది. చికిత్స కోసం ఆసుపత్రికి వెళుతున్న నవ్లాఖా పూర్తిగా పోలీసుల కస్టడీలోనే ఉండాలని స్పష్టం చేసింది.

అనైతికం... అమానవీయం

- బిల్కిస్ బానో దోషుల విడుదలపై 401 మంది ప్రముఖులు
- విడుదల ఉత్తర్వుల ఉపసంహరణకు డిమాండ్

న్యూఢిల్లీ: సామూహిక అత్యాచారం బాధితురాలు, కుటుంబసభ్యుల ఊచకోతకు సజీవ సాక్షి బిల్కిస్ బానోకు న్యాయం చేయాలని 401 మంది ప్రముఖులు గళమెత్తారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వానికి లేఖ పంపారు. బిల్కిస్ బానో దోషులను విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది అనైతికం...అమానవీయం అని వ్యాఖ్యానించారు. గుజరాత్ ప్రభుత్వ నిర్ణయం అందరినీ షాక్‌కు గురిచేసిందని పేర్కొన్నారు. 'గుజరాత్ అల్లర్లలో బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం జరిగింది. ఆమె మూడేళ్ల కుమార్తెతో పాటు 14మంది కుటుంబ సభ్యులు ఊచకోతకు గురయ్యారు. ఇటువంటి హేయమైన నేరాలకు పాల్పడిన వారిని విడుదల చేయడం అనైతికం. అమానవీయతకు ఉదాహరణ కూడా. మాటల్లో చెప్పలేనంత క్రూరత్వాన్ని, మానసిక క్షోభను బిల్కిస్ బానో అనుభవించారు' అని ప్రముఖులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిణామంపై కేంద్రప్రభుత్వం మౌనాన్ని ప్రశ్నించారు. తద్వారా తప్పుడు సంకేతాలు వెలువడుతున్నట్లు వెల్లడించారు. ఈ ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. తద్వారా పౌరులకు న్యాయవ్యవస్థపై మానవత్వంపై నాగరిక/పౌరసమాజంపై నమ్మకాన్ని పునరుద్ధరించాలని కోరారు. అంతకుముందు 134 మంది ఆలిండియా సర్వీసెస్ మాజీ సభ్యులు; ఆరు వేల మంది కార్యకర్తలు, ప్రముఖ రచయితలు, చరిత్రకారులు,ఫిలింమేకర్లు, జర్నలిస్టులు, మాజీ బ్యూరోక్రాట్లు కూడా సర్వోన్నత న్యాయస్థానానికి లేఖలు పంపారు. తాజాగా కేంద్రానికి లేఖ రాసినవారిలో ప్రముఖ రచయితలు, కళాకారులు జవహర్ సిర్కర్ (రాజకీయ-మానవతావాది, న్యూఢిల్లీ), సుధీంద్ర కులకర్ణి (రాజకీయ-కమ్యూనిస్టువాది, న్యూఢిల్లీ), పరంజోయ్ గుహా తకుర్తా (మీడియా, న్యూఢిల్లీ), సుదీప్తో ముఖర్జీ (డమాస్కస్, ఐరాస డైరెక్టర్), నఫీసా అలీ (నటి, కార్యకర్త, రాజకీయ నేత, గోవా), సుభా ముద్గల్ (గాయని, ముంబై), అనీశ్ ప్రధాన్ (సంగీతకారుడు, ముంబై), జయంతా మహాపాత్ర (కవి, కటక్), రఘు రాయ్ (ఫొటోగ్రాఫర్, న్యూఢిల్లీ), నవీన్ కిశోర్ (రచయిత, ప్రచురణకర్త, కోల్‌కతా) తదితరులు ఉన్నారు.

ఆర్థిక పునరుజ్జీవానికి భారత్ మూలస్తంభం

కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్



కోల్‌కతా: భారతదేశం ప్రపంచ ఆర్థిక పునరుజ్జీవనానికి మూలస్తంభంగా నిలుస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. బెంగాల్ ఛాంబర్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా పాల్గొన్నారు. భారత్ ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థల నడుమ వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ ఉద్భవించిందని, స్థిరమైన వృద్ధిని ప్రదర్శిస్తోందని గోయల్ తెలిపారు. ఆర్థిక వ్యవస్థలోని వాటాదారులందరూ కర్తవ్య స్ఫూర్తితో కలిసి పనిచేస్తే, 2047 నాటికి 30-ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించాలన్న జాతీయ లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు. 'భారతదేశం ఇప్పటికే ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది... రాబోయే సంవత్సరాల్లో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందడానికి టర్బోచార్జింగ్ చేస్తోంది. శత స్వాతంత్ర్య వార్షికోత్సవం జరుపుకునే (2047) నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్నదే ప్రధానమంత్రి ఆలోచన' అని గోయల్ అన్నారు. వ్యవసాయం, తయారీ, నిర్మాణం వంటి అన్ని రంగాలు పురోగమిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. 'భారతదేశ స్థిరత్వం ప్రపంచ పునరుజ్జీవనానికి మూలస్తంభం అవుతుంది. మహమ్మారి సమయంలో మన ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకతను కనబరిచింది... స్థిరమైన వృద్ధి మార్గంలో ఉంది' అని మంత్రి చెప్పారు. పెట్టుబడులకు భారతదేశం అత్యుత్తమ గమ్యస్థానమని పేర్కొన్న గోయల్... ప్రభుత్వం అనేక నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టిందని, మరిన్ని అమలులోకి రాబోతున్నాయని తెలిపారు. పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలను కోరారు.

గంగా ఎక్స్‌ప్రెస్‌వేకు 'అదానీ'కి రూ.10,238 కోట్లు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని గంగా ఎక్స్‌ప్రెస్‌వే కోసం రూ.10,238 కోట్ల నిధులను తమ మూడు అనుబంధ సంస్థలు పొందాయని అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆరులేన్ల గ్రీన్‌ఫీల్డ్ గంగా ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టును ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో చేపట్టారు. రుణదాతల నుంచి రూ.10,238 కోట్లను పొందినట్లు కంపెనీ తెలిపింది. ప్రాజెక్టు కాలం 30 ఏళ్లు అని ట్రాఫిక్‌లింక్ విస్తరణకు ఆరేళ్లు పడుతుందని, నిర్మాణ కాలం మూడేళ్లు అని వెల్లడించింది. 'బుదౌన్ హర్దోయి రోడ్ ప్రైవేట్ లిమిటెడ్ (బీహెచ్‌ఆర్‌పీఎల్), హర్దోయి ఉన్నావో రోడ్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్‌యూఆర్‌పీఎల్), ఉన్నావో ప్రయాగ్‌రాజ్ రోడ్ ప్రైవేట్ లిమిటెడ్ (యూపీఆర్‌పీఎల్) కంపెనీలు అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) అనుబంధ సంస్థలు. ఉత్తరప్రదేశ్‌లోని గ్రీన్‌ఫీల్డ్ గంగా ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టు (గ్రూపు-2,3,4)లో పీపీపీ కింద డీబీఎఫ్‌ఓటీ (టోల్) ఆధారంగా ఉందని కంపెనీ వెల్లడించింది. గంగా ఎక్స్‌ప్రెస్ వే.. ప్రయాగ్‌రాజ్‌ను మీరట్‌తో అనుసంధానం చేస్తుంది. పూర్తి అయితే పొడవాటి ఎక్స్‌ప్రెస్ వేగా ఉంటుంది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ రోడ్డు వాణిజ్యం సీఈఓ కేపీ మహేశ్వరి మాట్లాడుతూ, ప్రాజెక్టు రుణ అవసరాన్ని రూ.10,238గా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పేర్కొంది. అదానీ రోడ్డు పోర్టుఫోలియో 18 ప్రాజెక్టులకు పెరిగింది. రూ.44వేల కోట్ల విలువతో ఉత్తరప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, కేరళ, గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఒడిశాతో కలిపి పది రాష్ట్రాల్లో ప్రాజెక్టు ముడిపడి ఉంది.

రాహుల్ స్వాగత బ్యానర్ల చించివేత

కర్ణాటకలో రాజకీయ వేడి

బెంగళూరు: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర శుక్రవారం కర్ణాటకలోకి ప్రవేశిస్తుంది. దీనికి ఒకరోజు ముందు చామరాజ్‌నగర్ జిల్లా గుండ్లుపేటలో ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం చింపివేశారు. దీనిపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. 40శాతం కమీషన్ బొమ్మై ప్రభుత్వానికి అప్పుడే వణుకు ప్రారంభమైందని విమర్శించింది. పోస్టర్లు, ఫ్లెక్సీలను ధ్వంసం చేయడానికి, చింపివేయడానికి బీజేపీ భారత్ టోడో టీమ్ గూండాలను రంగంలోకి దించిందని కర్ణాటక కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్‌సింగ్ సూర్జేవాలా ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ధరల పెరుగుదల, నిరుద్యోగం, అసమానత, విభజన రాజకీయాలపై పోరాటాన్ని ఆపేది లేదని ఆయన ట్విట్టర్ వేదికగా స్పష్టం చేశారు. బీజేపీ గూండాలు కొన్ని పోస్టర్లను చింపేశారని, కొన్నింటిని దహనం చేశారని కాంగ్రెస్ కర్ణాటక అధ్యక్షుడు డీకే శివకుమార్ విమర్శించారు. 'భారత్ జోడో యాత్రకు స్వాగతం పలకడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే, పోస్టర్లను బీజేపీ కార్యకర్తలు చింపేశారు. దహనం చేశారు. అయినా మేము భయపడం. ఇలాంటి వాటిని మేము ధైర్యంగా ఎదుర్కొంటాం. ఈ విషయం బీజేపీకి బాగా తెలుసు' అని చామరాజ్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ శివకుమార్ చెప్పారు. బ్యానర్లు, పోస్టర్లు చింపిన నిందితులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలకు పోలీసులు నిరాకరిస్తే ఏమి చేయాలో తాము ఆలోచిస్తామని చెప్పారు. పోస్టర్ల చించివేతపై కాంగ్రెస్ ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దీనిపై ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై స్పందిస్తూ భారత్ జోడో ఎవరు చేస్తున్నారో...భారత్ తోడో ఎవరు చేస్తున్నారో అందరికీ తెలుసునని వ్యాఖ్యానించారు. జిల్లా కేంద్రం హవేరీలో బొమ్మై విలేకరులతో మాట్లాడుతూ పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి తీసుకోవాలని, ఈ విషయం శివకుమార్‌కు తెలియదా అని ప్రశ్నించారు. రాజకీయ పార్టీల పోస్టర్లను తొలగించడం, చించడం బీజేపీకి అవసరం లేదని చెప్పుకొచ్చారు.

నేడు కర్ణాటకలోకి భారత్ జోడో యాత్ర

మీ ఆదరణకు కృతజ్ఞుడను: కేరళ ప్రజలతో రాహుల్‌గాంధీ

గూడలూరు: కేరళలో కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర దిగ్విజయంగా సాగింది. శుక్రవారం కర్ణాటకలోకి ప్రవేశించనుంది. తమ యాత్రకు లభించిన ఆదరణకుగాను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేరళ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం నీల్గిరీస్ జిల్లాలోని పట్టణంలో పార్టీ కార్యకర్తలు, వలంటీర్లు భారీ సంఖ్యలో రాహుల్‌తో కలిసి కదం తొక్కారు. తమిళనాడు, గూడలూరులోకి యాత్ర ప్రవేశించినట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ట్వీట్ చేసింది. 21వ రోజున మలప్పురంలోని నిలంబూరులోని చుంగతారా నుంచి యాత్ర ప్రారంభం కాగా కేరళ-తమిళనాడు సరిహద్దులోని గూడలూరులోకి యాత్ర ప్రవేశించి విరామం అనంతరం సాయంత్రం తిరిగి ప్రారంభమై గూడలూరు బస్టాండ్ వరకు సాగింది. కేరళలో యాత్ర ముగింపు క్రమంలో వాయనాడ్‌లో జనసమూహాన్ని ఉద్దేశించి రాహుల్ మాట్లాడారు. భారత్ జోడో యాత్రకు అందించిన ఆదరణకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కాగా, సెప్టెంబరు 10న తమిళనాడు నుంచి కేరళలో ప్రవేశించిన ఈ యాత్ర అక్టోబరు 1న కర్ణాటకకు చేరనున్నది. ఏడు జిల్లాల మీదుగా 450 కిలోమీటర్లు యాత్ర సాగనుంది.

మహేశ్, కృష్ణకు చిరంజీవి పరామర్శ



హైదరాబాద్: మెగాస్టార్ చిరంజీవి గురువారం పద్మాలయ స్టూడియోకు వెళ్లి మహేశ్ బాబు, కృష్ణలను పరామర్శించారు. కృష్ణ సతీమణి, మహేశ్ తల్లి ఇందిరాదేవి బుధవారం తుది శ్వాస విడిచిన సంగతి తెలిసిందే. అయితే చిరంజీవి తన సినిమా 'గాడ్ ఫాదర్' ప్రీ రిలీజ్ ఈవెంట్ బుధవారం అనంతపూర్‌లో పెట్టుకున్నారు. అందువల్ల వెంటనే పరామర్శించేందుకు వెళ్లలేకపోయారు. బుధవారం రాత్రి అనంతపూర్ నుండి హైదరాబాద్ చేరుకున్న చిరంజీవి, గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో మహేశ్, కృష్ణలను కలిసి వారిద్దరిని పరామర్శించారు. సుమారు 20 నిమిషాల పాటు వారిద్దరితో చిరంజీవి గడిపాడు. చెన్నైలో కృష్ణ, చిరంజీవి ఇళ్లు ఎదురెదురుగా ఉండటంతో, రెండు కుటుంబాలకు అప్పటి నుండే మంచి సత్సంబంధాలు ఉన్నాయి. చిరంజీవి ఆపాత మధురానుభూతులను కృష్ణ, మహేశ్‌బాబులతో పంచుకొని ఇందిరాదేవిని ఒకసారి తలుచుకున్నారని తెలిసింది. ముందుగా మహేశ్ బాబు తన తల్లి చిత్ర పటానికి పూలు వేసి నివాళి అర్పించారు. తరువాత చిరంజీవి వచ్చాక, ఆయన కూడా ఇందిరకు నివాళులర్పించారు.

సూర్య.. ఒకే మ్యాచ్‌లో రెండు రికార్డులు

ధావన్, రిజ్వాన్‌లను అధిగమించిన వైనం

తిరువనంతపురం: సఫారీలను చిత్తు చేయడంలో కీలక పాత్ర పోషించిన టీమిండియా బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ రెండు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. దక్షిణాఫ్రికాపై తొలి టీ20లో అర్ధశతకం సాధించిన సూర్యకుమార్ (50 నాటౌట్: 33 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు) ఓపెనర్ కేఎల్ రాహుల్ (51 నాటౌట్)తో కలిసి కీలక భాగస్వామ్యం నిర్మించి భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. 107 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా కేవలం రెండు వికెట్లను మాత్రమే కోల్పోయి 16.4 ఓవర్లలో 110 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ క్రమంలో సూర్యకుమార్ భారత సీనియర్ ఆటగాడు శిఖర్ ధావన్ పేరిట ఉన్న రికార్డుతోపాటు పాక్ ఓపెనర్ రికార్డులను తుడిచేశాడు. పొట్టి ఫార్మాట్‌లో ఒకే ఏడాదిలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా సూర్యకుమార్ అవతరించాడు. 2018లో శిఖర్ ధావన్ 689 పరుగులు చేయగా.. తాజాగా సూర్యకుమార్ ఇప్పటివరకు 732 పరుగులు చేశాడు. అదేవిధంగా ఒకే ఏడాదిలో అత్యధిక సిక్సులు బాదిన బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. పాక్ ఓపెనర్ మహమ్మద్ రిజ్వాన్ 2021లో 42 సిక్సులు కొట్టగా... సూర్యకుమార్ తాజాగా దక్షిణాఫ్రికాపై కొట్టిన మూడు సిక్సలతో కలిపి 45 సిక్సలకు చేరుకొన్నాడు. రిజ్వాన్ 26 ఇన్నింగ్స్‌ల్లో కొట్టాడు. కానీ సూర్యకుమార్ కేవలం 21 ఇన్నింగ్స్‌ల్లోనే సాధించడం విశేషం. ఇప్పటికే టీ20 ర్యాంకింగ్స్‌లో బాబర్ అజామ్‌ను అధిగమించి రెండో ర్యాంక్‌కు చేరుకొన్నాడు.

టీ20 వరల్డ్‌కప్ నుంచి బుమ్రా అవుట్?

న్యూఢిల్లీ: టీమిండియా అభిమానులకు బ్యాడ్ న్యూస్. కీలక టీ20 ప్రపంచకప్ ముందు భారత జట్టుకు గట్టి షాక్ తగిలింది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా సీరియస్ గాయంతో టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకున్నట్లు తెలుస్తోంది. వెన్నునొప్పితో బుధవారం సౌతాఫ్రికాతో జరిగిన తొలి టీ20లో బుమ్రా ఆడని విషయం తెలిసిందే. మంగళవారం ప్రాక్టీస్ సెషన్‌లో అతను వెన్నునొప్పి వస్తోందని ఫిజియోలకు చెప్పడంతో ఈ మ్యాచ్‌కు దూరంగా ఉంచినట్లు బీసీసీఐ ట్వీట్ చేసింది. మ్యాచ్ అనంతరం అతనికి పరీక్షలు నిర్వహించగా.. అతని వెన్నులో ఫ్రాక్చర్ అయినట్లు తేలింది. ఎలాంటి సర్జరీ అవసరం లేకపోయినప్పటికీ.. సుమారు 4-6 నెలల విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు తెలుస్తోంది. దాంతోనే అతను త్రివేండ్రం నుంచి గౌహతికి వెళ్లలేదని సమాచారం. ఈ విషయాన్ని బీసీసీఐ ధృవీకరించాల్సి ఉంది. జులైలో ఇంగ్లండ్ పర్యటన అనంతరం ఆటకు దూరంగా ఉన్న బుమ్రా.. వెస్టిండీస్ సిరీస్‌కు విశ్రాంతి తీసుకున్నాడు. వన్డేలతో పాటు టీ20ల్లో కూడా బుమ్రా ఆడలేదు. ఆ తర్వాత భారత్ ద్వితీయశ్రేణి జట్టు.. జింబాబ్వేలో కూడా పర్యటించింది. ఆ సిరీస్‌లో కూడా బుమ్రా ఆడలేదు. ఆసియాకప్ ముంగిట వెన్ను నొప్పితో దూరమయ్యాడు. ఆసీస్‌తో పర్యటనకు ముందే బుమ్రాతో పాటు హర్షల్ పటేల్‌కు ఎన్‌సీఏలో ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో పాసైనట్లు కూడా పేర్కొన్నారు. దాంతోనే టీ20 ప్రపంచకప్‌తో పాటు ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా జట్లకు ఎంపిక చేశారు. అయితే ఆసీస్‌తో తొలి మ్యాచ్‌లో కూడా బుమ్రా ఆడలేదు. అప్పుడే అతని ఫిట్‌నెస్‌పై సందేహాలు నెలకొన్నాయి. ఇప్పటికే రవీంద్ర జడేజా సేవలను కోల్పోయిన టీమిండియాకు బుమ్రా కూడా దూరమవడం కోలుకోలేని దెబ్బ అని చెప్పవచ్చు. ఆసీస్ కండిషన్స్ బుమ్రా బౌలింగ్‌కు సరిగ్గా సరిపోతాయి. ఈ క్రమంలోనే బుమ్రాను తీసుకొచ్చేందుకు బీసీసీఐ అత్యుత్సాహం చూపించినట్లు తెలుస్తోంది. ఫిట్‌నెస్ టెస్ట్ క్లియర్ చేసిన బుమ్రా.. మళ్లీ గాయపడటంతో ఎన్‌సీఏ ప్రమాణాలపై కూడా సందేహాలు కలుగుతున్నాయి. గతంలో దీపక్ చాహర్, భువనేశ్వర్ కుమార్ సైతం ఇలానే గాయం నుంచి కోలుకున్న వెంటనే గాయపడ్డారు. ఇక బుమ్రా స్థానంలో మహమ్మద్ షమీ, మహమ్మద్ సిరాజ్ పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

వెబ్ సిరీస్ కోసం సమంత హిందీలో శిక్షణ

హైదరాబాద్: సమంత రుత్‌ప్రభు వరుసగా సినిమాలు చేస్తోంది. ముఖ్యంగా కథానాయిక ప్రాధాన్యం ఉన్న చిత్రాలకు సై అంటోంది. కొత్త చిత్రాల కోసం తెగ కష్టపడుతుంది. సమంత కొన్ని రోజుల క్రితం అమెరికాకు వెళ్లి నిపుణుల సమక్షంలో యాక్షన్ సన్నివేశాల కోసం శిక్షణ తీసుకుంది. కఠినమైన డైట్‌ను కూడా ఫాలో అయిందని మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తాజాగా సమంతకు సంబంధిన ఓ అప్‌డేట్ హల్‌చల్ చేస్తుంది. అదేంటంటే.. సమంత ఓ వెబ్‌సిరీస్‌లో నటిస్తున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. 'సిటాడెల్' కు రీమేక్‌గా ఈ వెబ్‌సిరీస్ రూపొందుతుంది. రుస్సో బ్రదర్స్ నిర్మిస్తున్నారు. యాక్షన్ అడ్వెంచర్‌గా ఈ ప్రాజెక్టు తెరకెక్కుతుంది. ఫ్యామిలీ మ్యాన్ మేకర్స్ రాజ్ నిడిమోరు, కృష్ణ డీకే వెబ్‌సిరీస్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో స్పై పాత్రలో సమంత కనిపించనుందని సమాచారం. పాత్ర కోసం ఆమె హిందీలో శిక్షణ తీసుకుంటుందని తెలుస్తోంది. ప్రత్యేకంగా ట్యూటర్‌ను పెట్టుకుని భాష నేర్చుకుంటోంది. ఆ ట్యూటర్ గతంలో అనేక మంది బాలీవుడ్ సెలబ్రిటీలకు హిందీలో శిక్షణ ఇచ్చాడట. సిటాడెల్ అమెరికన్ వెబ్‌సిరీస్. ప్రియాంక చోప్రా, రిచర్డ్ మ్యాడెన్ కీలక పాత్రలు పోషించారు. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ వెబ్‌సిరీస్ స్ట్రీమింగ్ కానుంది.

18 ఏళ్ల తర్వాత వెండితెరపై రేణుదేశాయ్

హైదరాబాద్: రవితేజ హీరోగా నటిస్తున్న సినిమా టైగర్ నాగేశ్వరరావు. ఈ చిత్రా నికి వంశీ దర్శకత్వం వహి స్తున్నారు. పాన్ ఇండియాగా పలు భాషల్లో రూపొందిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. స్టూవర్ట్‌పురం నేపథ్యంలో పేరు మోసిన దొంగ బయోపిక్‌గా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో రేణు దేశాయ్ నటించనున్నారు. తాజాగా ఆమె షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మేకర్స్ ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. 'టైగర్ నాగేశ్వరరావు' లో హేమలత లవణం పాత్రను రేణు దేశాయ్ పోషించనున్నారు. పవర్ ఫుల్ రోల్‌లో ఆమె కనిపించనున్నారు. రేణు షూటింగ్‌ను ప్రారంభించడంతో ఆమె ఫస్ట్‌లుక్‌తో పాటు వీడియో గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ వీడియోలో రేణుదేశాయ్ తెల్లచీర ధరించారు. మహిళా కార్యకర్తలతో కలసి రోడ్డుపై నడుస్తూ ఎంట్రీ ఇచ్చారు. తెలుగు రచయిత గుర్రం జాషువా కుమార్తెనే హేమలత లవణం. ఆమె అనేక పుస్తకాలను రచించారు. సామాజిక కార్యకర్తగా సేవలు అందించారు. అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నారు.

ఛెత్రికి 'ఫిఫా' గౌరవం

న్యూఢిల్లీ: భారత సాకర్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రిని ప్రపంచ ఫుట్‌బాల్ సంఘం (ఫిఫా) సముచితంగా గౌరవించింది. 38 ఏళ్ల ఛెత్రి సాకర్, వ్యక్తిగత జీవిత విశేషాలతో మూడు ఎపిసోడ్‌ల డాక్యుమెంటరీ రూపొందించింది. ఆటగాడిగా సునీల్ నైపుణ్యాలు, అతడు సాధించిన విజయాలను ఇందులో పొందుపరిచారు. ఫిఫా ప్లాట్‌ఫామ్‌లో దీనిని అందుబాటులో ఉంచింది. 'మీకు రొనాల్డో, మెస్సీ గురించి తెలుసు. కానీ ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన వారిలో మూడో ప్లేయర్, భారత జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి విజయగాథను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది' అని ఆ డాక్యుమెంటరీలో ఫిఫా పేర్కొంది. ప్రస్తుతం సాకర్ ఆడుతున్న వారిలో రొనాల్డో (117), మెస్సీ (90) తర్వాత ఛెత్రి (84) అత్యధిక గోల్స్ చేసిన వారి జాబితాలో మూడో స్థానంలో ఉండడం విశేషం.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.